www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

లోక్‌పాల్‌గా జస్టిస్ ఖన్విల్కర్



సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తిని నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు

రెండేళ్ల తర్వాత లోక్‌పాల్ నియామకం

సభ్యులుగా జస్టిస్ లింగప్ప నారాయణ స్వామి, జస్టిస్ సంజయ్ యాదవ్, జస్టిస్ రితు రాజ్ అవస్థి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అజయ్ మాణిక్‌రావు ఖన్విల్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసింది. ఈ పదవి సుమారు రెండేళ్లపాటు ఖాళీగా ఉండడం గమనార్హం. కడపటి లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన

మిగతా 2వ పేజీలో...

బుధవారం | 28-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 331

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చవితి తె. 4.20 తదుపరి పంచమి; నక్షత్రం: హస్త ఉ. 7.34 తదుపరి చిత్త; వర్జ్యం: సా. 4.30-6.17; దుర్ముహూర్తం: మ. 12.05-12.52; అమృతఘడియలు: తె. 3.13-5.01; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.39; సూర్యాస్తమయం: 6.18

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మగాడివైతే ఒక్క సీటు గెలిపించుకో

కేటీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్



మేము ఎప్పుడు పోతామా అని చూస్తారా?

నువ్వేకాదు.. మీ అయ్య కూడా ఈ కుర్చీని తాకలేడు

అల్లాటప్పాగా రాలేదు.. కార్యకర్తల కష్టంతో వచ్చాం

రాష్ట్రాన్ని దోచుకున్న మీకు ప్రజలు బుద్ధి చెప్పారు

కేంద్రంలో బీజేపీ, బీఆర్ఎస్ కలిసే ఉన్నాయి

నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తే వారికి కడుపుమంట

త్వరలో మెగా డీఎస్సీ.. మార్చి, ఏప్రిల్‌లో 7వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్: రేవంత్‌రెడ్డి

చేవెళ్ల సభలో సీఎం ఆవేశపూరిత ప్రసంగం

ఆర్థిక ఇబ్బందులున్నా అమలు చేసి తీరతాం

ఆరు గ్యారెంటీలను పక్కాగా అందిస్తాం

రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాలను ప్రారంభించిన రేవంత్

రూ.400 ఉన్న సిలిండర్‌ను 1200కు పెంచిన మోదీ

కేసీఆర్ దానిని ఆదాయ వనరుగానే చూశారు: సీఎం



సచివాలయంలో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ప్రారంభం సందర్భంగా ఓ లబ్ధిదారుకు సిలిండర్ అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

"నువ్వు మగాడివైతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో మీ పార్టీకి ఒక్క సీటు గెలిపించి చూపించు" అని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సవాల్ చేశారు. "నువ్వు వస్తావా? నీ అయ్య వస్తాడా? మా కార్యకర్తలు చూసుకుంటారు బిడ్డా" అంటూ హెచ్చరించారు. మంగళవారం చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర సభలో రేవంత్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. "బీఆర్ఎస్ నేతలు పొద్దున లేస్తే చెత్తవాగుడు వాగుతూ.. ఈ ప్రభుత్వం ఎప్పుడు పోతుందా, మేమెప్పుడు కూర్చుంటామా అని ఆలోచిస్తున్నారు. ఒకరేమో

మిగతా 13వ పేజీలో...

అమల్లోకి 'గృహజ్యోతి'

200 యూనిట్ల దాకా విద్యుత్తు వాడే అర్హులకు మార్చిలో జీరో బిల్లు

తెల్ల రేషన్ కార్డే ప్రామాణికం.. నిరంతర ప్రక్రియగా దరఖాస్తులు 13

ఎంపీడీవో, మునిసిపాలిటీ ఆఫీసుల్లో స్వీకరణ

గృహేతర అవసరాలకు వాడితే కేసులు: సర్కార్

సిలిండర్‌కు ముందస్తు చెల్లింపులు కొద్ది రోజులే

ఆ తర్వాత రూ.500 చెల్లిస్తే చాలు

ఆర్థిక, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో సబ్సిడీ బదిలీ 13

'మహాలక్ష్మి' పథకానికి మార్గదర్శకాలు జారీ

అర్హులై.. పేరులేని వారి నమోదుకు చాన్స్

మండల కార్యాలయాల్లో గ్యాస్, ఆధార్, రేషన్ కార్డులిస్తే సరి



బయో ఆసియా సదస్సులో రిథమ్ డివైజ్‌ను చూపుతున్న ప్రతినిధులు

త్వరలో జీనోమ్ వ్యాలీ-2

రూ.2 వేల కోట్లతో 300 ఎకరాల్లో ఏర్పాటు

వికారాబాద్, మెదక్, నల్లగొండ జిల్లాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఫార్మాక్లస్టర్లు

పది ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది

రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో ఐదు లక్షల మందికి ఉద్యోగాలు

బయో ఆసియా సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

త్వరలో కొత్త లైఫ్‌సైన్సెస్ పాలసీ: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నోబెల్ విజేత గ్రెగ్ సెమెన్జాకు జీనోమ్ వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వ్యాక్సిన్ల తయారీలో ప్రపంచానికే తలమానికంగా నిలిచిన హైదరాబాద్‌లో.. ఫార్మా కంపెనీల కేంద్రమైన జీనోమ్‌వ్యాలీని మరింత విస్తరించనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హెచ్ఐసీసీలో 21వ బయో ఆసియా సదస్సును మంగళవారం ప్రారంభించిన సీఎం.. 300 ఎకరాల్లో రూ.2000 కోట్ల పెట్టుబడులతో రెండో దశ జీనోమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో పది ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైందని.. దీంతో మౌలిక సదుపాయాలతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని.. 5 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయని ఆయన

మిగతా 12వ పేజీలో...

డాక్టర్ ఎక్కడో.. స్కానింగ్ ఇక్కడ!

రోబోతో దూరం నుంచే అల్ట్రా సౌండ్ స్కానింగ్

ఇంట్లోనే చిన్నారులకు డయేరియా పరీక్షకు కిట్

పెద్దవయసు వారు పడిపోకుండా ఆపే హిప్ ప్రో 12

వినూత్న ఆవిష్కరణల వేదికగా బయో ఆసియా



'పతంజలి'కి కోర్టు ధిక్కరణ నోటీసులు

తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు వైద్య ఉత్పత్తుల ప్రకటనలపై సుప్రీం ఆంక్షలు 2

తప్పుడు సమాచారం ఇవ్వొద్దన్న ఆదేశాలు ఉల్లంఘించినట్టు ఐఎంఏ ఫిర్యాదు

యోగాతో మధుమేహం, ఉబ్బసం పూర్తిగా తగ్గుతాయనడంపై అభ్యంతరం

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు 9

లోన్‌యాప్ ఏజెంట్ల వేధింపులు..

విద్యార్థి ఆత్మహత్య

ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బు పోగొట్టుకుని లోన్‌యాప్స్‌లో రుణం 9

అప్పు తీర్చలేక, బెదిరింపులు తాళలేక ఇంజనీరింగ్ విద్యార్థి బలవన్మరణం

ఆ రైళ్లలో మళ్లీ ఆర్డినరీ చార్జీలు! 2

'ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్'గా పేరు మార్చిన ప్యాసింజర్ రైళ్లలో చార్జీల తగ్గింపు

కనీస చార్జీ రూ.30 నుంచి రూ.10కి!

మండనున్న ఎండలు

12 జిల్లాల్లో ఇప్పటికే 35 డిగ్రీలు

మార్చి 1నుంచి 37డిగ్రీలకు పెరిగే చాన్స్!

గురువారం నుంచి ఐదు జిల్లాలు మినహా అంతటా ఎల్లో అలెర్ట్ 12

గగన వీరులు సిద్ధం!

గగన్‌యాన్ వ్యోమగాములను దేశానికి పరిచయం చేసిన మోదీ

వైమానిక దళం నుంచి నలుగురిని 2019లోనే ఎంపిక చేసిన ఇస్రో

యూపీ నుంచి ఇద్దరు, చెన్నై, కేరళ నుంచి ఒక్కొక్కరు ఎంపిక

నాలుగేళ్లుగా వివిధ స్థాయిల్లో శిక్షణ

వీరు వ్యక్తులు కాదు.. ప్రజల ఆకాంక్షలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే శక్తులు

సరికొత్త శిఖరాలకు భారత కీర్తి

2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రం

ఇస్రోలో మహిళా శక్తి అనిర్వచనీయం

'ఆగస్టు 23' ఇక.. జాతీయ అంతరిక్ష దినోత్సవం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలు

మూడు కీలక ప్రాజెక్టులు జాతికి అంకితం



వ్యోమగాములతో కరచాలనం చేస్తున్న ప్రధాని మోదీ

తిరువనంతపురం, ఫిబ్రవరి 27: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మానవ సహిత అంతరిక్ష యాత్ర.. గగన్‌యాన్ ద్వారా రోదసీలోకి వెళ్లే వ్యోమగాములను ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి పరిచయం చేశారు. గగన్‌యాన్ కోసం భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన నలుగురిని 2019లోనే ఎంపిక చేశారు. వీరిలో గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, సుభాంశు శుక్లా ఉన్నారు. వీరిని ప్రత్యేకంగా అభినందించిన ప్రధాని, భారత దేశం నుంచి రోదసీలోకి వెళ్లనున్న వ్యోమగాములు వీరేనని పరిచయం చేశారు. మంగళవారం కేరళలోని తిరువనంతపురంలో పర్యటించిన ప్రధాని తుంబాలోని విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రానికి(వీఎస్ఎస్‌సీ) వెళ్లారు. రోదసీలోకి వెళ్లనున్న వ్యోమగాములను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "40 ఏళ్ల తర్వాత

మిగతా 2వ పేజీలో...

రాజ్యసభ ఎన్నికల్లో హైడ్రామా!

కర్ణాటక అసెంబ్లీలో మాజీ సీఎం కుమార స్వామి, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కరచాలనం



మూడు రాష్ట్రాల్లోనూ క్రాస్ ఓటింగ్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్‌కు ఎదురుదెబ్బ

ఉమ్మడి అభ్యర్థి కుపేంద్ర రెడ్డి పరాజయం

3 స్థానాలు 'హస్త'గతం.. కమలానికి ఒకటే

హిమాచల్‌లో కాంగ్రెస్ నేత సింఘ్వీ ఓటమి

సమానంగా ఓట్లు.. 'డ్రా'లో బీజేపీదే అదృష్టం

9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్!

అవిశ్వాస తీర్మానం పెట్టే ప్రయత్నాల్లో బీజేపీ

మా ఎమ్మెల్యేలను కిడ్నాప్ చేశారు: సీఎం సుఖు

కాంగ్రెస్ అప్రమత్తం.. నేడు సిమ్లాకు డీకే

యూపీలో కమలానికి దక్కిన అదనపు సీటు

బీజేపీకి 8.. సమాజ్‌వాదీ పార్టీకి రెండు సీట్లే!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: మూడు రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉత్తరప్రదేశ్‌లో 10, కర్ణాటకలో 4, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక రాజ్యసభ స్థానానికి మంగళవారం పోలింగ్ నిర్వహించారు. కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీల ఉమ్మడి అభ్యర్థి ఓడిపోయారు. హిమాచల్‌లో అధికార కాంగ్రెస్‌కు చుక్కెదురైంది. క్రాస్ ఓటింగ్‌తో ఆ పార్టీ ప్రముఖ నాయకుడు అభిషేక్ మను సింఘ్వీ ఓటమి

మిగతా 2వ పేజీలో...

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు

యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

హామీల అమలును ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?

నేను ఓడితే.. రాజకీయ సన్యాసం తీసుకుంటా

కాంగ్రెస్ అభ్యర్థి ఓడితే పొన్నం తప్పుకుంటారా?

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్ 7

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

పలు చోట్ల నిరసనలు

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు.. సంజయ్ జాగ్రత్త: పొన్నం

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి



అసదుద్దీన్‌ను పార్లమెంటుకు వెళ్లనివ్వొద్దు 7

కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి

ఒక్క రూపాయి అవినీతి లేకుండా మోదీ పాలన

విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



రాడిసన్‌లో డ్రగ్స్ కేసు..

నేడు పోలీసు విచారణకు క్రిష్!

హాజరు కానున్న ప్రముఖ సినీ దర్శకుడు

మళ్లీ టాలీవుడ్‌లో డ్రగ్స్ కలకలం

ఏపీకి చెందిన పారిశ్రామికవేత్త హస్తం?

ఇప్పటి వరకు నలుగురి అరెస్టు

పరారీలో మరో ఆరుగురు నిందితులు

వారిలో చరణ్, సందీప్, నీల్, నటి లిషి, శ్వేత

వారంతా ఎక్కడ దాక్కున్నారు? 12

గాలిస్తున్న ప్రత్యేక బృందాలు

రాడిసన్‌లోని జంట గదులపై ఫోకస్

డ్రగ్స్ పార్టీలన్నీ వాటిలోనే..!

1న చలో మేడిగడ్డ

కాళేశ్వరం ప్రాజెక్టులన్నింటినీ సందర్శిస్తాం

అక్కడి నుంచే కాంగ్రెస్ కుట్రలు బయటపెడతాం

ఇష్టమైతే ఆ పార్టీ నాయకులూ రావచ్చు.. మా పార్టీ అధినేత కేసీఆర్ రారు

కాళేశ్వరాన్ని కూల్చేందుకు సర్కార్ కుట్ర.. చిన్న సమస్యకే బద్నాం చేస్తున్నరు

10న కరీంనగర్‌లో బీఆర్ఎస్ బహిరంగ సభ: కేటీఆర్



హైదరాబాద్/సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): "మేడిగడ్డ బ్యారేజీలో 84 పిల్లర్లు ఉంటే 3 మాత్రమే కుంగిపోయాయి. దాంతో బ్యారేజీ మొత్తం కొట్టుకుపోయినట్లు కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. మేడిగడ్డపై నుంచే వారి కుట్రలను బయట పెడతాం. ప్రజలకు అసలు నిజాలు తెలియపరిచే ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మార్చి 1న చలో మేడిగడ్డ కార్యక్రమం చేపట్టనున్నాం" అని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో, అంబర్‌పేట

మిగతా 14వ పేజీలో...

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి

తాగునీటిలోనూ లాభం వెతుకుతారా? 7

ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం

ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్

లోక్‌పాల్‌గా జస్టిస్ ఖన్విల్కర్

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ 2022 మే 27న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఆ పదవి భర్తీ కాలేదు. లోక్‌పాల్ జ్యుడీషియల్ సభ్యుడు ప్రదీప్ కుమార్ మహంతి ప్రస్తుతం తాత్కాలిక చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఎ.ఎం.ఖాన్విల్కర్ 2022 జులైలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. లోక్‌పాల్ జ్యుడీషియల్ సభ్యులుగా విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ లింగప్ప నారాయణ స్వామి, జస్టిస్ సంజయ్ యాదవ్, జస్టిస్ రితు రాజ్ అవస్థిలు నియమితులయ్యారు. నాన్ జ్యుడీషియల్ సభ్యులుగా సుశీల్ చంద్ర, పంకజ్ కుమార్, అజయ్ టిర్కేలు నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వారి పదవీ కాలం మొదలవుతుంది. ప్రధాన మంత్రి ఆధ్వర్యంలోని సెలక్షన్ కమిటీ వీరిని ఎంపిక చేసింది. లోక్‌పాల్‌లో ఒక చైర్మన్, ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. సభ్యుల్లో నలుగురు జ్యుడీషియల్, మరో నలుగురు నాన్ జ్యుడీషియల్ విభాగాలకు చెందిన వారు ఉంటారు.

'ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్' రైళ్లలో మళ్లీ ఆర్డినరీ చార్జీలు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: రైలు ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. 'ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్'గా పేరు మార్చిన ప్యాసింజర్ రైళ్లలో సెకండ్ క్లాస్ ఆర్డినరీ చార్జీలను మంగళవారం నుంచి పునరుద్ధరించింది. దీంతో ఆ రైళ్లలో టికెట్ చార్జీలు 50% వరకు తగ్గాయి. లాక్‌డౌన్ తర్వాత రైల్వే శాఖ ప్యాసింజర్ రైళ్ల పేరును 'ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్'గా మారుస్తూ వచ్చింది. కొత్త పేరు ఆధారంగా చార్జీలు వసూలు చేస్తూ ఆర్డినరీ చార్జీలకు చెల్లుచీటీ చెప్పింది. దీంతో కనీస టికెట్ ధర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సమానంగా రూ.10 నుంచి రూ.30కు పెరిగింది. అదే రైలు.. అదే వేగం.. కేవలం పేరు మార్చి రైల్వే శాఖ ప్రయాణికులపై, ముఖ్యంగా చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు, పేదలపై భారం వేయడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సోమవారం రైల్వే బోర్డు సమీక్షా సమావేశం నిర్వహించి.. మంగళవారం అర్ధరాత్రి నుంచి పాత చార్జీలనే వసూలు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని రైల్వే జోన్లకు ఆదేశాలు పంపింది.

జయప్రద పరారీలో ఉన్న నిందితురాలు

» ఆమెను అరెస్టు చేయండి.. యూపీ ప్రత్యేక కోర్టు ఆదేశం

రాంపూర్ (యూపీ), ఫిబ్రవరి 27: ప్రముఖ సినీనటి, మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు జయప్రదను అరెస్టు చేయాలని ఉత్తరప్రదేశ్‌లోని ప్రత్యేక కోర్టు మంగళవారం పోలీసులను ఆదేశించింది. ఆమె 'పరారీలో ఉన్న నిందితురాలు' అని అధికారికంగా ప్రకటించింది. ఆమెపై ఉన్న రెండు కేసుల విచారణ నిమిత్తం ఏడుసార్లు నాన్‌బెయిలబుల్ వారెంట్లు పంపించినప్పటికీ కోర్టుకు హాజరు కాకపోవడంతో ఆ ఆదేశాలు ఇచ్చింది. ఆమెను పట్టుకునేందుకు డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని రాంపూర్‌లోని ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక న్యాయస్థానం జడ్జి శోభిత్ బన్సల్ జిల్లా ఎస్పీని ఆదేశించారు. ఆమెను మార్చి ఆరో తేదీన కోర్టులో హాజరుపరచాలని సూచించారు. 2019 లోక్‌సభ ఎలక్షన్ల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారన్న ఆరోపణలతో జయప్రద మీద రెండు కేసులు నమోదయ్యాయి. ఆ ఎన్నికల్లో ఆమె బీజేపీ తరఫున రాంపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి అజాం ఖాన్ చేతిలో ఓటమిపాలయ్యారు.

పూవర్తి కేంద్రంగా ఆపరేషన్ హిడ్మా

చర్ల/దమ్ముగూడెం, ఫిబ్రవరి 27: పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మోస్ట్‌వాంటెడ్ మడివి హిడ్మా కోసం కేంద్ర బలగాలు 'ఆపరేషన్ హిడ్మా'ను ప్రారంభించాయి. హిడ్మా సొంతూరు-- ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా పూవర్తి గ్రామం నుంచే బలగాలు పావులు కదుపుతున్నాయి. ఇంతకాలం మావోయిస్టులకు కంచుకోటగా.. వ్యూహాత్మక గ్రామంగా పూవర్తి ఉండేది. 2021లో తెర్రాం వద్ద 23 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను వ్యూహాత్మకంగా చంపేయడానికి హిడ్మా స్కెచ్ వేసింది కూడా పూవర్తి నుంచే.! దీంతో మావోయిస్టుల వ్యూహాత్మక ప్రాంతంలో పాగా వేయాలని సీఆర్పీఎఫ్ నిర్ణయించింది. పూవర్తిని తమ ఆధీనంలోకి తీసుకుంది. హిడ్మా ఇల్లు, గెస్ట్‌హౌస్‌లనూ స్వాధీనం చేసుకుంది. 'ఆపరేషన్ హిడ్మా'కు సీఆర్పీఎఫ్ ఐదు కంపెనీల బలగాలను నియమించింది. ఒక్కో కంపెనీలో సుమారు 200 మంది జవాన్లు ఉంటారు. కాగా, బీజాపూర్ జిల్లా జంగ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పోలీసు, మావోయిస్టుల మధ్య హోరాహోరీ కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు చనిపోయారు.

ఐసీయూలో మహిళా పేషెంట్‌పై అత్యాచారం

జైపూర్, ఫిబ్రవరి 27: ఓ ప్రయివేటు ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న మహిళా పేషెంట్‌పై అత్యాచారం జరిగిన సంఘటన రాజస్థాన్‌లోని ఆల్వార్‌లో చోటుచేసుకుంది. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సమస్యతో బాధపడుతున్న 24 ఏళ్ల మహిళ ఆ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. మంగళవారం వేకువఝాము నాలుగు గంటల సమయంలో ఐసీయూలో నర్సింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చిరాగ్ యాదవ్ ఆమెపై అత్యాచారం చేసినట్టు పోలీసులు తెలిపారు. అతడ్ని చూసి భయపడ్డ ఆమె కేకలు వేయడానికి ప్రయత్నించగా మత్తు మందు ఇంజెక్షన్ ఇచ్చాడు. దాంతో స్పృహ కోల్పోయిన ఆమెపై దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు శివాజీ పార్క్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజ్‌పాల్ సింగ్ చెప్పారు.

కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సలు వికటించి కర్ణాటలో ముగ్గురు మహిళల మృతి

బెంగళూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లా పావగడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 22న నిర్వహించిన కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు వికటించాయి. శస్త్ర చికిత్స చేయించుకున్న ఏడుగురు మహిళల్లో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. మృతిచెందిన వారిలో పావగడ తాలూకాలోని రాజవంతి గ్రామానికి చెందిన అంజలి (22), వీర్ల గొంది గ్రామానికి చెందిన అనిత (28), బ్యాడనూరు గ్రామానికి చెందిన నరసమ్మ (40) ఉన్నారు. వీరిలో అంజలి, అనితకు సిజేరియన్ ఆపరేషన్‌తోపాటు కు.ని. చికిత్స కూడా నిర్వహించారు. నరసమ్మకు కేవలం కు.ని. శస్త్రచికిత్స చేశారు. అనిత ఆపరేషన్ జరిగిన రోజే మృతి చెందగా, మిగిలిన ఇద్దరు ఈనెల 24న మృతి చెందారు.

కేజ్రీవాల్‌కు ఎనిమిదో సారి ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు ఈడీ మంగళవారం ఎనిమిదోసారి నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో విచారణ కోసం మార్చి 4న తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఆయనకు ఈడీ ఇప్పటికే ఏడుసార్లు నోటీసులు పంపించగా వాటన్నింటినీ నిరాకరించారు. ఏడో సారి జారీ చేసిన నోటీసుల గడువు సోమవారం ముగియగా మరుసటి రోజే ఇంకోసారి నోటీసులు ఇచ్చింది.

నిరుద్యోగుల కలలకు 'మోదీ గ్రహణం': రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కేంద్రం నిరుద్యోగుల జీవితాలతో చలగాటం ఆడుతోందని, మోదీ ప్రభుత్వం.. నిరుద్యోగుల కలలకు పట్టిన గ్రహణం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన పేపర్ లీకేజీ ఘటనపై మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. దేశ భవిష్యత్తుకు మోదీ ప్రభుత్వం శత్రువుగా మారిందని మండిపడ్డారు. "నిరుద్యోగులు న్యాయం చేయాలని కోరితే వారిపై లాఠీ చార్జ్ చేస్తున్నారు. ఉద్యోగాలు కల్పించే సంస్థలను మోదీ తన స్నేహితులకు అమ్ముకుంటున్నారు. దోపిడీ.. మోదీ గ్యారంటీ. ఈ నేరం చేసిన మోదీని చరిత్ర ఎప్పటికీ క్షమించదు." అని రాహుల్ గాంధీ విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్క ఉద్యోగ నియామక పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేక పోయిందని ఎద్దేవాచేశారు.

నా తొలి ఓటు దేశం కోసం.. కేంద్రం వినూత్న ప్రచారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కొత్తగా ఓటరుగా నమోదైన యువతకు ఓటు హక్కు వినియోగంపై మరింత అవగాహన కల్పించడమే లక్ష్యంగా "మేరా పెహ్లా ఓట్ దేశ్‌కేలియే(నా తొలి ఓటు దేశం కోసం)" అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ఓ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందుకు సంబంధించి కేంద్ర సమాచార, ప్రసార శాఖ ఓ వీడియో గీతాన్ని విడుదల చేసింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయనున్న 1.85 కోట్ల మంది యువతను ప్రోత్సహించేందుకే ఈ ప్రచారాన్ని చేపట్టామని తెలిపింది. తొలిసారి ఓటు వేసేవారికి ఓటు హక్కుపై మరింత అవగాహన కల్పించేందుకు దేశంలోని అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 6వ తేదీ దాకా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని మార్గదర్శకాలు జారీచేసింది.

గగన వీరులు సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

భారతీయులు అంతరిక్షంలోకి వెళ్లనున్నారు. 'సమయం మనదే-కౌంట్‌డౌన్ కూడా మనదే'. ప్రతి దేశ అభివృద్ధిలో ఒక సమయం ఆసన్నమవుతుంది. ఈ రోజు ఆ సమయం భారత్‌కు వచ్చింది. మన ప్రస్తుత తరం ఎంతో ధన్యమైంది. ఎందుకంటే, వారు నీటిలోను, భూమి మీద, ఇప్పుడు అంతరిక్షంలో కూడా విజయాన్ని చూడగలుగుతారు. ఇది ఒక కొత్త శకానికి నాంది. ప్రపంచ స్థాయిలో భారత్ విస్తరిస్తోంది. ఇప్పుడు అంతరిక్ష రంగంలోనూ స్పష్టంగా కనిపిస్తోంది" అని అన్నారు. "గతేడాది చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ ప్రయోగించి ప్రపంచంలోనే తొలిదేశంగా కీర్తిగడించాం. నేడు మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. తొలిసారి ఈ దేశం నుంచి నలుగురు వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లనున్నారు. ఈ నలుగురు కేవలం వ్యక్తులు కారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను అంతరిక్షంలోకి తీసుకువెళ్లే శక్తులు" అని మోదీ పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో ఈ నలుగురి పేర్లు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. నాలుగేళ్లుగా వీరు కఠిన శిక్షణ పొందారని, దీనిలో యోగా కీలక పాత్ర పోషించిందని వివరించారు.

మూడు రోజులపాటు సాగే 'గగన్‌యాన్'లో వ్యోమగాములను 400 కిలోమీటర్ల కక్ష్యలోకి ప్రవేశ పెడతారు. అనంతరం వారిని సురక్షితంగా కిందికి తీసుకువస్తారు. 2025లో ఈ ప్రయోగాన్ని చేపట్టాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకొంది.

నాలుగేళ్లుగా తపస్సు చేశారు: మోదీ

"రోదసీలోకి వెళ్లే ఈ నలుగురు వీరులు గత నాలుగు సంవత్సరాలుగా తపస్సు చేశారు. వారు ఇంకా చాలా దూరం(అంతరిక్షం) వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో అనేక సవాళ్లు ఉన్నాయి. అయితే, వారు ఇప్పుడు సెలబ్రిటీలు. నాకు తెలుసు.. ప్రజలు వీరితో సెల్ఫీలు దిగాలని, ఆటోగ్రాఫ్ తీసుకోవాలని ఉత్సుకతతో ఉన్నారు. వారి జీవిత విశేషాలు తెలుసుకునేందుకు ఆతృతగా కూడా ఉన్నారు. కానీ, ఇలా చేయడం వారి విజయాలకు ఇబ్బంది కలిగిస్తుంది. అసలు కథ ఇప్పుడే మొదలైంది. మనమంతా వారికి, వారి కుటుంబాలకు సహకరించాలి. లక్ష్య సాధన దిశగా వారిని ముందుకు నడిపించాలి" అని మోదీ అన్నారు.

మహిళల పాత్ర అమోఘం

అంతరిక్ష రంగంలో మహిళల శక్తి కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని కొనియాడారు. "చంద్రయాన్, గగన్‌యాన్ ఇలా ఏది రూపుదాల్చినా మహిళా శక్తిని విస్మరించలేం. వారి పాత్ర అమోఘం. దాదాపు 500 మంది మహిళలు ఇస్రోలో నాయకత్వ పాత్ర పోషిస్తున్నారు. వారందరినీ నేను అభినందిస్తున్నా" అన్నారు. అంతరిక్ష రంగం యువతను ఎంతో ఆకర్షిస్తోందని తెలిపారు. ఇస్రో సాధిస్తున్న అద్భుతాలను చూసిన చిన్నారులు సైతం శాస్త్రవేత్తలు కావాలని అభిలషిస్తున్నారని, లక్షల మంది చిన్నారులకు ఇస్రో స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. "చంద్రయాన్-2 ల్యాండింగ్ సమయంలో ఎంతో మంది చిన్నారులు దీనిని వీక్షించారు. ఎన్నో నేర్చుకున్నారు. చంద్రయాన్-3 ఆగస్టు 23న విజయవంతంగా ల్యాండైంది. ఈ నేపథ్యంలో రానున్న ఆగస్టు 23, 2024ను 'జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా పేరు పెట్టనున్నాం. ఇస్రో అనేక అద్భుత రికార్డులను సొంతం చేసుకుంది" అని ప్రధాని తెలిపారు. అనేక దేశాలు సాధించడంలో విఫలమైన ఆదిత్య-ఎల్ 1(సూర్యుడిపై ప్రయోగం)ను ఇస్రో సాధించిందని కొనియాడారు. ఈ సందర్భంగా మూడు కీలక ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. వీటిలో శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ కూడా ఉంది.

ప్రపంచం మనవైపే

"పలు కీలక ప్రయోగాల ద్వారా ఇస్రోను పరుగులు పెట్టిస్తున్నాం. ముఖ్యంగా చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్ 1 వంటివి ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూసేలా చేశాయి. 2047 నాటికి దేశాన్ని 'వికసిత భారత్'గా అభివృద్ధి పరచాలన్న కీలక లక్ష్యంలో ఇస్రో కూడా ముఖ్య భూమిక పోషిస్తుంది. ఆదిశగా అడుగులు వేస్తోంది" అని ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. 40 ఏళ్లలో దేశ ప్రధాని ఇస్రోని సందర్శించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు.

సుదీర్ఘ శిక్షణ

రోదసీ ప్రయాణానికి 2019లో మొత్తం 12 మంది టెస్ట్ పైలట్‌లు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అనేక వడపోతల తర్వాత ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్, ఇస్రో సంయుక్తంగా నలుగురిని ఎంపిక చేశాయి. తర్వాత వారిని రష్యాలో ప్రాథమిక శిక్షణకు పంపించారు. అయితే, కరోనా నేపథ్యంలో ఈ శిక్షణ కొంత ఆలస్యంగా 2021 నాటికి పూర్తయింది. అప్పటి నుంచి దేశంలోనే వారికి వివిధ మాడ్యూల్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కోసం సాయుధ బలగాలు సహా పలు ఏజెన్సీలతో ఇస్రో ఒప్పందం చేసుకుంది. వైమానిక దళంలోనూ వీరికి మరింత శిక్షణ ఇచ్చారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలోనూ అనేక జాగ్రత్తలు పాటించారు. భారత్ నుంచి స్వదేశీ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్న మొదటి భారతీయ బృందంగా వీరు రికార్డు సృష్టించనున్నారు.

2035లో అంతరిక్ష కేంద్రం

ఈ ఏడాది స్వల్ప కాలంలో ఎక్స్‌పోశాట్, ఇన్‌శాట్-3డీఎస్ వంటివి పూర్తి చేసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. రానున్న పదేళ్లలో భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 40 బిలియన్ డాలర్లకు చేరుకోనుందని ప్రధాని తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ అతి పెద్ద వాణిజ్య కేంద్రంగా అవతరించనుందని వెల్లడించారు. 2035 నాటికి భారత్ సొంతగా అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. "ఇది మాత్రమేకాదు, ఈ అమృత కాలంలో భారత వ్యోమగామి.. చంద్రునిపై కాలు మోపే రోజు త్వరలోనే రానుంది" అని మోదీ పేర్కొన్నారు.



ప్రశాంత్ నాయర్: కేరళలో 1976లో జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి. ఖడ్గ సత్కార గ్రహీత. 1998లో ఐఏఎఫ్ యుద్ధ విమానాల విభాగంలో నియామకం పొందారు. 3000 గంటల అనుభవం ఉంది. ఎస్‌యూ-30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, హాక్, డార్నియర్, ఏఎన్-32లను నడిపిన అనుభవం ఉంది.



అజిత్ కృష్ణన్: చెన్నైలో 1982లో జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి. రాష్ట్రపతి పసిడి పతకంతో సహా వైమానిక అకాడమీలో ఖడ్గ సత్కార గ్రహీత. 2003లో ఐఏఎఫ్ యుద్ధ విమానాల విభాగంలో నియామకం పొందారు. 2900 గంటల అనుభవం ఉంది. ఎస్‌యూ-30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, హాక్, డార్నియర్, ఏఎన్-32లను నడిపిన అనుభవం ఉంది.




అంగద్ ప్రతాప్: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో 1982లో జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి. 2004లో ఐఏఎఫ్ యుద్ధ విమానాల విభాగంలో నియామకం పొందారు. 2000 గంటల అనుభవం ఉంది. ఎస్‌యూ-30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, హాక్, డార్నియర్, జాగౌర్, ఏఎన్-32లను నడిపిన అనుభవం ఉంది.



సుభాంశు శుక్లా: ఉత్తర ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో 1985లో జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి. 2006లో ఐఏఎఫ్ యుద్ధ విమానాల విభాగంలో నియామకం పొందారు. 2000 గంటల అనుభవం ఉంది. ఎస్‌యూ-30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, హాక్, డార్నియర్, జాగౌర్, ఏఎన్-32లను నడిపిన అనుభవం ఉంది.

లోకం తీరు



కేరళలో కుస్తీ.. బయట దోస్తీ

» కాంగ్రెస్-లెఫ్ట్ తీరుపై మోదీ ఆగ్రహం

చెన్నై-ఆంధ్రజ్యోతి/తిరువనంతపురం, ఫిబ్రవరి 27: కాంగ్రెస్, వామపక్షాల బంధంపై ప్రధాని మోదీ మండిపడ్డారు. కేరళలో శత్రువుల్లా కుస్తీలు పడుతున్నాయని.. మిగతా రాష్ట్రాల్లో మాత్రం బాయ్‌ఫ్రెండ్స్‌లా కౌగలించుకుంటున్నాయని ఎద్దేవాచేశారు. మంగళవారం ఉదయం తిరువనంతపురంలో, సాయంత్రం తిరుప్పూరు జిల్లా మాదాపురం బహిరంగసభల్లో మోదీ ప్రసంగించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేది లేదని ఇండియా కూటమికి అర్థమైందన్నారు. 'కేరళలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఫాసిస్టు సర్కారని కాంగ్రెస్ విమర్శిస్తోంది. కాంగ్రెస్ కార్యకర్తలపై కమ్యూనిస్టులు లాఠీచార్జి చేయిస్తున్నారు. కానీ ఇండియా కూటమి సమావేశాల్లో వీరంత కలిసి కూర్చుని సమోసాలు, బిస్కెట్లు తింటారు. వీళ్ల మోసాలకు కేరళ ప్రజలు తగు విధంగా బుద్ధి చెబుతారు' అని వ్యాఖ్యానించారు. దేశం కంటే ఒక్క కుటుంబ ప్రయోజనాలే కాంగ్రెస్‌కు ముఖ్యమని, ఇప్పుడు కమ్యూనిస్టులు కూడా ఇదే పాటిస్తున్నారని అన్నారు. వయనాడ్‌లో యువరాజు (రాహుల్‌గాంధీ) పోటీచేయొద్దంటూ కాంగ్రెస్‌కు వారు సలహా ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. తమిళనాడులో దివంగత ఎంజీఆర్ కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించలేదని.. డీఎంకే కుటుంబ రాజకీయాలు ఆయనకు అవమానమని పేర్కొన్నారు. 'అమ్మ' జయలలిత తన యావజ్జీవితాన్ని ప్రజాసంక్షేమానికి అంకితం చేశారని కొనియాడారు. ఉత్తరాదిన తమ పప్పులు ఉడకవని గ్రహించిన 'ఇండియా' కూటమి నేతలు తమిళనాడును కొల్లగొట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ దోపిడీగాళ్ల దుకాణానికి తాళం వేయడమే తన కర్తవ్యమని పేర్కొన్నారు.

అధిక పింఛన్ కల్లేనా?

» లెక్కింపులో ఈపీఎఫ్‌వో కొత్త నిబంధన

» పింఛన్ మొత్తం 30% తగ్గే అవకాశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: అధిక పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న సభ్యుల పింఛన్ లెక్కింపులో ఈపీఎఫ్‌వో కొత్త నిబంధనను ఎంచుకున్నట్టు తెలిసింది. 2014 సెప్టెంబరు 1న లేదా ఆ తర్వాత రిటైరైన సభ్యుల సర్వీసు కాలాన్ని రెండు భాగాలుగా విభజించి, దామాషా పద్ధతిలో పింఛన్ లెక్కిస్తున్నట్టు సమాచారం. దీనివల్ల ఉద్యోగుల పింఛన్ పథకం(ఈపీఎస్ 95) సభ్యుల పింఛన్ 30% నుంచి 40% వరకు తగ్గే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివిధ ప్రాంతాల్లోని ఈపీఎఫ్‌వో కార్యాలయాల నుంచి అనధికారికంగా ఈ సమాచారం అందినట్టు న్యాయవాద శిక్షణ సంస్థ 'ఎకనమిక్ లాస్ ప్రాక్టీస్'కు చెందిన కార్మిక, ఉపాధి శిక్షణ విభాగం అధిపతి వీవీ మూర్తి తెలిపారు. అయితే, ఈ విషయంపై ఈపీఎఫ్‌వో సర్క్యులర్ విడుదల చేయలేదు. ఇప్పటికీ ఉద్యోగం చేస్తున్న, లేదా 2014 సెప్టెంబరు 1నగానీ, ఆ తర్వాతగానీ రిటైరైన సభ్యులపై ఈ కొత్త నిబంధన ప్రభావం చూపనుంది. సగటు పెన్షనబుల్ వేతనం లెక్కింపు కోసం వీరి సర్వీసు కాలాన్ని రెండు భాగాలుగా విభజిస్తున్నారు. ఇందులో మొదటి భాగం 16-11-1995(ఈపీఎస్-95 అమల్లోకి వచ్చిన తేదీ) నుంచి 31-08-2014 వరకు, రెండో భాగం 01-09-2014 నుంచి రిటైర్మెంట్ తేదీ వరకు ఉంటుందని వీవీ మూర్తి తెలిపారు. పింఛన్ లెక్కింపు కోసం మొదటి భాగంలోని చివరి 60 నెలల సగటు వేతనాన్ని, అలాగే, రెండో భాగంలోని చివరి 60 నెలల సగటు వేతనాన్ని వేర్వేరుగా లెక్కిస్తున్నారని వివరించారు. 2014 ఆగస్టు 31 వరకు గరిష్ఠ వేతన సీలింగ్ రూ.6,500గా ఉంది. 2014 సెప్టెంబరు 1 నుంచి దీన్ని రూ.15,000కు పెంచారు. 2014 సెప్టెంబరు కంటే ముందు వరకు వేతన సీలింగ్ చాలా తక్కువ కనుక, నూతన విధానంలో లెక్కింపు వల్ల పింఛన్ తగ్గుతుందని మూర్తి చెబుతున్నారు.

మెడికోల ఆత్మహత్యలపై టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యార్థుల ఆత్మహత్యలపై జాతీయ వైద్య కమిషన్ దృష్టిసారించింది. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యలపై అధ్యయనం చేసేందుకు నేషనల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్స్‌లో 15 మంది సభ్యులుంటారని ఎన్ఎంసీ పేర్కొంది. దీనికి చైర్మన్‌గా డాక్టర్ సురేష్‌ను నియమించింది. ప్రస్తుతం ఆయన బెంగళూరులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్‌లోని సైకియాట్రీ విభాగపు ప్రొఫెసర్‌గా పనిజేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ బృందం ఈ ఏడాది మే 31 నాటికి తన అధ్యయన నివేదికను అందించాలని ఎన్ఎంసీ ఆదేశించింది.

వచ్చే నెల నుంచే సీఏఏ అమలు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: పౌరసత్వ సవరణ చట్టా (సీఏఏ)న్ని కేంద్ర ప్రభుత్వం వచ్చే నెల నుంచి అమలు చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీని కారణంగా ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి శరణార్థులుగా వచ్చిన మతపర మైనార్టీలకు భారత దేశ పౌరసత్వం లభిస్తుంది. పేర్లను నమోదు చేసుకోవడానికి కేంద్ర హోంశాఖ పోర్టల్‌ను సిద్ధం చేసింది. దాని పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించింది. శరణార్థులుగా వచ్చిన వారికి దీర్ఘకాలిక వీసాలు ఇచ్చే అవకాశం కూడా ఉంది. ఆ మూడు దేశాల నుంచి వచ్చిన హిందువులు, బౌద్ధులు, జైన్లు, సిక్కులు, పార్సీలు, క్రైస్తవులకు ఈ సౌకర్యం వర్తిస్తుంది.

రాజ్యసభ ఎన్నికల్లో హైడ్రామా!

(మొదటి పేజీ తరువాయి)



కొత్తగా ఎన్నికైన బీజేపీ రాజ్యసభ సభ్యులతో యూపీ సీఎం యోగి

చవిచూశారు. ఉత్తరప్రదేశ్‌లోనూ పోటీ నువ్వా నేనా అన్నట్లు సాగింది. ఎస్పీ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్‌తో బీజేపీ అదనంగా మరో స్థానం గెలుచుకోగలిగింది. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, ఎల్.మురుగన్ సహా 41 మంది అభ్యర్థులు ఈ నెల 20న వివిధ రాష్ట్రాల నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. మిగిలిన స్థానాలకు మంగళవారం ఓటింగ్ జరిగింది. కర్ణాటకలో అధికార కాంగ్రెస్ మూడు స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ ఒక స్థానంలో విజయం సాధించింది. నాలుగో స్థానం కోసం బరిలోకి దిగిన బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి, పారిశ్రామికవేత్త కుపేంద్రరెడ్డి ఓటమిపాలయ్యారు. బీజేపీ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ మాకన్‌కు క్రాస్ ఓటింగ్ చేశారు. హిమాచల్‌లో రోజంతా హైడ్రామా సాగింది. కాంగ్రెస్‌కు 45 మంది, బీజేపీకి 25 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మరో ముగ్గురు ఇండిపెండెంట్లు. మొత్తం 68 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీ, బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు సమానంగా చెరో 34 ఓట్లు వచ్చాయి. దీంతో డ్రా తీయగా విజయం మహాజన్‌ను వరించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 9 మంది బీజేపీకి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ చేసినట్టు ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఇక ఉత్తరప్రదేశ్‌లో 10 రాజ్యసభ సీట్లకు ఎన్నిక జరగ్గా.. ప్రస్తుత బలాల్ని బట్టి బీజేపీ 7, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) 3 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. కానీ, బీజేపీ ఎనిమిదో అభ్యర్థిని బరిలో నిలిపి.. పోటీని ఆసక్తికరంగా మార్చింది. ఎస్పీ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో కమలం పార్టీ 8 సీట్లు గెలుచుకోగలిగింది. ఎస్పీకి 2 సీట్లే దక్కాయి. పార్టీ సోమవారం నిర్వహించిన సమావేశానికి 8 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం గమనార్హం.

మా ఎమ్మెల్యేలను కిడ్నాప్ చేశారు: సుఖ్వీందర్

తాజా ఓటమి దరిమిలా హిమాచల్‌లో కాంగ్రెస్ సర్కారు మైనారిటీలో పడిపోయిందని, అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని బీజేపీ భావిస్తోంది. రాష్ట్ర బీజేపీ నాయకుడు జైరామ్ ఠాకూర్ బుధవారం ఉదయం గవర్నర్‌ను కలుసుకోవాలని నిర్ణయించడం ఆసక్తి రేపుతోంది. దీంతో హుటాహుటిన హిమాచల్‌కు పార్టీ పరిశీలకుడిగా 'ట్రబుల్‌షూటర్' డీకే శివకుమార్‌ను పంపాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయన బుధవారం నాడే సిమ్లా చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తారని తెలుస్తోంది. తమ ఎమ్మెల్యేలు ఐదారుగుర్ని 'కిడ్నాప్' చేశారని హిమాచల్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు సంచలన ఆరోపణలు చేశారు. సీఆర్పీఎఫ్‌తో పాటు హరియాణా పోలీసులు వారిని తీసుకెళ్లిపోయారన్నారు. బీజేపీ గూండాయిజానికి పాల్పడుతోందని, జైరాం ఠాకుర్ పదే పదే కౌంటింగ్ హాలులోకి వచ్చి అధికారులను బెదిరించారని ఆరోపించారు.

బీజేపీ-జేడీఎస్‌కు రెండో ఓటమి!

బెంగళూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ముగ్గురూ విజయం సాధించడంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. తమ ఎమ్మెల్యేలను బీజేపీ ఎంత ప్రలోభపెట్టినా లొంగకుండా కాంగ్రెస్‌పై విధేయతను చాటుకున్నారని ప్రశంసించారు. మరోవైపు, లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన రెండు ఎన్నికల్లోనూ బీజేపీ-జేడీఎస్ కూటమి పరాజయాలను మూటగట్టుకుంది. ఇటీవల జరిగిన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు ఇప్పుడు రాజ్యసభ ఎన్నికల్లోనూ ఉమ్మడి అభ్యర్థులు ఓడిపోయారు.

సుప్రీం కోర్టునే ధిక్కరిస్తారా?

పతంజలికి సుప్రీం ధర్మాసనం నోటీసులు

» తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు వైద్య ఉత్పత్తుల ప్రకటనలపై ఆంక్షలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారన్న ఆరోపణలపై యోగా గురు బాబా రాందేవ్ ఆధ్వర్యంలోని పతంజలి ఆయుర్వేద సంస్థకు, దాని ఎండీ ఆచార్య బాలకృష్ణకు మంగళవారం సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వకూడదన్న కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారన్న ఫిర్యాదు మేరకు ఈ నోటీసులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు పతంజలి సంస్థ తయారు చేసే వైద్య ఉత్పత్తుల ప్రకటనలపై ఆంక్షలు విధించింది. అలోపతిపై 'పతంజలి' తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తోందంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. కొవిడ్ వ్యాక్సినేషన్‌కు వ్యతిరేకంగా పతంజలి సంస్థ తప్పుడు ప్రచారం చేస్తోందంటూ గత ఏడాది ఐఎంఏ పిటిషన్ వేసింది. ప్రత్యామ్నాయ వైద్య విధానాల పేరుతో కొన్ని సూచనలు చేసి తప్పుడు ప్రకటనలు ఇచ్చిందని ఆరోపించింది. విచారణ జరిపిన ధర్మాసనం తప్పుడు, తప్పుదోవ పట్టించే ప్రకటనలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలు అమలు కావడం లేదని ఐఎంఏ తరఫున సీనియర్ న్యాయవాది పి.ఎస్.పట్వాలియా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. యోగా ద్వారా మధుమేహం, ఉబ్బస వ్యాధులు పూర్తిగా నయమవుతాయంటూ ప్రకటనలు ఇచ్చిందని తెలిపారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పతంజలి సంస్థకు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను మార్చి 15కు వాయిదా వేసింది.

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి విరామం!

» 40 రోజుల పాటు కాల్పుల విరమణ

» సంధి ప్రతిపాదనలను ప్రకటించిన ఇజ్రాయెల్

(సెంట్రల్ డెస్క్)

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి విరామం పడనుంది. రంజాన్ నెలలో కాల్పుల విరమణకు ఈజిప్టు, ఖతార్ దేశాలు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో.. ఇజ్రాయెల్ ఓ అడుగు ముందుకు వేసింది. 40 రోజుల పాటు అన్నిరకాల సైనిక కార్యకలాపాలకు విరామమివ్వాలనే పారిస్ చర్చల ప్రతిపాదనలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ అధికారి ఒకరిని ఉటంకిస్తూ రాయిటర్స్ ఓ కథనాన్ని ప్రచురించింది. అంతేకాదు.. 1:10 నిష్పత్తిలో హమాస్ చెరలో ఉన్న బందీలు, పాలస్తీనా ఖైదీల మార్పిడికి ఇజ్రాయెల్ అంగీకారం తెలిపినట్లు పేర్కొంది. అయితే.. హమాస్ నుంచి దీనిపై ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తోంది. ఒకవేళ ఈ రోజుల్లో హమాస్ నాయకత్వం ఈ ప్రతిపాదనకు ఓకే చెబితే.. రంజాన్(మార్చి 11 నుంచి) మాసమంతా గాజాలో శాంతి నెలకొంటుందని ఈజిప్టు, ఖతార్ భావిస్తున్నాయి. ఒప్పందం అమలైతే ఇజ్రాయెల్ వైమానిక దళం గాజాపై నిఘాను రోజులో 8గంటల పాటు నిలిపివేస్తుంది. గాజాలో మానవతా సాయం కోసం రోజుకు 500 ట్రక్కులను తరలించేందుకు అనుమతి ఉంటుంది. శరణార్థులు, ఇళ్లను కోల్పోయిన గాజా పౌరుల కోసం 2 లక్షల టెంట్లు, 60 వేల మొబైల్ షెల్టర్ల ఏర్పాటుకు ఇజ్రాయెల్ సహకరిస్తుంది.

అల్లోల అగ్రజునికి అశ్రునివాళి



జననం : 17-11-1945

మరణం : 19-02-2024

స్వర్గీయ అల్లోల హన్మంత్ రెడ్డి గారు

గ్రామం ఎల్లపెల్లి, నిర్మల్ మండలం & జిల్లా

నిండైన ఆకారం... మెండైన కంఠస్వరం... తేజోవంతమైన కాంతికి రూపం మీరు... నిర్మలమైన హృదయానికి ప్రతిరూపం మీరు...
"ఉమ్మడి కుటుంబం"నకు నిర్వచనమైనావు... క్రమ శిక్షణ, కార్యదక్షతలకు అర్థమై నిలిచావు...
మా ప్రతీ అడుగులో అడుగువై... మా ప్రతీ విజయంలో స్ఫూర్తివై... నీవు తిరిగిన సైకిల్ చక్రాలే మాకు జీవిత చక్రాలై
మా సోదరులను... మన పరివారాన్ని ఉన్నత శిఖరాన నిలిపి, అల్లోల వంశ ప్రతిష్టను ఎల్లపెల్లి మొదలు రాష్ట్ర ఎల్లలు దాటించిన
"ధీరోదాత్తుడా" "అల్లోల అగ్రజుడా" "అల్లోల హన్మంతుడా"
ఏమిచ్చి తీర్చుకోగలం మీ ఋణం... మీ ధర్మం ఆచరించడం... మీ మార్గం అనుసరించడం తప్ప...

పెద్దకర్మ

సమయం : తేది: 01-03-2024, శుక్రవారం ఉ॥ 12 గంటలకు

వేదిక : మా స్వగృహం, గ్రా॥ ఎల్లపెల్లి, నిర్మల్ మం. & జిల్లా. ✆ 99893 05555

బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు కార్యక్రమములో పాల్గొని మా తండ్రిగారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి.

భార్య : **అల్లోల లలిత**

కుమారుడు - కోడలు :		కూతురు - అల్లుడు :	
అల్లోల ప్రశాంత్ రెడ్డి - అపర్ణ		ప్రవీణ రెడ్డి మదన్ - అన్‌మోల్ మదన్	
మనుమరాలు	: అల్లోల వన్షిక	మనవడు	: ఆదిత్య మదన్
మనవడు	: అల్లోల సరంజయ్ రెడ్డి	మనుమరాలు	: ఆదిత్రి మదన్

తమ్ముళ్ళు	- మరదళ్ళు	అక్క - చెల్లెళ్ళు	- బావ - బావమరుదులు
అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి (మాజీ మంత్రివర్యులు)	- విజయలక్ష్మి	P. అరుంధతి	- P. క్రిష్ణారెడ్డి
అల్లోల మురళీధర్ రెడ్డి	- వినోద	A. అమృత	- A. సుదర్శన్ రెడ్డి
అల్లోల సురేందర్ రెడ్డి	- స్వర్గీయ సుచిత్ర	V. లక్ష్మి	- V. ప్రభాకర్ రెడ్డి
స్వర్గీయ అల్లోల నరసింహా రెడ్డి	- అరుణ	P. విమల	- P. సంతోష్ రెడ్డి
అల్లోల దేవేందర్ రెడ్డి	- దీపిక		

అల్లోల పరివారము మరియు బంధుమిత్రులు

THIRUMALA ESTATES
Himayat Nagar, Hyd.

HOTEL THIRUMALA
Nirmal

THIRUMALA THEATRE
Nirmal

SHILPA WHISTLING WOODS
(Vl) Uddamarry, Muduchintalapally (M), Malkajgiri (Dist)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పెద్దల ఎన్నికలోనూ...!

మూడు రాష్ట్రాల్లో పదిహేను రాజ్యసభ స్థానాలకు పోలింగ్ తప్పనిసరి కావడంతోనే క్రాస్ ఓటింగ్ అనుమానాలూ రాజుకున్నాయి. ఏప్రిల్ మొదటి వారానికి యాభైఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్న నేపథ్యంలో, నలభైఒక్కస్థానాలు ఏకగ్రీవంతో బుద్ధిగా నిండిపోయాయి. కానీ, ఉత్తర్‌ప్రదేశ్‌లో పది, కర్ణాటకలో నాలుగు, హిమాచల్‌ప్రదేశ్‌లో ఒకే ఒక్క స్థానానికి మంగళవారం జరిగిన పోలింగ్‌లో భారీ క్రాస్ ఓటింగ్ జరిగి యూపీ, హిమాచల్‌లో బీజేపీ లాభపడితే, కర్ణాటకలో పైచేయి సాధించిన కాంగ్రెస్ ఇప్పుడు ఉత్తర భారతంలో తాను అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్‌లో ఏకంగా ప్రభుత్వాన్నే కోల్పోయే ప్రమాదంలోకి జారుకుంది.

ఇది నరేంద్రమోదీ, అమిత్ షా విజయం అని సవినయంగా ప్రకటించారు హిమాచల్‌లో ఆ ఒక్క స్థానాన్నీ దక్కించుకున్న బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్. నలభైమంది ఎమ్మెల్యేలతో, ఆపైన ముగ్గురు ఇండిపెండెంట్ల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం అంత బలంగా ఉండగా అభిషేక్ మనుసింఘ్వీ వంటి ఓ యోధుడు ఇంత ఘోరంగా ఓడిపోతాడని ఎవరూ ఊహించరు. అధికార కాంగ్రెస్‌లో అసమ్మతి, ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుక్కూ మీద కొంతమంది ఎమ్మెల్యేలలో వ్యతిరేకత నిజమే కావచ్చు కానీ, కేవలం పాతికమంది ఎమ్మెల్యేలతో ఏ మాత్రం గెలవగలిగే అవకాశాలు లేని బీజేపీ అంత ధైర్యంగా తన అభ్యర్థిని నిలబెట్టినప్పుడే రిసార్ట్ రాజకీయాలకు, క్రాస్ ఓటింగ్‌కు రంగం సిద్ధమైందని అర్థం. కనుచూపుమేర విజయావకాశాలు లేకున్నా కుట్ర రాజకీయం మీద ఉన్న ఆ నమ్మకం వమ్ముకాలేదు. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులు 'ఆత్మప్రబోధం' మేరకు ఓటు చేయడంతో ఇద్దరు అభ్యర్థుల బలాబలాలు సమానమైనాయి, ఆ పైన లాటరీతో బీజేపీ అభ్యర్థి నెగ్గుకొచ్చారు. సింఘ్వీ విజయం మీద ఎంతో నమ్మకం పెట్టుకున్న సుక్కూ ఇప్పుడు హర్యానా పంచకులలోని ఓ గెస్ట్‌హౌస్‌లో కుట్ర జరిగిందంటూ ఏవో కొన్ని వీడియోలు విడుదల చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ అపహరించిందంటూ ఆరోపణలు చేస్తున్నారు. సింఘ్వీ ఓటమితో కథ ముగియలేదని, అసలు నాటకం ముందున్నదని బీజేపీ నాయకుల వ్యాఖ్యలు చెబుతున్నాయి. మెజారిటీ లేని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని వెంటనే డిమాండ్ చేసిన బీజేపీ, మరికొందరిని చీల్చి అవిశ్వాస తీర్మానంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడైనా కూల్చివేయవచ్చు. పాతికమంది ఎమ్మెల్యేలున్న బీజేపీ, నాలుగు దశాబ్దాలపాటు కాంగ్రెస్‌లో ఉన్న నాయకుడిని ఆఖరురోజున ముందుకు తెచ్చి నిలబెట్టి, నలభై మూడు మంది ఎమ్మెల్యేల మద్దతున్న కాంగ్రెస్ నుంచి ఇలా రాజ్యసభ స్థానాన్ని గుంజుకొని, ప్రభుత్వాన్ని కూల్చడానికి సిద్ధపడుతూండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. గెలిచేంత సంఖ్యాబలం లేదని తెలిసి కూడా బీజేపీ కేంద్ర నాయకత్వం ఆశీస్సులు అందించినందువల్లనే కాబోలు, బీజేపీ మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ ఈ విజయాన్ని అమిత్‌షా, జేపీ నడ్డాలకే అంకితం చేశారు.

ఇది 'విధేయత పరీక్ష' అని అఖిలేశ్ యాదవ్ మొఖం చెల్లక ఏవో సమర్థింపుమాటలు అంటున్నారు కానీ, ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రధానంగా ముగ్గురు బీజేపీ అభ్యర్థుల విజయంలో, ఒక ఎస్పీ అభ్యర్థి ఓటమిలో క్రాస్ ఓటింగ్ ఉపకరించింది. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేల సహాయసహకారాలతో బీజేపీ తాను పోటీలో ఉంచిన ఎనిమిదిమందినీ గెలిపించుకుంది. ఓటింగ్ జరుగుతూండగానే పార్టీ చీఫ్‌విప్ సహా ఐదుగురు ఎమ్మెల్యేలు యోగి ఆదిత్యనాథ్‌ను దర్శించుకోవడం, అంతకుముందు ఓ ఎనిమిదిమంది విందుకు హాజరుకాకపోవడం అఖిలేశ్‌కు అవమానకరమైన పరిణామాలు. కర్ణాటకలో మొత్తం మూడు స్థానాలనూ కాంగ్రెస్ సునాయాసంగా గెలిచినప్పటికీ, ఒక బీజేపీ ఎమ్మెల్యే క్రాస్ ఓటింగ్, మరొకరి గైర్హాజరీ బీజేపీ-జేడీఎస్ కూటమికి అవమానకరమైన పరిణామం. ఈ ఎన్నికల్లో మొత్తం పదిహేను రాజ్యసభ స్థానాల్లో పదింటిని కైవసం చేసుకున్న బీజేపీ ప్రధానంగా కాంగ్రెస్, దాని మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీకి సార్వత్రిక ఎన్నికలముందు పెద్ద షాక్ అయితే ఇచ్చింది. ఎన్నికల పొత్తులతో యుద్ధానికి సిద్ధమవుతున్న ఇండియా కూటమి ఉత్సాహం మీద నీళ్ళుజల్లే ప్రయత్నమైతే బలంగానే జరిగింది.

సమస్యల అడ్డాలో వలస కూలీ

21వ శతాబ్దంలో ఈ దేశపు సామాజిక, ఆర్థిక, రాజకీయ చిత్రాన్ని అంతర్గత వలసలు సమూలంగా మార్చివేస్తున్నాయి. వైవిధ్యభరితమైన సంస్కృతులు, భిన్నమైన భౌగోళిక పరిస్థితులు గల భారతదేశంలో రాష్ట్రాల మధ్యన భారీ ఎత్తున ప్రజల వలస జరుగుతున్నది. తాజా గణాంకాలు ఆశ్చర్యం కలిగించే అంశాలను వెల్లడించాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రం నుంచి రాష్ట్రానికి వలసపోయే కార్మికుల సంఖ్య 4.14 కోట్లు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, పరిశోధన సంస్థల అంచనా మేరకు 2022 నాటికి వలస కార్మికుల సంఖ్య 8 కోట్లకు చేరింది. దశాబ్దాల పాటు అనేక సమస్యలను ఎదుర్కొంటున్న వలస కార్మికుల పరిస్థితి, ఇటీవలి కోవిడ్ ముప్పుతో మరింత దిగజారింది. ఉపాధి కొరత, తగ్గుతున్న వేతనాలు వారి దుస్థితిని మరింత దుర్భరం చేశాయి. లాక్‌డౌన్ తరువాత వలస కార్మికుల వేతనాల్లో 22.6 శాతం దాకా తగ్గుదల ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా వేసింది. ఉపాధి ఆగిపోయి నిలువ నీడ లేకుండా కోట్లాది మంది కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో నగరాల్లో చిక్కుకు పోయినప్పుడు వలస కార్మికుల నిస్సహాయస్థితి స్పష్టంగా కనిపించింది. అరకొర రవాణా సౌకర్యాల వల్ల మైళ్ళకొద్దీ పట్టువిడవకుండా వాళ్ళు చేసిన నడక ప్రయాణం వారి విషాదగాథను దేశ ప్రజల ముందుంచింది.



2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రం నుంచి రాష్ట్రానికి వలసపోయే కార్మికుల సంఖ్య 4.14 కోట్లు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, పరిశోధన సంస్థల అంచనా మేరకు 2022 నాటికి వలస కార్మికుల సంఖ్య 8 కోట్లకు చేరింది. అశేషంగా నగరాల్లో దుర్భర జీవితాలు గడుపుతున్న వలస కార్మికుల కోసం ఒక సమగ్రమైన విధానాన్ని తీసుకువచ్చి సంక్షేమ ఫలాలను వీరికి కూడా సమంగా అందించినప్పుడే 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' కల నిజమవుతుంది.

సుసంపన్నమైన, వైవిధ్యభరిత సంస్కృతి కలిగిన హైదరాబాద్ దేశంలోని భిన్న ప్రదేశాల వారిని ఆకర్షిస్తుంది. ఇది ఈ నగరపు ఆహార, ఆచార, భాషా వైవిధ్యానికి మరింత గతిశీలతనిస్తుంది. 2011 లెక్కల ప్రకారం చూస్తే హైదరాబాద్ 64.3 శాతం వలస ప్రజలున్న నగరం. తెలంగాణ భవన కార్మికుల బోర్డు ప్రకారం తెలంగాణలో నమోదు అయిన కార్మికుల్లో 30శాతం అంటే 2.11 లక్షల మంది హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. వీరిలో యాభై శాతం తెలంగాణ వారైతే మిగిలిన వారు ఇతర రాష్ట్రాలకు చెందినవారు. నగరంలో మురాద్ నగర్, టోలిచౌకి, ఎల్బీనగర్, యూసుఫ్‌గూడా, గచ్చిబౌలి, విజయనగర్ ఇంకా కొన్ని ప్రాంతాలు ప్రధానంగా కార్మికుల కూడళ్లు. వీటిని వలస కార్మికుల 'కూలి అడ్డాలు'గా పిలుస్తారు.

ప్రతిరోజు ఉదయాన్నే హైదరాబాద్ నగర వీధుల్లో సుపరిచితంగా వినిపించే మాట 'కూలోళ్లు కావాల్నా' అని. టిఫిన్ బాక్సులు, పనిముట్లు పట్టుకొని పని వెతుక్కుంటూ 300 నుంచి 1000 దాకా కూలీలు ప్రధాన కూడళ్లలో గుమికూడుతారు. మురికివాడల్లో తాత్కాలికంగా వెలిసిన గుడిసెల్లో అరకొర సదుపాయాలతో అపరిశుభ్రంగా ఉండే పరిసరాల్లో ఎక్కువమంది వలస కార్మికులు జీవిస్తుంటారు. ఆర్థిక సామాజిక అధ్యయన కేంద్రం జరిపిన తాజా అధ్యయనం ఈ రోజువారీ వలస కూలీల పరిస్థితిని, వారు ఎదుర్కొనే సవాళ్ళను వెలికి తీసింది. కూలిపోయిన ఇండ్లు; అపరిశుభ్ర పరిసరాలు; మంచి నీరు, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు లేని వలస కాలనీలు దారుణ జీవన స్థితిగతులను ఈ అధ్యయనం వెలికితీసింది.

దుర్భర జీవన ప్రమాణాలు కలిగిన ఈ కూలీల అడ్డాలో మహిళా వలస కూలీల స్థితి మరింత దుర్భరం. వేతనాల్లో అంతరం, ఉపాధిలో వివక్ష, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు... ఇలాంటి సమస్యలతో మహిళా వలస కూలీలు వలస కార్మికుల్లో అత్యంత నిస్సహాయమైన వర్గం. మహిళా వలస కూలీలు వారి పిల్లలతో సహా మౌలిక సదుపాయాల లేమి వల్లనే కాకుండా, వలసలు జరిగే క్రమంలో కూడా అనేక సమస్యల్లో చిక్కుకొని కనీస మర్యాదను కోల్పోతున్నారనే వాస్తవాన్ని అధ్యయనాలు తేటతెల్లంచేశాయి.

పని కోసం కార్మికులు ఒకరితో ఒకరు ఘర్షణ పడే సందర్భాలూ పెరుగుతున్నాయి. దక్షిణాది వలస కార్మికులు, ప్రత్యేకించి అధికంగా తెలుగు మాట్లాడే వలస కూలీలు, ఉత్తరాది వలస కూలీల నుంచి తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నారు. వీరు అడిగే వేతనాలకంటే చాలా తక్కువ వేతనాలతో పనిచేసేందుకు ఉత్తరాది కార్మికులు సిద్ధపడటం వల్ల పోటీ మరింత పెరుగుతున్నది. ఒక వలస కార్మికుడు ఈ సంకట స్థితిని ఇలా వివరించాడు: 'మేము మాములుగా ఒప్పుకునే కూలీలో మూడింట రెండొంతుల కూలికి ఈ ఉత్తరాది రాష్ట్రాల కూలీలు పనిచేస్తారు. దాంతో యజమానులు వారివైపే మొగ్గుతారు. చివరికి మాకు ఒక్కోసారి కూలి దొరికే అవకాశమే లేకుండా పోతుంది'. ఎక్కువగా అవివాహితులైన ఉత్తరాది కార్మికులు ఒకే ఇంట్లో ఉంటూ వండుకుని తింటారు కాబట్టి తక్కువ వేతనానికి ఒప్పుకోగలరు. కానీ కుటుంబాలతో సహా వలస వచ్చిన స్థానిక వలస కూలీల ఖర్చులు ఎక్కువ ఉంటాయి. వారికి ఇది పెద్ద సవాలుగా మారుతున్నది. తెలంగాణ పట్టణాల్లో, హైదరాబాద్ కూలి అడ్డాల్లో స్థానిక కూలీలకు, బయట కూలీలకు మధ్య తరుచు గొడవలు జగరడం ఈ పరిస్థితి తీవ్రతను సూచిస్తుంది.

భారతదేశంలో డెమోగ్రాఫిక్ డివిడెండ్ 2018లో ప్రారంభమై 2055 వరకు కొనసాగుతుంది. ఈ అమృత కాలంలో మన దేశపు యువశక్తి భారతదేశ ప్రగతికి ప్రధాన చోదక శక్తి కాగలదని అందరూ నమ్ముతున్నారు. అయితే, ఈ ప్రతిష్ఠాత్మక లక్ష్యాలు వాస్తవ రూపం దాల్చే క్రమంలో ఉత్తరాదికి, దక్షిణాదికి మధ్య జనాభా వయస్సు, సంతానోత్పత్తి రేట్లు, కార్మిక అవకాశాల్లో అసమానత ఒక పెద్ద అడ్డంకిగా మారే అవకాశం కనపడుతున్నది. జాతీయ శాంపిల్ సర్వే (NSS), భారతదేశ మానవాభివృద్ధి సూచికల ప్రకారం వలస కార్మికుల్లో అత్యధికులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన సామాజికంగా వెనకబడిన షెడ్యూలు కులాలు, జాతులు, ఇతర వెనకబడిన తరగతులవారు. అశేషంగా నగరాల్లో దుర్భర జీవితాలు గడుపుతున్న వలస కార్మికుల కోసం ఒక సమగ్రమైన విధానాన్ని తీసుకువచ్చి సంక్షేమ ఫలాలను వీరికి కూడా సమంగా అందించినప్పుడే 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' కల నిజమవుతుంది.

▪ దేవేంద్ర పూల
▪ భరత్ భూషణ్ మామిడి
(ఆర్థిక సామాజిక అధ్యయన కేంద్రం)

నారిమన్ స్మృతి న్యాయనిష్ఠకు స్ఫూర్తి





▪ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

నారిమన్ మరణించిన వేళ ఆయన సుదీర్ఘకాలం వాదించిన సుప్రీంకోర్టు నిష్పాక్షికంగా వ్యవహరిస్తోందా అన్న ప్రశ్నను వేసుకోవడం అవసరం. తమిళనాడులో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు మనీలాండరింగ్ చట్టం క్రింద సమన్లు జారీ చేసే అధికారం ఈడీకి ఉంటుందని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పుచెప్పింది. ఏపీ, గుజరాత్‌తో సహా అన్ని రాష్ట్రాల్లో అక్రమ ఇసుక తవ్వకాలపై ఈడీ విచారించి అక్కడి కలెక్టర్లందరినీ కోర్టుకీడ్చాలని సుప్రీంకోర్టు చెప్పగలదా?

పాతికేళ్ల నాటి మాట. 1999లో ఒక రోజు అప్పటి కేంద్ర హోంమంత్రి లాల్‌కృష్ణ అడ్వాణీ నుంచి సీనియర్ న్యాయవాది ఫాలి నారిమన్‌కు ఫోన్ వచ్చింది. 'రాజ్యసభకు మిమ్మల్ని నామినేట్ చేయాలనుకుంటున్నాము' అని అడ్వాణీ ఆయనకు చెప్పారు. 'నాకు ఇష్టం లేదు.' నారిమన్ అని జవాబిచ్చారు. 'నేను, వాజపేయి కలిసి నిర్ణయించాం. మీరు అంగీకరించాల్సిందే.. నేను ఇప్పుడే రాష్ట్రపతి వద్దకు వెళుతున్నాను' అని అడ్వాణీ చెప్పారు. అనేక ఒత్తిళ్ల మధ్య నారిమన్ అందుకు అంగీకరించారు. అంతకు ముందు ఆయనను అటార్నీ జనరల్‌గా నియమించాలని దేవెగౌడ, వాజపేయి అనుకున్నప్పటికీ నారిమన్ అందుకు నిరాకరించారు. తనకు ఒక పార్టీ మనిషిగా గుర్తింపు రాకూడదని ఆయన భావించడమే ఇందుకు కారణం.

నారిమన్‌ను రాజ్యసభ సభ్యుడుగా బీజేపీ ప్రభుత్వం నామినేట్ చేసినప్పటికీ ఆయన వాజపేయి ప్రభుత్వ విధానాలను విమర్శించకుండా ఉండలేదు. గుజరాత్ అల్లర్ల హింసాకాండను, ప్రజల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టే రాజకీయాలను ఆయన తీవ్రంగా నిరసించారు. ప్రతిపక్ష నేత సోనియా గాంధీతో పాటు గుజరాత్‌కు వెళ్లి ప్రజల మధ్య శాంతి నెలకొనేలా చేయాలని మరో నామినేటెడ్ సభ్యుడు నానాజీ దేశ్‌ముఖ్ చేసిన సూచనను అమలు చేయాలని కోరారు. 1947లో కోల్‌కతా, నౌఖాలిలో అల్లర్లు జరిగినప్పుడు ప్రజల ప్రాణాలు కాపాడేందుకు మహాత్మాగాంధీ ముస్లింలీగ్ నాయకుడు సుహ్రావర్దీతో కలిసి అక్కడికి వెళ్ళిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గుజరాత్ అల్లర్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ కమిషన్ నియమిస్తే దర్యాప్తు సరిగా జరుగుతుందని, ఈ కమిషన్‌కు విస్తృతాధికారాలు ఉంటాయని అడ్వాణీకి సభాముఖంగా నారిమన్ చెప్పారు. మోదీని కాపాడాలనే ఉద్దేశంతో ఉన్న అడ్వాణీ, నారిమన్ సూచనను పాటించలేదన్నది వేరే విషయం. 'అధికార దురహంకారంతో ఉన్న వారు తాము చేసేవన్నీ సరైనవని భావిస్తారు. కాని అది వాస్తవం కాదు' అని నారిమన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తమను బీజేపీ ప్రభుత్వమే నామినేట్ చేసిందని తెలిసినప్పటికీ నానాజీ దేశ్‌ముఖ్, నారిమన్ లాంటి ఉన్నత వ్యక్తిత్వం గల వ్యక్తులు ఎక్కడ ఉన్నా వాస్తవాలు చెప్పేందుకు వెనుకాడలేదు. అయినా వాజపేయి, అడ్వాణీ లాంటి నేతలు వారి పట్ల వ్యతిరేకత వ్యక్తం చేయలేదు. అది నాటి కాలం.

ఈ నెల 21న తన 93వ ఏట మరణించిన ఫాలీ నారిమన్ (1929–2024) సుదీర్ఘకాలం న్యాయవాద వృత్తిలో ఉన్నప్పటికీ ప్రజల హక్కుల గురించి పెద్దగా పోరాడిన వ్యక్తి కాకపోవచ్చు. భోపాల్ విషవాయు ఘటనకు కారణమైన యూనియన్ కార్బైడ్ తరఫున వాదించి ఉండవచ్చు. రాజకీయ పార్టీలు, పారిశ్రామికవేత్తలు అప్పగించిన పలు కేసులకు ప్రాతినిధ్యం వహించి ఉండవచ్చు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ న్యాయకళాశాలలో చదువుకుని న్యాయవాద వృత్తి చేపట్టిన తొలితరం న్యాయవాదుల్లో నారిమన్ ఒకరు. వలసవాదం నుంచి భారతదేశాన్ని విముక్తం చేసి మనం రూపొందించుకున్న భారత రాజ్యాంగాన్ని చట్టాలకు, ప్రభుత్వ విధానాలకు అన్వయించేందుకు కృషి చేసిన న్యాయవాదుల్లో నారిమన్ ప్రముఖుడని ప్రముఖ న్యాయవాది ఇందిరా జై సింగ్ వ్యాఖ్యానించారు. తాను ప్రజల తరఫునా, ఆయన పరిశ్రమ తరఫునా వాదించినప్పటికీ తన క్లయింట్లు ఏది కోరుకుంటున్నారో అందుకు అనుగుణంగా నిర్దిష్టంగా, న్యాయసూత్రాలకు అనుగుణంగా వాదించి ఫలితాలను సాధించగల వృత్తి నైపుణ్యం ఆయనకు ఉండేదని ఆమె ప్రశంసించారు. న్యాయమూర్తిగా పనిచేసే అవకాశాలు కూడా కాదనుకుని జీవితాంతం న్యాయవాదిగానే ప్రాక్టీసు చేయడం ద్వారా ఆ వృత్తికి విలువ తీసుకువచ్చి తన తర్వాతి తరాల న్యాయవాదులను ప్రభావితం చేసిన వారిలో నారిమన్ ప్రథమ శ్రేణిలో ఉంటారనడంలో సందేహం లేదు.

ఫ్రీ మార్కెట్‌ను నారిమన్ విశ్వసించినప్పటికీ కొన్ని విలువలకు కట్టుబడి ఉన్నారని ఆయన జీవితంలో అనేక ఉదంతాలు నిరూపిస్తాయి. ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ ఆయన తనకు ఇందిరాగాంధీ ప్రభుత్వం ఇచ్చిన అదనపు సొలిసిటర్ జనరల్ పదవికి రాజీనామా చేశారు. ప్రభుత్వం కేటాయించిన బంగళాను ఖాళీ చేయాల్సి రావడంతో ఆయనకు అద్దె ఇల్లు ఇచ్చేందుకు ఢిల్లీలో పలువురు నిరాకరించారు. 'ఈ దేశంలో రాజ్యాంగ నిర్వాహకులపైనే ఆధారపడలేం' అని ఆయన ఎమర్జెన్సీ గురించి రాశారు. మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, చివరకు భారత రాష్ట్రపతి మొదలైన రాజ్యాంగ నిర్వాహకులు కూడా రాజ్యాంగాన్ని పరిరక్షించలేకపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

'బిఫోర్ ద మెమొరీ ఫేడ్స్' (జ్ఞాపకాలు చెరిగిపోక ముందు) అన్న శీర్షికతో రాసిన తన ఆత్మకథలో నారిమన్ ఎమర్జెన్సీ సమయంలో తనకు ఎదురైన ఒక అనుభవాన్ని వివరించారు. అదనపు సొలిసిటర్ జనరల్‌గా రాజీనామా చేసిన తర్వాత విశాఖపట్టణంలో న్యాయవాదుల సదస్సుకు హాజరైనప్పుడు ఒక నిర్వాహకుడు ఆయన వద్దకు వచ్చి లా కాలేజీలో చదువుతున్న తన కుమారుడిని మీసా కింద అరెస్టు చేశారని ఆందోళనతో చెప్పారు. ఇందిరాగాంధీ 20 సూత్రాలకు మద్దతుగా మరుసటి రోజు ఊరేగింపు జరపాలని క్లాసులో లెక్చరర్ చెప్పడంతో ఆ విద్యార్థి లేచి నిలబడి క్లాసులు జరుగుతున్న సమయంలో ఊరేగింపులేమిటి? అని అడిగాడట. ఇది అతడికి, కొందరు తోటి విద్యార్థులకూ మధ్య వాదనకు దారితీసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో దేశ భద్రతకు ఆ విద్యార్థి ముప్పుగా పరిణమించాడని జిల్లా మెజిస్ట్రేట్ నిర్ధారించడంతో పోలీసులు అర్ధరాత్రి వెళ్లి ఆ విద్యార్థిని అరెస్టు చేశారు. న్యాయవాదుల సదస్సుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్ కూడా హాజరు కావడం, కొంతమంది పెద్దలు కలుగ చేసుకోవడంతో అతడి నిర్బంధపు ఉత్తర్వులు రద్దు అయ్యాయి. కాని అప్పటికే ఆ విద్యార్థిని పోలీసులు రాష్ట్రంలో ఏదో మారుమూల జైలుకు తరలించారు. ఎందరో ప్రయత్నించిన మీదట అరెస్టయిన మూడు వారాల తర్వాత ఆ విద్యార్థి విడుదలయ్యాడు!

ఈ విషయాన్ని ఉటంకిస్తూ మీసా వంటి దుర్మార్గపు చట్టాలు అమలు చేసేటప్పుడు అధికారులు బాధ్యతారహితంగా, నిర్విచక్షణగా వ్యవహరిస్తారని, కోర్టులు కూడా అనేక సందర్భాల్లో జోక్యం చేసుకోబోవని నారిమన్ లాంటి ప్రముఖ న్యాయవాదే వ్యాఖ్యానించారు. ఇవాళ దేశంలో ఇదే పరిస్థితి కనపడుతోంది. ఎమర్జెన్సీలోనే కాదు, గుజరాత్‌లో క్రైస్తవ మతస్థులపై దాడులు జరిగినప్పుడు నారిమన్ గుజరాత్ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించకుండా ఒక కేసు నుంచి తప్పుకున్నారు.

పలు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలు నారిమన్ సలహాపై ఆధారపడేవారు. ఆలమట్టి కేసులో కర్ణాటక తరఫున నారిమన్, ఏపీ తరఫున గంగూలీ వాదించడం చూసినప్పుడు కళ్ల ముందు నదులు ప్రవహిస్తున్నట్లుండేది. నారిమన్ మూలంగా నీటిపారుదల రంగంలో కర్ణాటక అనేక ప్రయోజనాలు పొందింది.

భోపాల్ గ్యాస్ లీక్ కేసులో యూనియన్ కార్బైడ్‌కు ప్రాతినిధ్యం వహించినందుకు ఆయన పలు సందర్భాల్లో విచారం వ్యక్తం చేశారు. 'ఫాలీ టూ వాజ్ ఫాలిబుల్' (ఫాలీ నారిమన్ కూడా తప్పులు చేస్తాడు). 'ఇది నేను జీవితంలో చేసిన అతి పెద్ద తప్పు' అని ఆయన ఒక ఇంటర్వ్యూలో అన్నారు. 'ఎంత మంది న్యాయవాదులు తాము వృత్తి జీవితంలో చేసిన తప్పులు అంగీకరిస్తారు?' అని ఇందిరా జై సింగ్ ప్రశ్నించారు.

నారిమన్ మరణించిన వేళ ఆయన సుదీర్ఘ కాలం వాదించిన సుప్రీంకోర్టు నిష్పాక్షికంగా వ్యవహరిస్తోందా అన్న ప్రశ్నను వేసుకోవడం అవసరం. తమిళనాడులో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు మనీలాండరింగ్ చట్టం క్రింద సమన్లు జారీ చేసే అధికారం ఈడీకి ఉంటుందని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పుచెప్పింది. దీనితో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల మెడలు కేంద్రం చేతుల్లోకి చిక్కుకోకతప్పదు. ఆంధ్రప్రదేశ్‌లో వేల కోట్ల మేరకు అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు నివేదికలు అందినప్పటికీ అలాంటివేవీ జరగలేదని జిల్లా కలెక్టర్లందరూ ఒకే వివరణ ఇచ్చారని సుప్రీంకోర్టుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నివేదించింది. గుజరాత్‌లో కూడా పెద్ద ఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయి. ఏపీ, గుజరాత్‌తో సహా అన్ని రాష్ట్రాల్లో అక్రమ ఇసుక తవ్వకాలపై ఈడీ విచారించి అక్కడి కలెక్టర్లందరినీ కోర్టుకీడ్చాలని సుప్రీంకోర్టు చెప్పగలదా?


'భగవంతుడే సుప్రీంకోర్టును కాపాడాలి' అని దేశ సర్వోన్నత న్యాయస్థానంలో జరుగుతున్న పరిణామాలపై నారిమన్ ఒక పుస్తకం రాశారు. తాను వృద్ధుడవుతున్న కొద్దీ, భారత రాజ్యాంగాన్ని, దాని పీఠికలో చేర్చిన లౌకిక వాదాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను ఆయన అధికంగా గుర్తించారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక వ్యక్తినీ దృష్టిలో ఉంచుకుని రూపొందించిందని, సమూహాన్ని దృష్టిలో పెట్టుకుని కాదనే విలువను ఆయన విశ్వసించారు. భారతదేశంలో లౌకికవాదం అంటే ఏమిటో స్పష్టత లేదని, న్యాయవ్యవస్థ కూడా ఈ స్పష్టత నీయలేదని నారిమన్ మరో ప్రముఖ న్యాయవాది రాజీవ్ ధావన్‌తో కలిసి రాసిన ఒక వ్యాసంలో అన్నారు. మతాన్ని రాజకీయాల నుంచి దూరం చేయాల్సిన అవసరం గురించి ఆయన ప్రస్తావించారు. మైనారిటీలను పరిరక్షించడానికే కాదు, మెజారిటేరియనిజం దాడినుంచి సమాజాన్ని కాపాడేందుకూ సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఒక మత శిబిరంలో రాకాసి బల్లుల జనాభా పెరిగితే, అది మరో మత శిబిరంలో వాటి పెంపకానికి దారితీస్తుందని ఆయన తన ఆత్మకథలో ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను ఒక మైనారిటీని అయినప్పటికీ లౌకిక భారతదేశంలోనే నాకు అన్ని అవకాశాలు లభించాయి. నేను లౌకిక భారతదేశంలోనే మరణించాలనుకున్నాను.' అని తన జీవిత చరిత్ర చివరి వాక్యంలో ఆయన అన్నారు. తాను ఎలాంటి భారత దేశంలో మరణించారో ఆయనకు అర్థమై ఉండొచ్చు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఆర్టికల్ 142 – రాజ్యాంగ మౌలికత

రాజ్యాంగ మౌలిక స్వరూపం అనే దాని మీద చాలా చర్చే జరిగింది. కేశవానంద భారతి-కేరళ ప్రభుత్వం(1973) కేసులో దీనిపై సుప్రీంకోర్టు స్పష్టతను ఇచ్చింది. జన హితం కోసం ప్రాథమిక హక్కులను సైతం సవరించే హక్కు పార్లమెంటుకు ఉన్నప్పటికీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మాత్రం అది హరించజాలదని 13 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలోని ఏడుగురు సభ్యుల మెజారిటీ ఇచ్చిన తీర్పు ఇప్పటికీ శిరోధార్యంగా ఉంది. అప్పటి కేరళ ప్రభుత్వం తెచ్చిన భూసంస్కరణల చట్టాన్ని కేశవానంద భారతి అనే భూస్వామి సవాలు చేశారు. ఆస్తి హక్కు ప్రాథమిక హక్కు. కాబట్టి దానిని హరించే కేరళ ప్రభుత్వ చట్టం చెల్లదని ఆయన తరఫున సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. ఈ వాదనకు అనుకూలంగా, ప్రతికూలంగా అనేక అనుబంధ పిటిషన్లు దాఖలయ్యాయి. చివరికి రాజ్యాంగ ఔన్నత్యాన్ని స్థిరపరుస్తూ పార్లమెంటుకు గల సవరణ అధికారాలను మాత్రం సుప్రీంకోర్టు ధ్రువపరిచింది. మనది రాజ్యాంగ ప్రాబల్య ప్రజాస్వామ్యమే గాని, పార్లమెంటు ప్రాబల్యమైనది కాదని నిపుణులు తేల్చారు.



జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జెఎసి)ని నియమించిన రాజ్యాంగ సవరణను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పులో సుప్రీం విస్తృత ధర్మాసనం దీనిని సందేహాతీతంగా చెప్పింది. రాజ్యాంగ ఔన్నత్యమంటే సుప్రీంకోర్టుకు ఉండే అనుల్లంఘనీయతే కదా! ఈ వాస్తవాన్ని గమనించకుండా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వంటివారు కొలీజియం వివాదంలో సుప్రీంకోర్టును తృణీకరించి మాట్లాడారు. ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వానికి అధికారాలు కట్టబెడుతూ 2015లో పార్లమెంటు ఆమోదించిన ఎన్‌జెఎసి చట్టాన్ని (రాజ్యాంగం 99వ సవరణ) సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 4:1మెజారిటీ తీర్పుతో తోసిపుచ్చడాన్ని ధన్‌ఖడ్ తీవ్రంగా విమర్శించారు. ఇది పార్లమెంట్ అగ్రాధిపత్యాన్ని కాలరాయడమేనని అన్నారు. పార్లమెంటు సార్వభౌమాధికారం అనుల్లంఘనీయమైనదని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ మౌలిక స్వరూపం మీద కూడా పార్లమెంటువే సర్వాధికారాలన్నారు. అప్పటి కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా కొలీజియం వివాదంలో న్యాయవ్యవస్థ మీద అవాకులు చెవాకులు పేలారు.

న్యాయ వ్యవస్థను ఇతర పాలనా వ్యవస్థల నుంచి స్వతంత్రంగా ఉంచినప్పుడే ఈ దేశ పౌరుల హక్కుల పరిరక్షణ బాధ్యతను అది సక్రమంగా నిర్వర్తించగలుగుతుందని ఈ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. చండీగఢ్ మేయర్ కేసు చిన్నదే కావచ్చు.. కానీ ఆర్టికల్ 142 ద్వారా సుప్రీంకోర్టు పెద్ద కర్రనే ఉపయోగించింది. ఇటువంటి కుయుక్తుల ద్వారా ప్రజాస్వామ్యానికి ముంచుకు రాగల ముప్పును కోర్టు ముందుగా ఊహించింది అనాలి. అందుచేత ప్రజాస్వామ్య మౌలికత అయిన ఎన్నికల ప్రక్రియను కాపాడడం కూడా రాజ్యాంగ మౌలికతగా భావించాలి. అందుకు అత్యంత అరుదుగా సుప్రీంకోర్టు ఉపయోగించిన 142 అధికరణకు రాజ్యాంగ మౌలికతలో అంతర్భాగం కాగల గౌరవాన్ని ఎందుకు ఇవ్వకూడదు?

– జి. శ్రీరామమూర్తి, సీనియర్ జర్నలిస్ట్

చట్టబద్ధ ఎంఎస్‌పితోనే రైతులకు న్యాయం!

కేంద్ర ప్రభుత్వం C2 +50 శాతం చొప్పున లెక్కించి, మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి. సేకరణ విధానాన్ని సవరించి ఎక్కువ రాష్ట్రాలలో రైతులకు ఎంఎస్‌పి ధరలు లభించేలా కృషి జరగాలి. ఉద్యోగ, వ్యాపార వర్గాలతో పోలిస్తే వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న సన్నకారు, చిన్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల జీవన స్థాయిలో మెరుగుదల కోసం కేంద్రం తప్పనిసరిగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులన్నిటినీ అమలు చేయడం ఆయనకు అర్పించగలిగిన ఘనమైన నివాళి అవుతుంది.



సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 350కి పైగా రైతు సంఘాలకు చెందిన లక్షలాదిమంది రైతులు లోగడ ఉద్యమించారు. ఆ సందర్భంగా చలి, మండుటెండల దుష్ప్రభావంతో అనారోగ్యాల పాలై 750 మంది రైతులు చనిపోయినా, పట్టుదలతో శాంతియుతంగా ప్రభుత్వ కవ్వింపు చర్యలకు రెచ్చిపోకుండా 13 మాసాల పాటు చారిత్రాత్మక రైతు ఉద్యమాన్ని కొనసాగించారు. దరిమిలా, ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ విరుద్ధంగా, అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను ఉపసంహరించి, భారత రైతాంగానికి క్షమాపణ చెప్పి, త్వరలో రైతుల డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించడానికి లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. కానీ దానిని అమలుచేయనందున రైతు సంఘాలు తిరిగి ఉద్యమబాట పట్టవలసి వచ్చింది.

రెండవ పర్యాయం సంయుక్త కిసాన్ మోర్చా (నాన్-పొలిటికల్), కిసాన్ మజ్దూర్ సంఘ్‌ల నాయకత్వంలో పంజాబ్ రైతులు చేపట్టిన 'కిసాన్ ఢిల్లీ మార్చ్'ని అడ్డుకోవడానికి కనీవినీ ఎరుగని రీతిలో కేంద్రం దమనకాండకు పాల్పడుతోంది. కొద్దిరోజుల క్రితమే ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డా. ఎం.ఎస్. స్వామినాథన్‌కి 'భారతరత్న' పురస్కారాన్ని మోదీ ప్రభుత్వం ప్రదానం చేసింది. దశాబ్దాలుగా భారత రైతాంగం వెనుకబాటుతనానికి, ఆత్మహత్యల పరంపరకు అడ్డుకట్ట వేసి, రైతులు సమాజంలోని ఇతర వర్గాలవారితో పాటు ఆత్మగౌరవంతో జీవించడానికి వీలుగా స్వామినాథన్ కమిషన్ కొన్ని సిఫార్సులు చేసింది. రైతులు పండిస్తున్న పంటలకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయం (C2)నకు 50శాతం కలిపి చట్టబద్ధ కనీస మద్దతు ధర ఇవ్వాలని చేసిన సిఫార్సు అందులో ప్రధానమైనది. దీనిని అమలుచేస్తామని 2014 ఎన్నికల సందర్భంగా బీజేపీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొనడమే కాక, ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్ర మోదీ పలు బహిరంగ సభలలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. అనంతరం ఆ హామీని అమలుచేయడం సాధ్యం కాదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది మోదీ ప్రభుత్వం.

ఎంఎస్‌పి అంశాన్ని పరిశీలించడానికి 29మంది పేర్లతో రూపొందించిన కమిటీలో కేంద్ర ప్రభుత్వమే 25 పేర్లు నింపి, సంయుక్త కిసాన్ మోర్చా తరఫున కేవలం ముగ్గురి పేర్లు అవి కూడా తమకు ఆమోదయోగ్యమైన పేర్లను మాత్రమే చేర్చింది. దీంతో ఎస్‌కెయం పేర్లను పంపలేదు. ప్రభుత్వానికి అనుకూలమైన ఆర్థికవేత్తలతో C2+50శాతం డిమాండ్‌ను అమలు చేయాలంటే ఏటా 10లక్షల కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేయవలసి ఉంటుందంటూ విస్తృతంగా ప్రచారం చేస్తుండటం దురదృష్టకరం. కేంద్రం ఇప్పటివరకు రైతులు పంట పండించేందుకు నగదుగా చెల్లించవలసిన మొత్తానికి (A2 నకు) కుటుంబసభ్యుల శ్రమ విలువ (F.L.)కు 50శాతం కలిపి లెక్కించి ఎంఎస్‌పిని 22 పంటలకు ప్రకటిస్తున్నా, దానికి చట్టబద్ధత కల్పించలేదు. దీంతో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) సేకరించినప్పుడు తప్ప రైతులకు ఎంఎస్‌పి లభించడం లేదు. ఇప్పటివరకు బియ్యం, గోధుమలను మాత్రమే పెద్ద ఎత్తున, అది కూడా పంజాబ్, హర్యానాలలో, కొద్ది మేరకు ఆంధ్రప్రదేశ్, యూపీ మున్నగు రాష్ట్రాలలో ఎంఎస్‌పి ధరలకు సేకరిస్తోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొంతమేరకు పత్తి పంటను సేకరిస్తూ ఉంటుంది.

పండిన ఆహార పంటలలో కుటుంబ అవసరాలు పోగా, మిగిలిన భాగం మాత్రమే మార్కెట్‌లోకి అమ్మకానికి వస్తాయి. దేశం మొత్తం మీద 2400 రెగ్యులేటెడ్ మార్కెట్ యార్డులు, 4,800 సబ్ మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటిలో చాలా భాగం ఈ-నామ్‌తో అనుసంధానించబడి, ప్రతిరోజూ రైతు అమ్మిన పంట పరిమాణం, ధర నమోదవుతూ ఉంటాయి. ఎంఎస్‌పి రైతుకు లభించడం కోసం ప్రభుత్వమే కొనవలసిన అగత్యం లేదు. ఎంఎస్‌పికి, వ్యవసాయ మార్కెట్‌లో (AMC) రైతు అమ్మిన ధరకు మధ్య వున్న వ్యత్యాసాన్ని ధరల స్థిరీకరణ నిధి నుంచి రైతుకు అందిస్తే సరిపోతుంది. ఇప్పటికి ఉన్న గణాంకాల ప్రకారం చూస్తే A2+FL+50శాతం – ఎంఎస్‌పి రైతులకు అందించేందుకు రూ.50,000 కోట్లు అవసరమౌతుందని అంచనా. C2+50శాతం ఎంఎస్‌పి అందించాలంటే రూ.2.5 లక్షల కోట్ల రూపాయలు అవసరమౌతాయి. ఇందులో సింహభాగం కేంద్రం, కొంత భాగం రాష్ట్ర ప్రభుత్వాలు భరించే విధానం ఉంటే రైతుకు న్యాయం జరుగుతుంది.

ఇప్పటివరకు బియ్యం/గోధుమలు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజానీకానికి అందజేస్తున్నారు. వాటితో పాటుగా కొద్దిమేరకు పెసలు/మినుములు/కందిపప్పు లాంటి పప్పుధాన్యాలను కూడా అందజేయడం ప్రారంభిస్తే ప్రజలకు పోషక ఆహార లభ్యత స్థాయి పెరగడమేకాక, ఈ పంటల ఉత్పాదకత, ఉత్పత్తి పెరిగేందుకు, ఇతర దేశాల నుంచి దిగుమతులను తగ్గించేందుకు ఉపయోగపడుతుంది. లోగడే అరవింద్ సుబ్రమణియన్ కమిటీ టుబాకో బోర్డు నమూనాలో 'పప్పుధాన్యాల బోర్డు'ను ఏర్పాటు చేయడం అవసరమని సూచించినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఇప్పటివరకు పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో సేకరణకే ఎఫ్‌సిఐ అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అలాకాకుండా మిగులు ఉత్పత్తి వున్న రాష్ట్రాలలో ఆయా పంటల పరిమాణాలను అనుసరించి, లభ్యమైన మేరకు సేకరణ చేసే విధానాన్ని అనుసరిస్తే దాని ప్రభావం ప్రైవేట్ అమ్మకాలపైన కూడా పడి, రైతులకు మెరుగైన ధరలు లభిస్తాయి. దేశం మొత్తం మీద దాదాపు 20,000 సంతలు/చిన్న మార్కెట్లు ఉన్నాయని, వాటన్నిటినీ గ్రామీణ మార్కెట్లుగా అభివృద్ధి చేసి ఈ-నామ్‌లకు అనుసంధానిస్తామని 2015లో నాటి కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్ ప్రకటించినా, ఇప్పటివరకు పురోగతి లేదు. ఏటా జాతీయ రహదారుల అభివృద్ధికి దాదాపు లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్న మోదీ ప్రభుత్వం, ఈ చిన్న చిన్న మార్కెట్ల అభివృద్ధికి, కుంటినడకన నడుస్తూ వున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయడానికి తగినంత నిధులను సమకూరిస్తే వ్యవసాయ రంగం, దానితోపాటు రైతులు, వ్యవసాయ కార్మికుల ఆదాయాలు కూడా మెరుగవుతాయి.

2022-23లో కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (CACP) లెక్కల ప్రకారం C2+50% ఎంఎస్‌పి రూ.2,707, A2+FL+50% ఎంఎస్‌పి గ్రేడ్-A క్వింటాలుకు రూ.2,060/-లు అంటే క్వింటాలుకు రూ.647/-లు వ్యత్యాసం ఉంది. దేశంలో 1308 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఇందులో గృహావసరాలు పోగా దాదాపు 1000 లక్షల టన్నుల ధాన్యం అమ్మకమై ఉంటుంది అంటే దేశం మొత్తం మీద ధాన్యం పండించిన రైతులకు సుమారు రూ.64,000 కోట్లు నష్టం వాటిల్లింది.

ఈ విధంగా చూస్తే వివిధ పంటలకు C2 +50% ధర లభించకపోవడం వల్ల భారత రైతాంగానికి రెండున్నర లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. ప్రతి బడ్జెట్‌లోనూ ఇన్‌కంటాక్సు, ఎక్సైజ్, కస్టమ్స్ డ్యూటీలో పారిశ్రామిక, ధనిక వర్గాలకు ఇచ్చే రాయితీల వల్ల దాదాపు లక్ష కోట్ల రూపాయలపైన ప్రభుత్వానికి రావలసిన ఆదాయం తగ్గుతోంది. 14.5 కోట్ల రైతు కుటుంబాలు, అందులోనూ 86 శాతంగా ఉన్న సన్నకారు, చిన్న రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు మేలు చేకూర్చడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మాత్రం భారం వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాబట్టి మీనమేషాలు లెక్కించకుండా ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం C2 +50% చొప్పున లెక్కించి, మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి. సేకరణ విధానాన్ని సవరించి ఎక్కువ రాష్ట్రాలలో రైతులకు ఎంఎస్‌పి ధరలు లభించేలా కృషి జరగాలి. ఉద్యోగ, వ్యాపార వర్గాలతో పోలిస్తే వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న సన్నకారు, చిన్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల జీవన స్థాయిలో మెరుగుదల కోసం కేంద్రం తప్పనిసరిగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులన్నిటినీ అమలు చేయడం ఆయనకు అర్పించగలిగిన ఘనమైన నివాళి అవుతుంది.

• వడ్డే శోభనాద్రీశ్వరరావు
మాజీ మంత్రి



17.65 లక్షలు!

ఉమ్మడి జిల్లాలో గృహజ్యోతి, మహాలక్ష్మి లబ్ధిదారులపై దాదాపు స్పష్టత

- 7.50లక్షల మందికి ఉచిత విద్యుత్, 10.15లక్షల మందికి సబ్సిడీ గ్యాస్
- మార్చి ఒకటో తేదీ నుంచి అమల్లోకి..

హనుమకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరుగ్యారంటీ పథకాల్లోని 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించింది. గతంలోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితప్రయాణంతో పాటు.. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచి హామీని నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా మంగళవారం 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించి గృహజ్యోతి, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ సరఫరాకు సంబంధించి మహాలక్ష్మి పథకాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ పథకాలను ఒకటో తేదీ నుంచి అమల్లోకి తేనుండగా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఈ పథకాలకు అర్హులైన వారి లెక్కతేలిందని, గృహజ్యోతి పథకం కింద 7.50 లక్షల మంది, మహాలక్ష్మి పథకం కింద 10.15 లక్షల మంది లబ్ధిపొందనున్నారని అంచనా. అయితే నెలనెలా తడిసి మోపెడవుతున్న కరెంట్ బిల్లులను చెల్లించలేని నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఉపశమనం కలిగించేలా, అలాగే దారుణంగా పెరిగిన ధరతో పేదలకు గుడిబండగా మారిన గ్యాస్ బండ బరువును తగ్గించేందుకు ప్రభుత్వం ఈ రెండు పథకాలను అమలులోకి తీసుకువస్తోంది.

గృహజ్యోతితో లబ్ధి ఇలా..

ఉమ్మడి జిల్లాలో సుమారు 7.50 లక్ష మంది గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందే అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 8.62 లక్షల మంది గృహవిద్యుత్ వినియోగదారులు ఉండగా ఈ పథకం అమలుకు దరఖాస్తులు స్వీకరించిన రాష్ట్ర ప్రభుత్వం వీరిలో అర్హులుగా భావించిన 7.50లక్షల మంది వివరాలను అప్‌లోడ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) పరిధిలో మొత్తం 45లక్షల విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హులైనవారు 7.50 లక్షలు ఉన్నట్టు లెక్కతేల్చారు. వీరి దరఖాస్తులను అప్‌లోడ్ చేసి పథకం అమలుకు అన్ని ఏర్పాట్లతో అధికారులు సర్వసన్నద్ధంగా ఉన్నారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో నెలకు 2,570 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం కాగా, ఉమ్మడి జిల్లాలో 777మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవు తోంది. హనుమకొండ జిల్లాలో 169.2 మి.యూ, వరంగల్ జిల్లాలో 132.3 మియూ, జనగామ జిల్లాలో 5.750 మియూ, మహబూబాబాద్ జిల్లాలో 3.930 మి.యూ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలుపుకొని 185.1 మియూ విద్యుత్ వాడకమవుతోంది.

అర్హతకు కార్డు సమస్య..

అయితే సబ్సిడీ వంట గ్యాస్‌కు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుకు ప్రభుత్వం రేషన్‌కార్డు లింక్ పెట్టడంతో ఉమ్మడి 50శాతం ఈ పథకాలను పొందలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో తెల్లరేషన్ కార్డు లేని వారు ఆందోళన చెందుతున్నారు. గత పదేళ్లలో అనేక కుటుంబాల్లోని సభ్యులు వివాహాలతో వేరుపడడం, కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో కార్డుల్లేని కుటుంబాల సంఖ్య బాగా పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. ఇదే ఈ రెండు పథకాల అర్హతకు సమస్యగా మారింది. అంతే కాకుండా ప్రధాన మంత్రి ఉజ్వల్ కల్యాణ్ యోజన పథకం లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తుందా? లేదా? అన్నది కూడా తెలియాల్సి ఉంది.

మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

గృహజ్యోతి పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం తెల్లరేషన్ కార్డు ఉన్నవారు మాత్రమే ఉచిత కరెంట్‌కు అర్హులు. ఆధార్‌కు రేషన్‌కార్డు అనుసంధానమై ఉండాలి. నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికే ఈ పథకం వర్తిస్తుంది. అంటే 2022-23 ఆర్థిక సంవత్సరానికి 2,181యూనిట్లలోపు వాడకం ఉండాలి. ఇక ఇది కూడా ఎలాగంటే ఒక వినియోగదారుడు 1,500యూనిట్లు కరెంట్ వాడితే దానికి 10శాతం కలిపి 12నెలలకు దానికి 10శాతం కలిపి.. ఆ మొత్తాన్ని 12నెలలకు విభజించగా వచ్చిన మొత్తం యూనిట్లకు మాత్రమే ఉచిత పథకానికి వర్తింపజేస్తారు. మిగతాదానికి లెక్క కడతారు. ప్రతీ నెల మీటర్ రీడింగ్‌తో 10 రోజుల పాటు మొదటి వారంలోనే ఉచిత విద్యుత్‌కు లబ్ధిదారుల గుర్తింపు ఉంటుంది. మీటర్ నెంబరుకు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నెంబరు అనుసంధానం చేసి రీడింగ్ తీస్తారు. ఈ విధానంలో కరెంట్ ఉచితంగా ఇచ్చే లబ్ధిదారులను గుర్తించి ఈ పథకాన్ని అమలు చేస్తారు. విద్యుత్ వినియోగం నెలకు 200యూనిట్లు మించినా, బిల్లులు పెండింగ్ ఉన్నా ఈ పథకం వర్తించదు. 2022-23లో సగటున నెలకు 200 యూనిట్లకు మించి విద్యుత్ వాడితే అనర్హులు. గత ఏడాదిలో నెలకు సగటున వాటిన విద్యుత్ అదనంగా 10శాతం మాత్రమే ఉచితం. అనుమతించిన పరిమితికి లోబడి వాడకం ఉంటేనే జీరో బిల్లులు. అదనంగా వాడిన విద్యుత్‌కు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఒక ఇంటికి ఒక మీటర్ ఉన్న వారికే ఈ పథకం అమలవుతుంది. అద్దె ఇళ్లలో ఉన్నవారు కూడా ఈ పథకాన్ని పొందవచ్చు.

పెరగనున్న విద్యుత్ వినియోగం

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వనుండడంతో భవిష్యత్తులో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉంది. ఉచితం లేనందు వల్ల ప్రస్తుతం 100 యూనిట్ల వరకే కరెంట్ వాడుకుంటున్న వారు గృహజ్యోతి పథకం అమలైన తర్వాత ఎలాగో ఉచితం కదా అని 200 యూనిట్ల వరకు వాడుకునే అవకాశం లేకపోలేదు. దీనితో విద్యుత్ వినియోగం 20 శాతం వరకు పెరగవచ్చునని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకు 777 మిలియన్ యూనిట్ల కరెంట్ వాడకం అవుతోంది. గృహజ్యోతి పథకం అమలులోకి వచ్చిన తర్వాత అదనంగా మరో 20 శాతం అంటే 155.4 మిలియన్ యూనిట్లు పెరగవచ్చు. దీని వల్ల ప్రస్తుతం ఉన్న కరెంట్ సరఫరా వ్యవస్థపై లోడ్ పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగవచ్చు. దీనిని నివారించడానికి భవిష్యత్తులో అదనంగా మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం రావచ్చునని ఎన్‌పీడీసీఎల్ అధికారులు భావిస్తున్నారు.

మహాలక్ష్మి అమలవనుందిలా..

మహాలక్ష్మి పథకం కింద రూ.500కు గ్యాస్ సిలిండర్ పొందాలంటే ప్రజాపాలన కింద ధరఖాస్తు సమర్పించి ఉండాలి. తెల్లరేషన్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఈ కార్డుదారుని పేరుమీద ఎల్‌పీజీ కనెక్షన్ ఉండాలి. గత మూడు సంవత్సరాల్లో ఆ లబ్ధిదారుడు వినియోగించిన సిలిండర్ల సరాసరి సంఖ్య మేరకు మహాలక్ష్మి పథకం కింద సిలిండర్ల సరఫరా ఆధారపడి ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 10,15,335 మంది తెల్లరేషన్ కార్డుదారులున్నారు. వీరిలో వరంగల్ జిల్లాలో 2,72,952 మంది, హనుమకొండ జిల్లాలో 228143, జనగామ జిల్లాలో 1,59,978, మహబూబాబాద్ జిల్లాలో 82392, ములుగు జిల్లాలో 91595, భూపాలపల్లి జిల్లాలో 93501 తెల్లరేషన్ కార్డుదారుడులు ఉన్నారు. వీరందరు సబ్సిడీ గ్యాస్ పొందడానికి అర్హులే.



వంగరలో సన్మానం పొందిన పీవీ కుటుంబ సభ్యులు

చిరస్మరణీయుడు పీవీ

- ఆయన తెచ్చిన సంస్కరణల ఫలాలు నేడు ప్రజలకు అందుతున్నాయి
- కరణం, నియోగి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్‌రావు
- మాజీ ప్రధానికి 'భారతరత్న' ప్రకటన నేపథ్యంలో కుటుంబసభ్యులకు సత్కారం



వంగరలోని పీవీ విగ్రహం

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 27 : మాజీ ప్రధాని, దివంగత పీవీ నర్సింహారావు చిరస్మరణీయుడని, ఆయన అందరి వాడని, ప్రధానిగా ఆయన చేసిన సంస్కరణలు నేడు ప్రజలకు అందుతున్నాయని తెలంగాణ కరణం, నియోగి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండారి రాంప్రసాద్‌రావు పేర్కొన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం మండలంలోని వంగరలో తెలంగాణ రాష్ట్ర కరణం, నియోగి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పీవీ కుటుంబ సభ్యులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కరణం, నియోగి బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు దేశంలో ఇద్దరు నాయకులను అభిమానిస్తారన్నారు. అందులో మొదటి వారు పీవీ నర్సింహారావు అని, రెండో వ్యక్తి వాజ్‌పేయి అని అన్నారు. పీవీకి భారతరత్న ఇవ్వడంతో ఆ బిరుదుకే గౌరవం వచ్చిందన్నారు. స్వతాహాగా భూస్వామ్య కుటుంబానికి చెందిన పీవీ నర్సింహారావు తనకున్న వందల ఎకరాల భూమిని భూసంస్కరణ చట్టం తీసుకొచ్చి పేద ప్రజలకు పంచి పెట్టారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భారతరత్న పీవీ నర్సింహారావుకు రావడం తెలుగు రాష్ట్రాలకే కాకుండా దేశానికే గర్వకారణమన్నారు. బహుభాషా కోవిదుడిగా, సాహితీ, రాజకీయ వేత్తగా ప్రపంచ దేశాల మన్నలను పొందిన పీవీ గొప్పవాడన్నారు. అలాంటి పీవీ కుటుంబ సభ్యులను సన్మానించడం ఒక బృహత్తర కార్యక్రమమని కొనియాడారు. వంగరలో పీవీ విగ్రహం వద్ద పూలమాలలు వేసి, పీవీ ఇంటిని సందర్శించారు. పీవీ శతజయంత్యుత్సవాల కోసం ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పీవీ సోదరుడు పీవీ మనోహర్‌రావు-సరస్వతీదేవి దంపతులు, పీవీ కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు, పీవీ కుమార్తె ఎమ్మెల్సీ వాణిదేవి, పీవీ కష్యప్, పీవీ మదన్‌మోహన్‌రావు, ఎన్వీ సుభాష్, పీవీ సీతారామారావు, శరత్, నత్త రాజు సుధా-కిరణ్, ఇందిరాదేవితో పాటు పీవీ కుటుంబానికి చెందిన మరో 26మంది వారసులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వంగర మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, సతీష్‌రెడ్డి, ఒల్లాల రమేష్, శ్రీరామోజు మొండయ్య, తిరుపతిరెడ్డి, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తి శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు..

- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



7

ఆత్మకూర్ ఎస్ఐపై సస్పెన్షన్ వేటు

ఉత్తర్వులు జారీ చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా



ఎస్ఐ ప్రసాద్

హనుమకొండ క్రైం / హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 27 : ఇటీవల ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో జరిగిన ఘర్షణ ఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆత్మకూర్ ఎస్ఐ జి. ప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల అగ్రంపహాడ్ జాతరకు ఈనెల 23న మాజీ ఎమ్మెల్యే చల్లాధర్మారెడ్డి తన అనుచరులతో వెళ్లిన క్రమంలో అధికారులతో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించారని వచ్చిన ఫిర్యాదుతో సదరు ఎస్ఐ బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించాడనే ఆరోపణలు రావడంతో నిఘా వర్గాలు విచారణ చేపట్టాయి. ఆ విచారణలో ఎస్ఐ థర్డ్‌డిగ్రీ ప్రయోగించిందిన నిజమని తేలడంతో ప్రసాద్‌ను విధులనుంచి తొలగిస్తున్నట్టు సీపీ వెల్లడించారు.

'చలో ఆత్మకూరు'ను విరమించుకుంటున్నాం : చల్లా

పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసి థర్డ్ డిగ్రీ ఉపయోగించిన ఆత్మకూరు ఎస్ఐ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ తీసుకున్న నిర్ణయంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తాము బుధవారం చేపట్టిన చలో ఆత్మకూరు కార్యక్రమాన్ని రద్దు చేసుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రంపహాడ్ జాతరకు తాను వెళ్లిన సమయంలో ఎలాంటి గొడవ జరుగకున్నా పోలీసులు బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేయడంపై తాము సీపీని కలిశామని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని సీపీ హామీ ఇచ్చారన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని ధర్మారెడ్డి పేర్కొన్నారు.

కమిషనరేట్‌లో ఎస్ఐల బదిలీలు

- 12 మందికి స్థానచలనం



హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 27: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న 12 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎక్కువ కాలం ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐలకు స్థానచలనం కల్పించారు. పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎస్. రవి	నర్సంపేట	జాఫర్‌గడ్
ఎం. మహేందర్	జాఫర్‌గడ్	నెక్కొండ
షాహిద్ జానీపాష	నెక్కొండ	గీసుగొండ
డి. నరేష్	వీఆర్	రఘునాథ్‌పల్లి
సీహెచ్ రఘుపతి	రఘునాథ్‌పల్లి	ఖానాపూర్
బి. మాధవ్	ఖానాపూర్	నర్సంపేట
గూడ అరుణ్	జనగామ	చెన్నరావుపేట
ఎం. రాజేందర్	వీఆర్	చిల్పూరు
బి. వినయ్‌కుమార్	చిల్పూరు	స్టేషన్ ఘన్‌పూర్
చింత రాజు	నర్సంపేట	లింగాలఘన్‌పూర్
బి. ప్రవీన్‌కుమార్	లింగాలఘన్‌పూర్	వీఆర్
బి. విజయ్‌కుమార్	కేయూ	వీఆర్

అభివృద్ధి పనుల నివేదికను సమర్పించండి

- వేసవి నీటి ప్రణాళికలు సిద్ధం చేయండి
- నాలాల పూడికతీత పనులు చేపట్టాలి
- అధికారులతో మేయర్ గుండు సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 27 : నగరంలో వివిధ విభాగాల నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల్లో పూర్తయిన, కొనసాగుతున్న వాటి వివరాలతో నివేదిక సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్ష జరిపారు. జనరల్ ఫండ్, సీఎం ఆస్యూరెన్స్, పట్టణ ప్రగతి, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో చేపట్టిన పనులను సమీక్షించారు. చివరి దశలో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కొనసాగుతున్న పనులను త్వరగా ముగించాలన్నారు. వేసవిలో తాగునీటి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. టెయిల్ ఎండ్ ప్రాంతాలకు సైతం నీటి సరఫరా జరగాలన్నారు. లీకేజీలను అరికట్టాలన్నారు. ప్రధాన నాలాలైన భద్రకాళి, వడ్డేపల్లి, రాంనగర్, గుండ్ల సింగారం, దర్గా, భట్టుపల్లి ప్రాంతాల్లో అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం ఆరంభం లోగానే నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. వర్షాకాలానికి ముందే నాలాల పూడికతీత పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు ఎల్.శ్రీనివాస్‌రావు, రాజయ్య, శ్రీనివాస్, డీఈలు సంతోశ్‌బాబు, సారంగం, రవికిరణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 27: మార్చి 18 నుంచి నిర్వహించనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఎక్కడా కూడా ఏ చిన్న పొరపాటు దొర్లకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు భద్రతా ఏర్పాటు చేయాలన్నారు. డీఈవో డాక్టర్ అబ్దుల్ హై మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్షల సమయంలో నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో చలపతిరావు, జిల్లాలోని వివిధ మండలాల ఎంఈవోలు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.



నాలుగేళ్ల తర్వాత..

- ఎల్ఆర్ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్‌తో కసరత్తుకు సిద్ధమైన బల్దియా, 'కుడా'
- సుమారు లక్ష దరఖాస్తులకు కదలిక
- బల్దియా పరిధిలో 98 వేలకు పైగా దరఖాస్తులు
- 'కుడా'లో 2వేల వరకు అప్లికేషన్లు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 27 : ఎట్టకేలకు ఎల్ఆర్ఎస్‌కు మోక్షం లభించనుంది. లే-అవుట్ల క్రమబద్ధీకరణకు కాంగ్రెస్ సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దాదాపు నాలుగేళ్లుగా కోల్డ్ స్టోరేజీలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు కదలిక రానుంది. ఆదాయ వనరుల సమకూర్పు లక్ష్యంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు పరిధిలో ఉన్న భూములకు మినహాయించి ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ స్కీమ్ వర్తించనుంది. 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రకటించింది. వ్యక్తిగత స్థలాలకు రూ.1000, లే-అవుట్లకు రూ.10వేల ఫీజు నిర్ణయించి స్థలాల యజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఫీజులకు స్లాట్‌లను విధించి.. 100 గజాలు, 300 గజాలు. 300 నుంచి 400 గజాలు ఆపై స్లాట్‌లతో ఫీజులను నిర్ణయించింది.

సుమారు లక్ష దరఖాస్తులకు మోక్షం..

2020లో ఎల్ఆర్ఎస్ స్కీమ్ ప్రకటనతో దరఖాస్తుల సమర్పణ అధిక సంఖ్యలోనే జరిగింది. 2020కి ముందు నగరంతో పాటు, కుడా పరిధిలోని 183గ్రామాల ఎల్ఆర్ఎస్ ప్రక్రియ అంతా కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోనే జరిగేది. అయితే నాటి బీఆర్ఎస్ సర్కార్ తీసుకొచ్చిన పాలన పరమైన మార్పుల్లో నగర పరిధిలోని స్థలాలకు ఎల్ఆర్ఎస్ ప్రక్రియ కార్పొరేషన్లకు మారింది. ఈ క్రమంలో వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధి(బల్దియా)లోని డివిజన్ల స్థలాలు, లే-అవుట్ల ఎల్ఆర్ఎస్ విధానం 2020లో అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో సుమారు 98లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సమర్పితమయ్యాయి. ఇందులో వ్యక్తిగత స్థలాలతో పాటు, లే-అవుట్ స్థలాలు కూడా ఉన్నాయి. ఇక కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో సుమారు 2వేల వరకు దరఖాస్తులు వచ్చినట్లు అంచనా. మొత్తంగా లక్ష వరకు దరఖాస్తులు సమర్పితమైనట్లు అధికారులు చెబుతున్నారు. వ్యక్తిగత స్థలాలకు రూ.వెయ్యి, లే-అవుట్ స్థలాల క్రమబద్ధీకరణ కోసం రూ.10వేల ఫీజులతో యజమానులు దరఖాస్తులను సమర్పించారు. 2020 అక్టోబరు 15 వరకు దరఖాస్తుల గడువు ముగిసింది. ఇక ప్రభుత్వం వెను వెంటనే దరఖాస్తులను పరిశీలించి సర్వేలు జరిపి ఆ మేరకు మొత్తం ఫీజుల చెల్లింపుతో ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ జారీ చేస్తుందని దరఖాస్తుదారులు ఆశించారు. కానీ దరఖాస్తుల సమర్పణ ప్రక్రియతోనే బ్రేక్ పడింది. తాజాగా కాంగ్రెస్ సర్కారు ఎల్ఆర్ఎస్‌పై ప్రకటన చేయడంతో బల్దియా, కుడా పరిధిలో సమర్పితమైన సుమారు లక్ష ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు చలనం కలుగనుంది. బల్దియా, కుడా పరిధిలో సమర్పితమైన దరఖాస్తుల ల్యాండ్ రెగ్యులరైజేషన్ ద్వారా రూ.250 కోట్లకు పైగానే నిధులు సమకూరుతాయనే అంచనా.

విధి, విధానాలు రావాల్సి ఉందంటున్న అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ స్కీమ్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో విధి, విధానాలు రావాల్సి ఉందని బల్దియా, కుడా అధికారులు చెబుతున్నారు. ఇప్పుడే మార్గ దర్శకాలను పూర్తిగా వెల్లడించలేమంటున్నారు. అయితే 2020లో అందిన దరఖాస్తుల్లో ఇప్పటికే 15వేల వరకు భూముల సర్వే జరిపినట్లు బల్దియా అధకారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి మార్గ దర్శకాలు వచ్చాక ఆ దరఖాస్తులన్నింటిని పరిశీలించి ఆ స్థలాలను సర్వే జరిపిస్తామంటున్నారు. ఈ విషయమై పూర్తి సమాచారాన్ని విధి, విధానాల స్పష్టత తరువాత యజమానులకు తెలియచేస్తామంటున్నారు.

ఎంజీఎం అవినీతిపై ఏసీబీ నజర్?

కీలక సెక్షన్లు మార్చకపోవడంపై ఆరా
సాధారణ మందులు కూడా కరువు



హనుమకొండ, ఫిబ్రవరి 27 : ఎంజీఎం పరిపాలనపై ఏసీబీ నజర్ వేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా బోధన ఆస్పత్రుల్లో అవినీతి అక్రమాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈలోగా ఎంజీఎం పరిపాలన విభాగం లో అంతర్గత బదిలీలు గత రెండు రోజుల క్రి తం నిర్వహించారు. దీర్ఘకాలికంగా ఒకే సెక్షన్‌లో తిష్టవేసిన వారిని యథాస్థితిలో కొనసాగించడంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. రెండు దశాబ్దాల కాలంగా పేషీలో తిష్టవేసిన వినిస్ట్రియల్ సిబ్బందితోపాటు కీలక ఆదాయ వనరులు ఉన్న పలు సెక్షన్లు మార్చకపోవడంపై విస్మ యం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మారిన ఎంజీఎంలో కొందరి హవా ఎప్పటిలా గే కొనసాగుతోందని సహచర ఉద్యోగులు కూ డా వాపోతున్నారు. స్టేషనరీ కొనుగోలు లాం టి ఆదాయ వనరులు ఉన్న అనేక సెక్షన్లలో గత కొన్ని సంవత్సరాలుగా ఆడిట్ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు ఉన్నతాధికారుల సహకారమే ప్రధాన కారణమని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంజీఎం ఆస్పత్రిలో పాంటాప్ లాంటి సాధారణ మా త్రలు కూడా ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం పరిపాలనకు నిలువెత్తు నిదర్శనంగా మారింది.

క్రిమిసంహారక మందుతాగి వచ్చే రోగుల కోసం ఏబీజీ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. గత కొన్ని నెలలుగా ఈ పరీక్షలకు ఎంజీఎం వైద్యులు స్వస్తి పలికారు. ఫలితంగా రోగుల ప్రాణాలు గాలిలో దీపంగా మారాయి. నిధులు మింగుతూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సెక్షన్లలో ఇప్పటికైనా ప్రక్షాళన చేయాలన్న డిమాండ్ వ్యక్తం అవుతోంది. ఇటీవలే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ మం దులు సప్లై చేసే కాంట్రాక్టర్ నుంచి పెద్ద మొ త్తంలో లంచాలు స్వీకరిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే.

జిల్లా ఫారెస్టు డివిజన్ అధికారిగా అనూజ్ అగర్వాల్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 27: రాష్ట్ర వ్యాప్తంగా బదిలీ ల్లో భాగంగా వరంగల్ జిల్లా ఫారెస్టు డివిజనల్ అధికారిగా ఐఎఫ్ఎస్ అధికారి అనూజ్ అగర్వాల్‌ను నియమించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవా రం ఉత్తర్వులు జారీ చేశారు. ఏటూర్ నాగారంలో విధులు నిర్వ హిస్తున్న అగర్వాల్ వరంగల్‌కు బదిలీపై రాగా, ఇక్కడ పనిచేస్తున్న అపర్ణ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందోబస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

మేడారంలో నేడు తిరుగువారం

పండుగ కోసం ఏర్పాట్లు చేస్తున్న పూజారులు



వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 27 : మహా జాతర ముగిసిన అనంతరం సంప్రదాయంలో భాగంగా తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం తిరుగువారం పండుగ ఘనంగా జరుగనుంది. ఈ నేపథ్యంలో పూజారులు గుడులు, గద్దెలను శుభ్రపరిచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గుడులలో, గ్రామ దేవతలకు పూజారులు డోలు వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు చేసి తలనీలాలు సమర్పించి, యాట మొక్కులు చెల్లించుకుంటారు. మహాజాతర ముగిసిన అనంతరం దేవతల పూజా సామగ్రిని శుద్ధి చేసి గుడులలో అటకపై దాచి పెడుతారు. అదేవిధంగా ఆదివారం వనభోజనాలకు వెళ్లి మహాజాతర తంతును ముగిస్తారు.

తల్లుల చెంతకు కొనసాగుతున్న భక్తుల రాక

తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో మేడారం తరలొస్తున్నారు. జాతరముగిసినా మంగళవారం వేలాది మంది భక్తులు తల్లుల గద్దెలకు చేరుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరసారెలు, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించుకుంటున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం సుమారు 10వేల మంది భక్తులు తల్లులను దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

గుండెపోటుతో సమ్మక్క పూజారి మృతి



మృతి చెందిన పూజారి దశరథం

మేడారం, ఫిబ్రవరి 27: తాడ్వాయి మండలం మేడారంలోని వనదేవత సమ్మక్క పూజారి సిద్దబోయిన దశరథం మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మక్క పూజారి దశరథం కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం గుండెనొప్పి రావడంతో హనుమకొండకు చెందిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో దశరథం మృతిచెం దాడని వైద్యులు నిర్ధారించారు. దశరథం మృతితో గ్రామ ప్రజలు, బంధుమిత్రులు సంతాపాన్ని తెలిపారు. సమ్మ క్క పూజారి మృతికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువు రు పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

ఉపాధి కార్యాలయంలో 29న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 27: హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కంపెనీ జేఎస్ఆర్ గ్రూప్ సన్‌సిటీ రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌లో 50 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 50 సంవత్సరాల వయస్సుగల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98488 95937 సంప్రదించాలని తెలిపారు.

బండి సంజయ్ ఫ్లెక్సీపై అనుచిత రాతలు

మంత్రి పొన్నంపై వ్యాఖ్యలకు కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

పాదయాత్ర, కొత్తకొండలో బస చేసే ప్రాంతంలో పటిష్ఠ బందోబస్తు

డీసీపీ నేతృత్వంలో పోలీసుల మోహరింపు



కొత్తకొండ హరిత హోటల్ వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలనలో డీసీపీ బారి



పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేస్తున్నబీజేపీ నాయకులు

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 27 : ప్రజాహిత పాదయాత్రలో భాగంగా మంగళవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో తీవ్ర దుమారం రేగింది. బండి సంజయ్ పాదయాత్రను పురస్కరించుకుని బీజేపీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే బండి సంజయ్.. తమ నాయకుడు, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ నాయకులు కట్టిన ఫ్లెక్సీలపై అనుచిత రాతలు రాశారు. దీనిపై తీవ్రంగా స్పందించిన బీజేపీ మండలాధ్యక్షుడు ఫైడిపల్లి పృథ్వీరాజ్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు.. తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఫ్లెక్సీపై కాంగ్రెస్ నాయకులు అసభ్యకర రాతలు రాశారని, వారిపై కేసు నమోదు చేయాలని ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకులు తమ ఫిర్యాదులో కాంగ్రెస్ నాయకులు కొల్గూరి రాజు, ఆదరి రవీందర్, మాడ్గుల కిరణ్, సుతారి రాజమౌళి, మాచర్ల కుమారస్వామి, తదితరుల పేర్లను చేర్చారు.

కొత్తకొండలో హైటెన్షన్

బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పాదయాత్ర నేపథ్యంలో జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలో పాదయాత్ర సందర్భంగా బండి సంజయ్.. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి. మంగళవారం ఉదయం హుస్నాబాద్ మండలం రాములపల్లిలో సంజయ్ పాదయాత్రపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్ల దాడి చేశారని బీజేపీ నాయకులు పేర్కొంటున్నారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే భీమదేవరపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొందరు సంజయ్ పాదయాత్రను అడ్డుకునేందుకు మంగళవారం ఉదయం తరలివెళ్లారు. ఆ సమయంలో అక్కడ కాంగ్రెస్ నాయకులపై బీజేపీ నాయకులు దాడి చేయగా.. తమ పైనే దాడి చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాత్రి భీమదేవరపల్లి మండలంలో బండి సంజయ్ పాదయాత్ర ఎలా చేస్తారో చూస్తామంటూ హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా డీసీపీకి బందోబస్తుపై ఆదేశాలిచ్చారు. దీంతో డీసీపీ బారి, ఏసీపీ తిరుమల్ నేతృత్వంలో సుమారు 300మందికి పైగా పోలీసులు బందోబస్తులో నిమగ్నమయ్యారు. మంగళవారం రాత్రి 10గంటల తర్వాత సిద్దిపేట జిల్లా నుంచి హనుమకొండ జిల్లా మల్లారం గ్రామం చేరుకుంటుందని సమాచారం అందడం, అనంతరం బండి సంజయ్ కొత్తకొండ హరితహోటల్‌లో బస చేయనుండగా.. ఆయా ప్రాంతాల్లో పోలీసులు మోహరించారు. దీంతో కొత్తకొండలో టెన్షన్ మొదలైంది. మరోవైపు బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య మాటలయుద్ధం జరుగుతుండటం, ఫ్లెక్సీలపై రాతల వివాదం ఏర్పడిన నేపథ్యంలో పరిస్థితి అదుపుతప్పితే అవసరమైతే బండి సంజయ్‌ను అరెస్టు చేస్తారన్న ప్రచారం జరిగింది. దీంతో సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి బీజేపీ శ్రేణులు పాదయాత్ర ప్రాంతానికి భారీగా తరలివచ్చారు. హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మంగళవారం రాత్రి కొత్తకొండకు చేరుకున్నారు.

మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు..

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 27: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. మంగళవారం రాత్రి సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం నుంచి ఆయన ప్రజాహిత పాదయాత్ర భీమదేవరపల్లి మండలం మల్లారం, కొత్తకొండ గ్రామాలకు చేరుకుంది. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం కొత్తకొండలో ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిందని, కానీ 80 రోజులు పూర్తయ్యాయని, ఒకటి, రెండు గ్యారెంటీలు అమలు చేసి మిగత గ్యారెంటీలకు మొండిచేయి చూపించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ మరో 15 రోజుల్లో వచ్చే అవకాశం ఉందని, ఆలోపే మిగతా గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, హుస్నాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, భీమదేవరపల్లి మండల అధ్యక్షులు ఫైడిపెల్లి పృథ్వీరాజ్‌గౌడ్, జిల్లా కార్యదర్శులు మాచెర్ల కుమారస్వామి, దొంగల కొమురయ్య, మండల ప్రధాన కార్యదర్శులు గుండెల్లి సదానందం, యాదవ్, బోదల సంపత్, శ్రీరాముల శ్రీనివాస్, అంబీర్ కవిత, ఐత సాయితేజ, పెద్ది శివ, దొంగల వేణు, బండారి కరుణాకర్, బెల్లంపెల్లి శ్యాం తదితరులు పాల్గొన్నారు.



మల్లారంలో పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్

రేపటి నుంచి మేడారం హుండీల లెక్కింపు

లెక్కింపు కేంద్రానికి పూర్తయిన తరలింపు

300 మందికిపైగా సిబ్బంది నియామకం

చుట్టూ సీసీ కెమెరాలు - భారీ పోలీసు బందోబస్తు



హనుమకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మేడారం జాతరలో అమ్మవార్ల గద్దెల వద్ద ఏర్పాటు చేసిన హుండీలను హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని టీటీడీ కల్యాణ మండపానికి తరలించడం మంగళవారానికి పూర్తయింది. ఆర్టీసీ కార్గో బస్సుల్లో వీటిని భారీ బందో బస్తు మధ్య తీసుకువచ్చారు. మొత్తం 512 హుండీల ను కల్యాణ మండపానికి చేర్చారు. వీటిని పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్ల మధ్య భద్రపరిచారు. మేడారంలో జాతర ఇంకా సాగుతోంది. తల్లులు శనివారమే వనప్రవేశం చేసినప్పటి కీ తల్లుల దర్శనానికి భక్తులు ఇంకా పెద్ద సంఖ్యలో వస్తూనే ఉన్నారు. ఎత్తుబెల్లం, పసుపు కుంకుమ, చీరె సారెలతో పాటు నగదు రూపంలో కానుకలను సమర్పిస్తున్నారు. దీంతో నిండిన హుండీలను తరలించడం తో పాటు మరొ కొన్ని ఖాళీ హుండీలను అక్కడు అందుబాటులో ఉం చారు. భక్తులు నగదుతో పాటు వెండి, బంగారు కానుకలను ఈ హుం డీలో వేస్తున్నారు. ఈ దృష్ట్యా లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేలోగా ఈ హుండీల సంఖ్య పెరగవచ్చునని అధికారులు చెబుతున్నారు.

హుండీల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మండపాన్ని శుభ్రం చేశారు. చుట్టు భద్రతావలయాన్ని ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం లోపల, బయట 60కిపైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. లెక్కింపునకు దేవాదాయ శాఖ, రెవెన్యూ పోలీసు శాఖ పక్షాన 300 మందిని నియమిస్తున్నారు. వీరే కాకుండా లెక్కింపులో పాల్గొనేందుకు స్వచ్ఛం సంస్థల నుంచి మరో 100 నుంచి 150 మందిని ఆహ్వానిస్తున్నారు. లెక్కింపులో పాల్గొనేవారికి ప్రత్యేకంగా డ్రెస్‌కోడ్ ఉంటుంది. ఈనెల 29వ తేదీన కలెక్టర్ సిక్తా పట్నాయక్ హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. లెక్కింపు పది రోజుల వరకు కొనసాగవచ్చు.

హుండీలను తెరిచేప్పుడు ప్రతీ అంశాన్ని రికార్డు చేస్తారు. ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహిస్తారు. హుండీని తెరిచే ముందు వాటి సీళ్లను నిశితంగా పరిశీలిస్తారు. ఆ తర్వాత దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, పూజారుల సమక్షంలో ఒక్కొక్కటిగా తెరిచి కుమ్మరిస్తారు. బియ్యం, నగదు, వెండి, బంగారు వస్తువులను వేరు చేస్తారు. నగదును లెక్కిస్తారు. వెండి, బంగారు కానుకలను చివరన తూకం వేస్తారు. నగదుతో పాటు హుండీలో కానుకలుగా విదేశీ డాలర్లు కూడా పడతాయి. ఎన్ఆర్ఐ భక్తులు తల్లులకు కానుకలుగా ఆయా దేశాల డాలర్లను కానుకల రూపంలో వేస్తారు. వీటిని కూడా చివరన లెక్కిస్తారు.

హుండీలో భక్తులు నగదుతో బెల్లాన్ని కూడా వేస్తారు. దీనితో చాలా నోట్లు బెల్లంతో తడిసి ముద్దవుతాయి. అటువంటి నోట్లను నబ్బునురగలో నానబెట్టి శుభ్రం చేసి ఆరబెడతారు. ఆరిని తర్వాత లెక్కిస్తారు. హుండీలో నుంచి బయటపడిన చిల్లర నాణాలను సైతం ఒక దగ్గర కుప్పపోస్తారు. వీటన్నిటిని తూకం వేయడం ద్వారా వాటిని కూడా చివరన లెక్కిస్తారు. హుండీల నుంచి వెళ్లిన బియ్యాన్ని సైతం ఒక దగ్గర నిలువ చేసి తర్వాత వాటిని బస్తాలకు ఎక్కించి తూకం వేస్తారు. లెక్కించిన నగదును బ్యాంకులో ఏ రోజుకారోజు జమ చేస్తారు.

పెరగనున్న ఆదాయం

ప్రతీ జాతరలాగానే ఈ సారి కూడా మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఆదాయం పెరవచ్చునని దేవాదాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రతీ జాతరకు ఆదాయం క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ సారి భక్తులు కూడా ఎక్కువ సంఖ్యలో వచ్చారు. ఆ మేరకు ఈ సారి ఆదాయం గతంలో కన్నా రూ. రెండు కోట్ల అంతకన్నా ఎక్కువే పెరగవచ్చునని అంచనా వేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 27 : హనుమకొండలోని 59, 60 డివిజన్లకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కేతిడి దీపక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ముస్తాక్ నేహాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నాయకత్వం పట్ల యువత ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.


పార్టీ కండువాలతో ఆహ్వానం పలుకుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలి

▸ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 27 : ప్రతీ ఒక్కరు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 'ఆర్థిక అక్షరాస్యత- అవగాహన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉంటూ పొదుపును అలవాటు చేసుకోవాలని సూచించారు. ముందుగా ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రఘునాథ్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎం.హరిప్రసాద్, బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, పశు సంవర్థకశాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

'ఎన్ఐఎల్' కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించాలి

త్వరలో ప్రారంభం కానున్న న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమాన్ని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్ఐఎల్‌పీ) ప్రారంభంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ఐఎల్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

వడ్డేపల్లి : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ కోసం లక్ష్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మలబార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మలబార్ చారిటబుల్ ట్రస్టు సామాజిక సేవా కార్యక్రమం(సీఎస్ఆర్ ఫండ్)లో భాగంగా విద్యార్థినులకు ప్రోత్సాహకాన్ని అందించడం అభినందనీయమని అన్నారు. ఈ ప్రోత్సాహకాన్ని విద్యార్థినులు తమ భవిష్యత్ కోసం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 470 మంది విద్యార్థినులకు రూ. 37లక్షల 90 వేల స్కాలర్‌షిప్‌లను మలబార్ చారిటబుల్ ట్రస్టు ద్వారా అందించడం హర్షణీయమన్నారు. పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ మలబార్ గోల్డ్ అందిస్తున్న ప్రోత్సాహకంతో విద్యార్థినులు చదువులో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్, మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ వరంగల్ బ్రాంచ్ డైరెక్టర్ మహ్మద్ అజీష్ అహ్మద్, మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ ప్రతినిధులు జైనుద్దీన్, క్రాంతితో పాటు హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కె. గోపాల్, వరంగల్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ మాధవరావ పాల్గొన్నారు.

ఎస్ఐ విజయ్‌కుమార్‌ను అభినందించిన సీపీ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 27: ఆల్ ఇండియా డ్యూటీ మీట్‌లో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విజయ్‌కుమార్‌ను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా తన కార్యాలయానికి పిలిపించుకుని ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి సన్మానించారు. కాగా, ఈ నెల 12 నుంచి 16 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరిగిన పోలీసు డ్యూటీ మీట్‌లో విజయ్‌కుమార్ సైంటిఫిక్ ఏయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ ఫొటోగ్రఫీ విభాగంలో నిర్వహించిన పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతాకాన్ని సాధించారు.


విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

సీపీని కలిసిన పోలీస్ ఇన్‌స్పెక్టర్లు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 27 : వరంగల్ కమిషనరేట్ పరిధిలోని దుగ్గొండి, పర్వతగిరి పోలీస్ స్టేషన్లలో నూతనంగా సీఐలుగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్లు వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝాను కలిశారు. మంగళవారం సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. సీపీని కలిసిన వారిలో దుగ్గొండి ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఉన్నారు. కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పని చేయాలని, ప్రజలకు సేవలందించాలని సీపీ వారికి సూచించారు.

బాధ్యతలు చేపట్టిన వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 27: వరంగల్ పోలీసు కమిషనరేట్ వరంగల్ ట్రాఫిక్ పోలీసు విభాగం నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన టి. సత్యనారాయణ మంగళవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణపై ఏసీపీకి సీపీ అంబర్ కిశోర్ ఝా పలు సూచనలు చేశారు.

అదనపు ఈవీఎంల తనిఖీ

▸ వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు తరలింపు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 27: అదనపు ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియను మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈవీఎంలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఈవీఎంల తనిఖీ ప్రక్రియను, వాటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను అదనపు కలెక్టర్ మహేందర్‌జీతో కలిసి పరిశీలించారు. అదనపు ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ అనంతరం అధికారులు మాక్ పోలింగ్ నిర్వహించి, పోలీస్ భద్రతా మధ్య వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కుసుమ సత్యనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు, నాయబ్ తహసీల్దార్లు కొండూరి సంతోష్, జన్ను శ్యామ్, దేవులపల్లి రామకృష్ణ, ఎన్నికల సిబ్బంది అన్వేష్, రవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నేహాల్, రజనీకాంత్, మణి, లక్ష్మణ్, సునీల్, జైపాల్‌రెడ్డి, వెంకట్, సయ్యద్ ఫైజుల్లా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుపై హర్షం

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 27: సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు హర్షణీయమని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. మార్చి 6న జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ సమావేశాన్ని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 317 జీవో ద్వారా ఏకపక్షంగా విడుదల చేసిన మార్గదర్శకాల కారణంగా పలువురు ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. చాలావరకు ఉద్యోగులు సొంత జిల్లాలను వదిలి ఇతర జిల్లాలకు కేటాయించారని అన్నారు. నిబంధనల ప్రకారం భార్యాభర్తలను ఒకే జిల్లాకు బదిలీ చేయాల్సి ఉండగా 19 జిల్లాల్లో అనుమతించి 13 జిల్లాల్లో బ్లాక్ చేశారని పేర్కొన్నారు.

ప్రభుత్వం వీలైనంత త్వరలో ఏర్పాటు చేసిన ఉపసంఘం అధ్యయనం చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో బైరి సోమయ్య, పుల్లూరు వేణుగోపాల్, రాజేష్, శ్యాంసుందర్, రామునాయక్, మోయిజ్, లక్ష్మీప్రసాద్, సలీం, శ్రీనివాస్, రాజమౌళి, కుమార్, రాజ్యలక్ష్మీ, జయంతి, పావని, సింధు, రాణి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్

హైకోర్టు ఏజీపీగా రాధా సందీప్తి రెడ్డి

సుబేదారి, ఫిబ్రవరి 27: హైకోర్టు ఏజీపీగా హనుమకొండ సుబేదారికి చెందిన రాధా సందీప్తి రెడ్డి మంగళవారం నియమితులయ్యారు. హనుమకొండలోని బార్ అసోసియేషన్‌లో సందీప్తి రెడ్డి ప్రాక్టీస్ చేశారు. బీటెక్ సీఎస్ఈ, ఎల్ఎల్‌బీ, డిప్లొమా ఇన్ పీజీడీసీఎల్ పూర్తి చేసిన ఆమె ఐపీఆర్ఎల్ఎల్ఎంలో గోల్డ్‌మెడలిస్ట్, క్రిమినల్ లా లో గోల్డ్‌మెడలిస్ట్‌గా నిలిచారు. రాధా సందీప్తి రెడ్డి ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారు.



నేడు జోతిష్యంలో పట్టా అందుకోనున్న సుదర్శనాచార్యులు

సంగెం, ఫిబ్రవరి 27: చింతలపల్లిలో భవానీ శంకర ఆలయం, ఊకల్‌లోని శ్రీ నాగసుబ్రమణ్య స్వామి ఆలయ ప్రధాన పూజరి సముద్రాల సుదర్శనాచార్యులు హైదరాబాద్‌లో ఎంఏలో జ్యోతిష్యం పట్టాను అందుకోనున్నారు. సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన ఆయన హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏలో జ్యోతిష్యం పూర్తి చేశారు. బుధవారం యూనివర్సిటీ ఆధ్వర్యంలో రవీంద్రభారతీలో జరిగే 16వ స్నాతకోత్సవంలో పట్టాను అందుకోనున్నారు. ఈమేరకు యూనివర్సిటీ అధికారులు ఆహ్వానం పంపారు.



కోడ్ లోపే దళితబంధు డబ్బులు జమ చేయాలి

▸ రాష్ట్ర దళిత బంధు సాధన ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు కోగిల మహేష్

వడ్డేపల్లి, ఫిబ్రవరి 27: లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చేలోపు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దళిత బంధు లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేయకుంటే ఎన్నికల్లో నామినేషన్లు వేస్తామని రాష్ట్ర దళిత బంధు సాధన ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు కోగిల మహేష్, రాష్ట్ర కన్వీనర్ చిట్టిమల్ల సమ్మయ్యలు అన్నారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గత ప్రభుత్వ హయాంలో రెండో విడత దళిత బంధుకు ఎంపికైన లబ్ధిదారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేసిన రెండో దళిత బంధు లబ్ధిదారుల ఖాతాల్లో కలెక్టర్ వెంటనే డబ్బులు జమ చేయాలని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా కార్యాచరణ రూపొందించుకుంటామని హెచ్చరించారు. ఈ ధర్నాలో రాష్ట్ర దళిత బంధు సాధన సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు కావేరి చిన్ని కృష్ణ, మడికొండ రమేష్, బోనగిరి శ్రీనివాస్, దర్శనాల సంజీవ, దుర్గం రాజేష్, ఏకు కార్తీక్, ఐత ప్రశాంత్, కనకం విశ్వనాథ్, అచ్చుకట్ల రమేష్, భూపెల్లి రాజు, గోల్కొండ బుచ్చన్న, మాదరి రాంబాబు, రామకృష్ణ, రమేష్, గాజెర్ల వెంకన్న, ఎడ్ల కిరణ్, సాంబయ్యతో పాటు వివిధ జిల్లాలు, నియోజక వర్గాలకు చెందిన దళిత బంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దళిత బంధు రెండో విడత లబ్ధిదారులు

రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీలలో అఖిల్ ప్రథమస్థానం

మడికొండ, ఫిబ్రవరి 27: కరీంనగర్‌లో బ్రూస్లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మడికొండకు చెందిన గడ్డం అఖిల్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించి నిర్వాహకుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, బహుమతి అందుకున్నాడు. సోమవారం మడికొండలోని నవోదయ స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ చింతకుంట్ల భూపాల్‌రెడ్డి అఖిల్‌ను, కోచ్ నల్ల రామక్రిష్ణను తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో కొప్పుల బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


స్కూల్ ప్రిన్సిపాల్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న గడ్డం అఖిల్

నిరంతర విద్యుత్ సరఫరా

▸ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు

మడికొండ, ఫిబ్రవరి 27: అత్యవసర సమయాల్లో సైతం అంతరాయం లేకుండా ప్రణాళికాబద్ధంగా నిరంతర విద్యుత్ సరఫరా కోసం సిబ్బందితో కలిసి కృషి చేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు. మడికొండలోని కరిష్మా గార్డెన్స్‌లో సోమవారం ఎన్పీడీసీఎల్ కాజీపేట సబ్ డివిజన్ ఏఈలు, ఫీల్డ్ స్టాఫ్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. హనుమకొండ డీఈఈ జి. సాంబరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బందికి గృహజ్యోతి పథకం అమలు చేయడానికి విద్యుత్ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేయడంతో పాటు వారి నుంచి సలహాలు తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి జేఎల్ఎం స్థాయిలో ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో హనుమకొండ టెక్నికల్ ఏడీ ఏ. విజయేందర్‌రెడ్డి, కాజీపేట ఏడీఈ నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, సబ్ డివిజన్ ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, జేఎల్ఎంలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు

మానసిక స్థితి బాగాలేక వ్యక్తి ఆత్మహత్య

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 27 : కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రగట్టు గుట్ట వద్ద నివాసం ఉంటున్న గరిపెల్లి మధుసూదన్(50) అనే వ్యక్తి మానసిక పరిస్థితి బాగాలేక సోమవారం సాయంత్రం నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మానసిక స్థితి బాగాలేక కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మధుసూదన్ వంట రూములోకి వెళ్లి గ్యాస్ ఆన్‌చేసి అంటించుకున్నాడు. గమనించిన అతడి భార్య ప్రభావతి 108 కాల్ చేసి ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మధుసూదన్ మృతి చెందారు. ఈ విషయమై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. మధుసూదన్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కాజీపేట రైల్వే డీఎస్పీగా తాళ్లపల్లి కృపాకర్

కాజీపేట, ఫిబ్రవరి 27: కాజీపేట రైల్వే డీఎస్పీగా తాళ్లపల్లి కృపాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఖమ్మంలో పనిచేసి బదిలీపై కాజీపేటకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావు కాచిగూడకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ కృపాకర్‌ను కాజీపేట రైల్వే సీఐ రామ్మూర్తి, వరంగల్ సీఐ నరేశ్, ఖమ్మం సీఐ ఎ.వెంకటేశ్వర్లులు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

సైన్స్ పోటీల విజేతలకు నేడు బహుమతుల ప్రదానం

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 27: తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్, రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నేషనల్ సైన్స్ డే సందర్భంగా వివిధ రకాల పోటీలను నిర్వహించింది. ఈ నెల 28వ తేదీన బహుమతుల ప్రధానం వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు టీఎస్ కాస్ట్ మెంబర్ సెక్రటరీ మారుపాక నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై బహుమతి ప్రదానం చేయనున్నారు. ఎన్విరాన్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ కూడా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ఏసీపీని సన్మానించిన రెడ్డి సంఘం నాయకులు


ఏసీపీ దేవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 27: హనుమకొండ ఏసీపీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కొత్త దేవేందర్‌రెడ్డిని హనుమకొండ జిల్లా రెడ్డి సంఘం నాయకులు మంగళవారం పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. రెడ్డి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రెడ్డి బిడ్డలు ఏ పదవిలో ఉన్నా, ఏ ఉద్యోగంలో ఉన్నా అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు చూరగొని ఆ పదవికి వన్నె తెస్తారని అన్నారు. కార్యక్రమంలో ఇంకా రాదారపు సంజీవరెడ్డి, ఈసం సురేందర్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, కట్కూరి హన్మంతురెడ్డి, మధుకర్‌రెడ్డి, పాడి మల్లారెడ్డి, గంగిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో బంగారు భవిష్యత్..

ఐనవోలు, ఫిబ్రవరి 27: చదువు అంధకారాన్ని తొలగించి బంగారు భవిష్యత్‌ను కల్పిస్తోందని విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని కమ్యూనిటీ మోబిలైజేషన్ జిల్లా అధికారి బోయినపల్లి రాధ తెలిపారు. ఐనవోలు ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతుల వారిగా సామార్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫిజియోథెరపి కేంద్రంలో సేవలు లభిస్తాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీహర్షుడు, భీమళ్ల సారయ్య, మధుకర్, లక్ష్మయ్య, మహేందర్, మహేందర్‌రెడ్డి, రూప, ఫిజియో డాక్టర్ ఆర్. మమత, భవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవాలి

హనుమకొండ, ఫిబ్రవరి 27 : గ్రామీణా ప్రాంతాల విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యం కలిగి ఉంటారని నిట్ ప్రొఫెసర్ పులి రవికుమార్ అన్నారు. మంగళవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రవికుమార్, కడియం కావ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఆసక్తి ఉన్న శాస్త్ర, సాంకేతిక రంగాలను ఎంచుకోవాలన్నారు. కృతిమ మేధతో అనుహ్య మార్పులు వస్తున్న కాలంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండి పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలన్నారు. అనంతరం కడియం ఫౌండేషన్ చైర్మన్ కావ్య మాట్లాడుతూ మానవత విలువలు నిత్యం అధ్యయనం ఉన్న కోర్సులను విద్యార్థులు ఎంచుకోవాలన్నారు. జీవశాస్త్రంలోని పలుకోర్సుల గురించి ఆమె వివరించారు. అనంతరం పదో తరగతికి చెందిన 200 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్షకు సంబంధించిన సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 27: కాకతీయ యూనివర్సిటీలో పోలీస్ స్టేషన్ పరిధిలోని కిట్స్ కళాశాల ఎదుట చిరువ్యాపారం చేసుకుంటున్న యశోద అనే మహిళ మెడ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు గొలుసు లాక్కెళ్లారు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి షాపునకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు లేస్ ప్యాకెట్ కావాలని అడిగి హఠాత్తుగా మహిళ మెడలో ఉన్న 15 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు బాధితురాలు తెలిపారు.

సాహిత్యం జీవితాలకు మార్గదర్శనం చేస్తోంది

▸ కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 27: మానవ జీవితాల్ని సాహిత్యం మార్గదర్శనం చేస్తోందని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అన్నారు. కేయూ సెనెట్ హాల్‌లో కాకతీయ విశ్వవిద్యాలయం 'తెలుగు ఆచార్యుల సాహిత్య సేవ' అనే అంశంపై జరిగిన రెండు రోజుల సదస్సు ముగిసింది. ఈ సందర్భంగా తెలుగు శాఖాధిపతి ప్రొఫెసర్ బన్న ఐలయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో వీసీ రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు విభాగం నేతృత్వంలో రూపొందించిన విమర్శిని సంచికను ఉమ్మడి ఏపీ తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు ప్రొఫెసర్ కె.యాదగిరి, శాతవాహన వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎండీ ఇక్బాల్ అలీ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. తెలుగు సాహిత్య వికాసానికి అవిరళ కృషి చేసిన సాహితీ వేత్తల సేవలను కొనియాడారు. తెలుగు అకాడమీ పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.యాదగిరి మాట్లాడుతూ.. కేయూ తెలుగు శాఖ ఎవరెస్ట్ శిఖరమంతా ఖ్యాతి పొందిందన్నారు. ఈ సదస్సులో కాశీలోని బెనారస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బూదాటి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ కె.కాత్యాయని విద్మహే, డాక్టర్ గంగు కిషన్‌ప్రసాద్ ఇతర అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రమాదానికి కారణమైన ఆయిల్ ట్యాంకర్

ఆగి ఉన్న కారును ఢీకొన్న ట్యాంకర్

- కారు పక్కన నిల్చున ముగ్గురు యువకుల మృతి
- సంగారెడ్డి జిల్లా జోగిపేట వద్ద ఘటన
- పరార్ అవుతుండగా ట్యాంకర్ బోల్తా.. డ్రైవర్ మృతి



మహ్మద్ వాజీద్, హాజీ హుస్సేన్, ముక్రమ్

జోగిపేట, ఫిబ్రవరి 27: రాత్రిపూట చాయ్ తాగేందుకు కారులో బయలుదేరిన ఆ స్నేహితులు మూత్ర విసర్జన కోసం వాహనాన్ని రోడ్డుకు ఓ పక్కన ఆపారు. మృత్యు శకటంలా దూసుకొచ్చిన ఓ ఆయిల్ ట్యాంకర్ కారును ఢీకొట్టడంతో ముగ్గురు మృత్యువాతపడ్డారు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా జోగిపేట శివారులో ఈ ప్రమాదం సంభవించింది. మూడు నిండు ప్రాణాలను బలిగొన్న ఆ ట్యాంకర్ డ్రైవర్ ఘటనాస్థలి నుంచి వాహనంతో పారిపోయినా అతడూ మృత్యువాతపడటం గమనార్హం. ఘటనాస్థలి నుంచి 26 కి.మీ దూరం ప్రయాణించాక ట్యాంకర్ బోల్తాపడటంతో తీవ్రగాయాల పాలై ఘటనాస్థలిలోనే ప్రాణాలొదిలాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. జోగిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మహ్మద్ వాజీద్ (27), హాజీ హుస్సేన్ (25), ముక్రమ్ (23), రిజ్వాన్ (23), అర్షద్, శంషు స్నేహితులు. సోమవారం అర్ధరాత్రి కలుసుకున్నారు. అర్షద్ కారులో చాయ్ తాగేందుకు జోగిపేట నుంచి డాకూర్ గ్రామ శివారులోని హోటల్‌కు బయలుదేరారు. సంగుపేట నుంచి మాసాన్‌పల్లి మీదుగా 161 జాతీయ రహదారి సర్వీసు రోడ్డు గుండా ప్రయాణించారు. మాసాన్‌పల్లి శివారులోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డు అండర్ పాస్ వద్ద మూత్ర విసర్జన కోసం కారును ఆపారు. శంషు మూత్ర విసర్జన కోసం రోడ్డుకు అవలకు వెళ్లగా వాజీద్, హాజీ, ముక్రమ్, రిజ్వాన్ కారు పక్కన నిల్చున్నారు. కారును నడుపుతున్న అర్షద్ మాత్రం డ్రైవింగ్ సీట్లోనే కూర్చున్నాడు. అదే సమయంలో సంగారెడ్డి వైపు నుంచి మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన ఆయిల్ ట్యాంకర్.. కారును బలంగా ఢీకొట్టి, వాజీద్, హాజీ, ముక్రమ్‌పై నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. రిజ్వాన్‌కు రెండు కాళ్లు విరిగాయి. కారు పక్కనే ఉన్న పొలంలోకి పల్టీ కొట్టింది. కారులో ఉన్న అర్షద్ ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. మూత్ర విసర్జన చేసేందుకు వెళ్లడంతో శంషు కూడా ప్రమాదం తప్పింది. అయితే ప్రమాదం జరిగాక ట్యాంకర్‌ను డ్రైవర్‌ను ఆపలేదు. అలాగే ముందుకు ఉరికించాడు. అయితే మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం కాయిదంపల్లి వద్ద మలుపులో ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడిని కర్నె రామ్ (24)గా గుర్తించారు. కాగా మృతుల్లో ఒకరైన వాజీద్ స్థానిక బీఆర్ఎస్ నేత. నిరుడే పెళ్లయింది. భార్య నిండు గర్భిణి. భర్త ఇక లేడనే షాక్‌తో స్పృహ తప్పింది. ప్రమాద ఘటనపై మంత్రి దామోదర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పరామర్శించారు.

లోన్‌యాప్ వేధింపులకు విద్యార్థి ఆత్మహత్య

కార్వాన్, దుండిగల్ ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లోన్ యాప్ ఏజెంట్ల వేధింపులు తాళలేక ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. గుడిమల్కాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. గుడిమల్కాపూర్ హీరానగర్ ప్రాంతానికి చెందిన మనోజ్ (23) దుండిగల్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడిన మనోజ్ చాలా డబ్బు పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో లోన్ యాప్ ద్వారా డబ్బు అప్పుగా తీసుకున్నాడు. కానీ ఈఎంఐలు సక్రమంగా చెల్లించలేకపోయాడు. దీంతో ఆ యాప్ ఏజెంట్లు మనోజ్‌ను వేధించడం మొదలుపెట్టారు. వీటిని తట్టుకోలేకపోయిన మనోజ్ సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా, మనోజ్ గత ఏడాది కూడా ఇలానే లోన్ యాప్ ఏజెంట్ల వేధింపులకు గురవ్వగా తల్లిదండ్రులు రూ.7.5 లక్షల అప్పు తీర్చారు. మళ్లీ ఈ ఏడాది లోన్ యాప్‌లో తీసుకున్న అప్పునకు మనోజ్ రూ.3.5 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ అప్పు విషయం తెలియడంతో తండ్రి మనోజ్‌ను ప్రశ్నించారు. మరోపక్క, డబ్బు వసూలు కోసం వేధింపులు మొదలుపెట్టిన లోన్ యాప్ ఏజెంట్లు.. మనోజ్ బంధువులు, స్నేహితులు, కుటుంబసభ్యులకు ఫోన్లు చేస్తున్నారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన మనోజ్ బలవన్మరణానికి పాల్పడ్డాడు.

రైస్ మిల్ వ్యాపారి ఆస్తుల వేలం

- రెండేళ్లుగా సీఎంఆర్ ఇవ్వకపోవడంతో చర్య

నర్సాపూర్, ఫిబ్రవరి 27: ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని.. సకాలంలో బియ్యం(సీఎంఆర్) ఇవ్వని రైస్ మిల్ వ్యాపారి ఆస్తులను అధికారులు వేలం వేశారు. రెండేళ్లుగా సీఎంఆర్ ఇవ్వకుండా జాప్యం చేయడం.. సుమారు రూ.47 కోట్ల విలువైన బియ్యం అప్పజెప్పకపోవడంతో ఆర్ఆర్ యాక్టు ప్రకారం ఆయన స్థిర, చర ఆస్తులను జప్తు చేశారు. ఈ కేసులో మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి జనవరి 18న అరెస్టు కూడా అయ్యారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిబ్రవరి 13న ఆ వ్యాపారికి చెందిన రెండు కార్లు, ఒక టీవీ, రెండు ఏసీలను వేలం వేశారు. తాజాగా.. మంగళవారం ఓ భవనం, షెడ్డుతో పాటు పలు చోట్ల ఉన్న వ్యవసాయ భూములను వేలం వేశారు. అందులో భాగంగా నర్సాపూర్‌లో ఉన్న ఓ భవనానికి అధికారులు ప్రభుత్వ ధర ప్రకారం రూ.86 లక్షలు నిర్దేశించగా.. వేలం పాటలో ఒకరు రూ.2.2 కోట్లకు దక్కించుకున్నారు. అదేవిధంగా పట్టణ పరిధిలోనే ఉన్న ఓ షెడ్డుతో కూడిన స్థలానికి రూ.30 లక్షలు నిర్దేశించగా.. వేలం పాటలో రూ.40 లక్షలు పలికింది. పలు చోట్ల వ్యవసాయ భూములు కూడా ఉన్నాయని.. వాటి విలువను రూ.2.50 కోట్లుగా నిర్ణయించగా.. అంతకు మించే ఆదాయం వచ్చిందని తహసీల్దార్ తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్ల పేరిట రూ.2.5 కోట్ల మోసం

- పోలీసులను ఆశ్రయించిన ఉమ్మడి ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి
- ఇద్దరిపై కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల చెల్లుబాటుపై సుప్రీం కోర్టు సంచలన తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. ఆ బాండ్ల పేరిట జరిగిన ఓ మోసం బయటికొచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని ఎలక్టోరల్ బాండ్ల పేరిట ఇద్దరు వ్యక్తులు రూ.2.5 కోట్లకు మోసం చేశారు. ఇందుకు సంబంధించి సదరు విశ్రాంత న్యాయమూర్తి.. హైదరాబాద్‌లోని ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డీఎస్ఆర్ వర్మ.. హైదరాబాద్‌లోని షేక్‌పేట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. డీఎస్ఆర్ వర్మ దూరపు బంధువైన నరేంద్రన్ ఓ సందర్భంలో ఆయన్ను కలిసి ఢిల్లీలో తనకు చాలా పలుకుబడి ఉందని చెప్పాడు. ఓ ప్రముఖ రాజకీయ పార్టీకి నిధుల సమీకరిస్తున్నానని, ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేస్తానని తెలిపాడు. అంతేకాక, అమెరికాలో ఉంటున్న డీఎస్ఆర్ వర్మ మనవడు, మనవరాలికి కూడా సాయం చేస్తానని నమ్మబలికాడు. నరేంద్ర మాటలను నమ్మిన విశ్రాంత న్యాయమూర్తి డీఎస్ఆర్ వర్మ ఎలక్టోరల్ బాండ్ తీసుకునేందుకు ముందుకొచ్చారు. ఇందులో భాగంగా తన భార్య, కూతురి బ్యాంకు ఖాతాల నుంచి 2021లో మొత్తం రూ.2.5 కోట్లను నరేంద్ర సూచనల మేరకు శరత్‌రెడ్డి అనే రియల్‌ఎస్టేట్ వ్యాపారికి చెల్లించారు. ఏళ్లు గడుస్తున్నా నరేంద్రన్ బాండ్లు కొనుగోలు చేయకపోగా, అమెరికాలో ఉంటున్న కుటుంబసభ్యులకూ సాయం చేయలేదు. అయితే, ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీం కోర్టు ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలకు ఈ వ్యవహారం విరుద్ధంగా ఉండడంతో తాను మోసపోయానని డీఎస్ఆర్ వర్మ పోలీసులను ఆశ్రయించారు. నరేంద్రన్, శరత్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పరీక్షల వేళ.. పరేషాన్ వద్దు!

ప్రశాంతంగా రాస్తేనే మంచి ఫలితాలు.. రోజుకు 9-10 గంటలపాటు నిద్ర అవసరం

- పౌష్టికాహారం తీసుకుంటేనే ఏకాగ్రత
- ఒత్తిడికి గురైతే ఏడాది శ్రమ వృథా
- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సీజన్ వచ్చేసింది..! బుధవారం నుంచి వచ్చే నెల 19 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయి. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. వీటితోపాటు.. టీఎస్‌పీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకూ విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురవ్వడం సహజమే..! ఏడాదంతా కష్టపడి చదివింది ఒక ఎత్తయితే.. చదివిన దాన్ని పరీక్షల సమయంలో పునఃశ్చరణ చేసుకోవడం మరో ఎత్తు. పునఃశ్చరణ సమయంలోనే విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతుంది. ఈ సమయంలో చేసే చిన్న పొరపాటు కూడా.. టాప్‌లో ఉండే విద్యార్థులు తొందరపాటుతో తప్పులు చేసే ప్రమాదాలుంటాయి. వంద శాతం మార్కులు వస్తాయనే విద్యార్థులు సైతం సగం మార్కులను కూడా సాధించలేని పరిస్థితులు నెలకొంటాయి. విద్యార్థులు ఏమాత్రం ఆందోళనకు గురవ్వకుండా.. మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని.. కొన్ని చిట్కాలను పాటిస్తే ఒత్తిడి, భయం, ఆందోళనలను దూరం పెట్టవచ్చని సైకాలజిస్టులు చెబుతున్నారు.

ప్రత్యేక ప్రణాళిక అవసరం

- సబ్జెక్టుల పునఃశ్చరణకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని ఉపాధ్యాయులు, నిపుణులు చెబుతున్నారు. రివిజన్ కోసం టైంటేబుల్‌ను రూపొందించుకోవాలి



- ఒక సబ్జెక్టును చదువుతున్నప్పుడు ముఖ్యాంశాలు, ప్రత్యేకమైన విభాగాలను నోట్ చేసుకోవాలి. ముఖ్యమైన తేదీలు, ప్రముఖుల పేర్లు, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీలో ఫార్ములాలు, లాంగ్వేజ్ సబ్జెక్టుల్లో అర్థాలు, నిర్వచనాలు ఈ కోవలోకి వస్తాయి
- పెద్ద ప్రశ్నలకు సమాధానాలు చదివేప్పుడే.. లఘు ప్రశ్నలకు సమాధానాలను నోట్ చేసుకోవాలి
- సమాధానాలను పేరగ్రాఫ్‌ల మాదిరిగా కాకుండా.. ముఖ్యాంశాలుగా/పాయింట్లుగా ఒకదాని తర్వాత ఒకటిగా క్రమ పద్ధతిలో నేర్చుకోవాలి
- క్రమ పద్ధతిలో సమాధానాలను గుర్తుపెట్టుకునేందుకు మెమొరీ స్టోరీ(నిమోనిక్ టెక్నిక్స్), విజ్యువలైజేషన్ వంటి ప్రక్రియలను ఉపయోగించాలి
- పెద్ద ప్రశ్నలకు సమాధానాలు రాసేప్పుడు వర్గాల వారీగా సబ్-హెడ్డింగ్‌లను పెడితే మంచి మార్కులు వస్తాయి

9-10 గంటలపాటు నిద్ర అవసరం..

- పరీక్షల సమయంలో అర్ధరాత్రి వరకు పుస్తకాలతో కుస్తీపట్టడం.. కాసేపు పడుకుని, తెల్లవారుజామున నాలుగింటికే లేవడం వంటివి చేయకూడదు
- సాధారణ రోజుల మాదిరిగానే 9-10 గంటల నిద్ర అవసరం. సరిపడా నిద్ర ఉన్న విద్యార్థులే కాన్ఫిడెంట్‌గా సమాధానాలు రాయగలుగుతారు
- కంటినిండా నిద్ర లేకుంటే.. చదివినది అర్థం కాదు. ఎంత నేర్చుకున్నా.. గుర్తుండదు. నిద్రలేమి వల్ల తెలిసిన సమాధానాలను కూడా సరిగ్గా రాయలేరు.

ఖాళీ కడుపుతో ఉండొద్దు

- ఎక్కువగా పరీక్షలు ఉదయం వేళల్లో ఉంటాయి. ఇంటర్ పరీక్షలు కూడా ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. ఈ హడావుడితో విద్యార్థులు అల్పాహారాన్ని మానేస్తుంటారు. అలా చేయడం సరికాదని సైకాలజిస్టులు చెబుతున్నారు
- ఒకవేళ ఉదయం అల్పాహారం తీసుకునే అవకాశం లేకుంటే.. సలాడ్లు, కనీసం పండ్ల రసాలు తీసుకోవాలని న్యూట్రిషనిస్టులు సలహా ఇస్తున్నారు

గదిలో ప్రశాంతంగా కూర్చోవాలి

- విద్యార్థులు తమ ఆందోళనలను పరీక్ష హాలు బయటే వదిలిపెట్టాలి. గదిలోకి వెళ్లగానే తమకు కేటాయించిన సీట్లలో ప్రశాంతంగా కూర్చోవాలి
- ఇన్విజిలేటర్ నుంచి ప్రశ్నపత్రం తీసుకోగానే.. ప్రశాంతంగా ప్రతి ప్రశ్నను క్షుణ్ణంగా చదవాలి
- ప్రశ్నపత్రం తీసుకున్న వెంటనే సమాధానాలు రాయడానికి ఉపక్రమించకుండా.. అన్ని ప్రశ్నలను చదివి.. బాగా రాయగలిగేవాటిని టిక్ చేసుకోవాలి
- వేగంగా సమాధానాలు రాయాలనే ఆరాటం ఉంటే.. సమాధానాలను మరిచిపోయే ప్రమాదం ఉంది. ఒక్కో సమాధానానికి నిర్ణీత సమయాన్ని కేటాయించుకుని, పరీక్షలను రాయాలి
- ఒకేప్రశ్నను సాగదీయకుండా రాయొద్దు. మార్కుల కేటగిరీని బట్టి, సరైన సమాధానం ఇవ్వాలి
- సమయంలోగా సమాధానాలు రాయడం పూర్తయితే.. వెంటనే పేపర్ ఇచ్చి, బయటకు రావొద్దు. నిదానంగా కూర్చుని, రాసిన సమాధానాలను పరిశీలించుకోవాలి. దీనివల్ల తప్పులేమైనా ఉంటే సరిదిద్దుకోవచ్చు

పరీక్షలను భూతద్దంలో చూడొద్దు



- స్వాతి, సైకాలజీ ప్రొఫెసర్ (ఉస్మానియా యూనివర్సిటీ)

పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను విద్యార్థులు భూతద్దంలో చూడొద్దు. వాటిని అంతకు ముందే రాసిన ఎఫ్ఏ, ఎస్ఏ మాదిరిగానే భావించి, రాయాలి. ఇప్పటివరకు చదివిన పాఠాలపైనే దృష్టి పెట్టాలి. చదవని వాటిని చదివితే తెలిసినవి మరిచిపోయే ప్రమాదం ఉంటుంది. జీవితంలో పరీక్షలు ఒక భాగం మాత్రమే..! జీవన్మరణ సమస్య కాదు. అందుకే.. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆందోళనకు గురికావొద్దు. పర్సంటేజీలపై తల్లిదండ్రులు పిల్లలకు టార్గెట్ విధించకుండా.. వారికి మనోధైర్యం కల్పించాలి.

నిమిషం నిబంధన వద్దు

ఇంటర్ పరీక్షల్లో నిమిషం ఆలస్యం నిబంధనను తొలగించాలని ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (పీడీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి బస్టాపులో బస్సులు ఆపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులు ఎక్కడ బస్సులు ఆపినా ఎక్కించుకునేలా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాసర ట్రిపుల్ ఐటీలో మళ్లీ గంజాయి మత్తు

హాస్టల్లో మత్తు పీల్చుతూ పట్టుబడ్డ ఇద్దరు పిల్లలు.. తల్లిదండ్రులను పిలిపించి ఇళ్లకు పంపించిన సిబ్బంది

బాసర, ఫిబ్రవరి 27: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో గంజాయి వాసనలు పోలేదు. నిరుడు కొంత మంది విద్యార్థులు గంజాయితో దొరికిపోగా తాజాగా ఆదివారం ఇద్దరు విద్యార్థులు హాస్టల్ భవనం టెర్రస్ మీద గంజాయి పీల్చుతూ సిబ్బందికి పట్టుబడ్డారు. సదరు పిల్లల తల్లిదండ్రులను అధికారులు పిలిపించి.. వారితో ఆ విద్యార్థులను ఇళ్లకు పంపించినట్లు తెలుస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో బయటికి రెండు ఘటనలు గుప్పుమన్నా, విద్యార్థులు గంజాయి పీల్చుతున్న ఘటనలు లోలోపల తరచూ చోటుచేసుకుంటున్నాయని, పిల్లల భవిష్యత్తు దృష్ట్యా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. అధికారుల తీరును అదునుగా చేసుకొని విద్యార్థులు నిర్భీతిగా గంజాయిని తెచ్చుకుంటున్నారన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ వర్సిటీలో 9వేల మంది విద్యార్థులుంటే అందులో 6 వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులే ఉన్నారు. గంజాయితో పట్టుబడుతున్న వారిలో ఇంజనీరింగ్ విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారన్న విమర్శలున్నాయి. మద్యానికి బానిసైన విద్యార్థులు క్యాంపస్‌లో మత్తు కోసం గంజాయికి అలవాటు పడుతున్నారని చెబుతున్నారు. గంజాయి వాడేందుకు వర్సిటీలో అనువైన వాతావరణం ఉందని, ఫలితంగా ఆ మత్తుకు అలవాటు పడే విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోందని అంటున్నారు. నిరుడు దొరికిన కేసులో అధికారులను విచారిస్తే.. చాలా మంది విద్యార్థుల ప్రమేయం వెలుగు చూసింది. తాజాగా ఇద్దరు విద్యార్థులను సెక్యూరిటీ సిబ్బంది గుర్తించినప్పటికీ.. అధికారులు మాత్రం లోతుగా విచారించడం లేదు. కాగా వర్సిటీలోని విద్యార్థులకు మహారాష్ట్ర నుంచే గంజాయి వస్తున్నట్లు తెలుస్తోంది. ఏడాది క్రితం జరిగిన కేసు విచారణలో కూడా మహారాష్ట్ర నుంచే గంజాయి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. తాజాగా ఇద్దరు విద్యార్థులు దొరకగా వారికీ సరుకు మహారాష్ట్ర నుంచే వచ్చినట్లు తేలింది. క్యాంపస్‌కు మహారాష్ట్ర ప్రాంత పట్టణానికి 7-8 కి.మీ దూరంలోనే ఉండటం.. అక్కడ సరుకు క్రయవిక్రయాలపై పెద్ద నిఘా లేకపోవడంతో పనిమీద బయటకొచ్చే విద్యార్థులు తేలిగ్గా ఆ పట్టణం నుంచి గంజాయి తెచ్చుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజా కేసులో హాస్టల్‌లోని భోజనశాలలో పనిచేసే మహారాష్ట్ర ప్రాంత వర్కర్ ద్వారా విద్యార్థులు గంజాయిని తెప్పించుకున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది.



గోపాల్ కృష్ణ దంపతులను సన్మానిస్తున్న ఓయూ అధికారులు

ఓయూకు రూ. 5 కోట్ల భారీ విరాళం

- ప్రకటించిన పూర్వ విద్యార్థి గోపాల్ టి.కె కృష్ణ

తార్నాక, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి పూర్వ విద్యార్థి గోపాల్ టి.కె కృష్ణ రూ. 5 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించారు. తాను చదువుకున్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో క్లాస్ రూం కాంప్లెక్స్ నిర్మాణం కోసం విరాళాన్ని అందిస్తానని మంగళవారం ప్రకటించారు. ఓయూ చరిత్రలో వ్యక్తిగతంగా అత్యధిక విరాళాన్ని అందజేసిన ఘనతను ఆయన సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్ టి.కె కృష్ణ దంపతులను ఓయూ అధికారులు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. గోపాల్ టి.కె కృష్ణ 1968లో ఓయూలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో బీఈ పూర్తి చేసి అమెరికాలో స్థిరపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ పి. లక్ష్మీనారాయణ, ఓయస్‌డీ రెడ్యానాయక్, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీరాం వెంకటేశ్, ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాకతో తెలంగాణలో రామరాజ్యం

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో భద్రాద్రి రామయ్య కల్యాణ వైభోగం కానరాలేదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని



భద్రాచలం, ఫిబ్రవరి 27: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో తెలంగాణలో రామరాజ్యం వచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మల్లు నందిని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో గత పదేళ్లలో భద్రాద్రి రామయ్య కల్యాణ వైభవం కానరాలేదని, ఉత్సవాలు అనుకున్నంత స్థాయిలో నిర్వహించలేదని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ఆలయానికి ఏం చేయలేకపోతున్నామన్న బాధ తనను వెంటాడిందని చెప్పారు. భద్రాచలంలో మంగళవారం గ్లోబల్ హ్యూమానిటేరియన్ మిషన్(అంతర్జాతీయ మానవతా కార్యక్రమం) వ్యవస్థాపకుడు సద్గురు మధుసూదన్‌సాయి ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో మల్లు నందిని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భద్రాద్రి రామాలయ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క దృష్టి పెట్టారని, ఈ విషయమై ఇప్పటికే వారిద్దరూ చర్చించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బడికి వెళ్తున్న విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని సద్గురు మధుసూదన్ సాయి ట్రస్టు వారు ప్రారంభిస్తున్నారని, ఇందుకు అవసరమైన 50% నిధులను తాను సమకూరుస్తున్నారని నందిని ఈ సందర్భంగా వెల్లడించారు. మిగతా 50% నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించేలా ఈ కార్యక్రమాన్ని సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ పథకం ద్వారా 25లక్షల మంది పిల్లలకు పౌష్టికాహారం అందుతుందన్నారు. అంతకు ముందు భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న నందిని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వికసిత భారత్ అంటే.. పెట్టుబడిదారులకు కొమ్ముకాయడమా?

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): : వికసిత భారత్ అంటే అంబానీ, ఆదాని వంటి పెట్టుబడిదారులకు కొమ్ము కాయడం కాదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దేవుణ్ని అడ్డం పెట్టుకొని బీజేపీ రాజకీయం చేస్తుందని విమర్శించారు. రుణమాఫీ వల్ల రైతులు సోమరులవుతారని బీజేపీ నేతలు వ్యాఖ్యలు చేశారని, వారిది అంబానీ, ఆదానీలకు రుణమాఫీ చేసే పార్టీ అని ఆరోపించారు. వికసిత భారత్ అంటే... పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడమా? పేదలు, మహిళలు బాధపడటమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ బండి సంజయ్ రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం మంచిది కాదన్నారు.

ఏపీ అధికారుల డుమ్మా..!!

- గోదావరి బోర్డు సమావేశం మళ్లీ వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశం మళ్లీ వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం జీఆర్ఎంబీ చైర్మన్ ఎంకే సిన్హా అధ్యక్షతన జలసౌధలో మంగళవారం ఉదయం సమావేశం ప్రారంభమైంది. తెలంగాణకు చెందిన అధికారులు హాజరవ్వగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరూ రాకపోవడంతో సమావేశాన్ని అర్ధాంతరంగా వాయిదా వేశారు. తెలంగాణ నుంచి ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, సీఈ(హైడ్రాలజీ, అంతర్రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి) శంకర్‌నాయక్, ఎస్ఈ కోటేశ్వరరావు, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్ హాజరయ్యారు. ఈ సమావేశానికి హాజరుకాలేమని ఏపీ ఇది వరకే తేల్చిచెప్పింది. అయితే, ఇప్పటికే సమావేశం పలుమార్లు వాయిదా పడిందని, ఈసారి ఎలాగైనా హాజరు కావాలని ఏపీకి జీఆర్ఎంబీ విజ్ఞప్తి చేసింది. కానీ ఏపీ అధికారులు దూరంగా ఉండడంతో సమావేశాన్ని బోర్డు వాయిదా వేసింది. తదుపరి సమావేశం మార్చి 1న నిర్వహిస్తామని మంగళవారం రాత్రి తెలిపింది. అయితే, మార్చి 11వ తేదీ దాకా తాము సమావేశానికి హాజరుకాలేమని ఏపీ స్పష్టం చేసినా మార్చి 1న సమావేశం ఉంటుందని బోర్డు తేల్చిచెప్పింది. జీఆర్ఎంబీ సమావేశం ఎప్పుడుపెట్టినా తాము హాజరవుతామని తెలంగాణ పేర్కొంది.

రామగుండం ఎరువుల ఫ్యాక్టరీకి నీటి గండం!

- ఏప్రిల్ 15 నుంచి ప్రత్యామ్నాయం చూసుకోవాలన్న అధికారులు
- ఎల్లంపల్లి ప్రాజెక్టులో 10 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వలు
- నీటి సరఫరా నిలిచిపోతే యూరియా ఉత్పత్తికి ఆటంకం



కోల్‌సిటీ, ఫిబ్రవరి 27: రామగుండంలోని ఎరువుల కర్మాగారానికి నీటి గండం ఏర్పడింది. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)కు గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఏటా 0.5 టీఎంసీల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు 10 టీఎంసీలకు పడిపోయాయి. ఏప్రిల్ 15 తర్వాత నీటి నిల్వలు నాలుగు టీఎంసీల కంటే దిగువకు పడిపోయే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రత్యామ్నాయం చూసుకోవాలంటూ మిషన్ భగీరథ యంత్రాంగం ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యానికి సూచించింది. దీంతో ఆర్ఎఫ్‌సీఎల్ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మిషన్ భగీరథ ద్వారా ఎల్లంపల్లి నుంచి ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అవసరాలకు గంటకు 1100 క్యూబిక్ మీటర్ల నీటిని వినియోగిస్తున్నారు. ఇక్కడ ఏటా 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి జరగాల్సి ఉంది. ప్రాజెక్టులో ఉత్పత్తయ్యే యూరియాలో సగం తెలంగాణకే సరఫరా చేస్తారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ప్రాజెక్టులో నిరంతరాయంగా ఉత్పత్తి జరిగితేనే తెలంగాణకు వర్షాకాల సీజన్‌లో యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉంటాయి. ఈ పరిస్థితుల్లో నీటి సరఫరా నిలిచిపోతే ప్లాంట్‌లో రెండు నెలల పాటు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ఆ ప్రభావం రాష్ట్ర అవసరాలపై పడనుంది. కాగా, ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు మంగళవారం నాటికి 10.66 టీఎంసీలకు చేరాయి. ఇందులో నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌కు 330 క్యూసెక్కులు, ఎన్‌టీపీసీకి 121 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

బుధవారం • 28 ఫిబ్రవరి 2024

cinema@andhrajyothy.com

జక్కన కోసం జేమ్స్ కామెరూన్?







షూటింగ్‌కు డేట్ ఖాయం కాలేదు, సినిమాకు పేరు ఖరారు కాలేదు, తారాగణం ఎవరనేది తేలనేలేదు అయినా నిత్యం ఏదో ఒక చర్చతో వార్తల్లో నిలుస్తోంది మహేశ్‌బాబు-రాజమౌళి సినిమా. ఈ చిత్రానికి 'ఎస్ఎస్ఎంబీ 29' అనేది అనధికారికంగా ప్రచారంలో ఉన్న వర్కింగ్ టైటిల్. ఈ సినిమా గురించి అడపా దడపా కథకులు విజయేంద్ర ప్రసాద్ చూచాయగా చెప్పిన విషయాలను బట్టి ఇదొక అడ్వెంచరస్ యాక్షన్ డ్రామా అని తెలవడం తప్ప మరేదీ బయటకు రాలేదు. గుప్పిట మూసి ఉన్నంతవరకే గుట్టు అన్నట్లు రాజమౌళి కూడా ఈ సినిమా విషయంలో గుంభనంగా ఉంటున్నారు. కానీ కొంతమంది ఔత్సాహికులు మాత్రం ఏదో ఒక విషయంతో ఈ సినిమాను ప్రతి రోజూ చర్చనీయాంశం చేస్తున్నారు. ఈ సినిమా గురించి సోషల్ మీడియాలో, సినీ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్న కొన్ని విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మేకింగ్‌లోనే కాదు సినిమాకు ప్రచారం తేవడంలోనూ రాజమౌళి సిద్ధహస్తుడు. సినిమాకు మంచి హైప్ తేవడం కోసం జాతీయ మీడియాను ఆయన ఆహ్వానించనున్నారని చెబుతున్నారు. ఆ పాత్రికేయ సమావేశంలోనే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని రాజమౌళి భావిస్తున్నారనేది సారాంశం. ఇక ఈ మధ్యన సోషల్ మీడియాలో బాగా హల్‌చల్ చేస్తున్న విషయం ఈ సినిమా ప్రారంభోత్సవం గురించే. హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్‌తో రాజమౌళి క్లాప్ కొట్టించేబోతున్నారట. ఆస్కార్ సహా పలు వేదికలపై 'ఆర్ఆర్ఆర్' చిత్రం గురించి మాట్లాడుతూ రాజమౌళి దర్శకత్వ ప్రతిభను కామెరూన్ కొనియాడారు. ఈ నేపథ్యం వల్లనే కామెరూన్ వస్తాడా అనే సంశయం ఉన్నా తేలిగ్గా తీసివేయలేకపోతున్నారు. ఇక ఇటీవలే 'గుంటూరు కారం' చిత్రంతో అభిమానులను అలరించారు మహేశ్‌బాబు. ప్రస్తుతం రాజమౌళి చిత్రం కోసం ఆయన సన్నాహాలు మొదలుపెట్టారు. ఇందులో మహేశ్‌ను సరికొత్త లుక్‌లో చూపించబోతున్నారని తెలుస్తోంది. ఆ లుక్ బయటకు రాకుండా ఉండేందుకు మహేశ్ ప్రైవేట్ కార్యక్రమాలకు కూడా హాజరవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారనే మాట వినిపిస్తోంది. భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో ప్రీ ప్రొడక్షన్‌కు మరింత సమయం పట్టనుందట. తొలుత ఉగాదికి ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేసినా, ఇప్పుడు మహేశ్ పుట్టిన రోజైన ఆగస్టు 9న ఓపెనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలుస్తోంది. అయితే ఇవన్నీ అనధికారిక వార్తలే. వీటిలో ఏ ఒక్కదానిపైనా ఇప్పటివరకూ రాజమౌళి కానీ చిత్రబృందం కానీ స్పందించలేదు.

వీరమల్లు విజృంభణ ఖాయం



పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు క్రిష్ తెరకెక్కిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. చారిత్రక నేపథ్యంలో కాల్పనిక గాథతో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. పవన్ కల్యాణ్ రాజకీయాలపై దృష్టి పెట్టడమా? లేక మరేదైనా కారణమో తెలియదు కానీ కొన్ని షెడ్యూల్స్ పూర్తయ్యాక తాత్కాలికంగా చిత్రీకరణ నిలిచిపోయింది. అయితే పవన్ కల్యాణ్ ఈ సినిమాను దాదాపుగా పక్కనపెట్టినట్లేనని కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం జరుగుతోంది. పలు సందర్భాల్లో మేకర్స్ ఈ ప్రచారాన్ని ఖండించారు. 'హరిహర వీరమల్లు' చిత్రం ఆగిపోలేదని చెబుతూ ఈ మధ్యనే కొత్త రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించారు. అయితే క్రిష్ అనుష్కతో హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా తీస్తున్నాడంటూ ప్రచారం మొదలైంది. దీంతో 'హరిహర వీరమల్లు'ను పక్కనపెట్టడం వల్లే ఆయన కొత్త ప్రాజెక్ట్‌ను ఓకే చేశారనే టాక్ నడుస్తోంది. దీంతో ఈ ఊహాగానాలకు తెరదించేందుకు నిర్మాత ఏఎం రత్నం రంగంలోకి దిగారు. చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'హరిహర వీరమల్లు' సినిమా ఆగిపోలేదు. దీనికి కొనసాగింపు చిత్రం కూడా ఉంటుంది. పవన్ కల్యాణ్‌ను హీరోగా మరో స్థాయికి తీసుకెళ్లే చిత్రమిది' అని తెలిపారు. 'డబ్బు కోసమే అయితే పవన్ కల్యాణ్‌తో ఏదో ఒక సినిమా చేసి సంపాదించుకోవచ్చు. కానీ మేం అలా అనుకోవడం లేదు. 'హరిహర వీరమల్లు' సినిమాతో ఆయనకు పేరు రావాలి, మాకు ఎప్పటికీ గుర్తుండిపోవాలనేదే మా కోరిక' అన్నారు. 'హరిహర వీరమల్లు చిత్రం ఆగిపోయిందంటూ కొంతమంది చేస్తున్న ప్రచారం నిజం కాదు. అవన్నీ అసత్యాలే. వాటిని నమ్మకండి' అని పవన్ అభిమానులను కోరారు. అత్యున్నత ప్రమాణాలతో వీఎఫ్ఎక్స్ పనులు చేయాల్సి రావడం వల్ల మేకింగ్‌కు ఎక్కువ సమయం పడుతోందని గతంలో ఏఎం రత్నం చెప్పారు.

క్రేజీ కాంబినేషన్ కుదిరింది



జైలర్ చిత్రం ఇచ్చిన సక్సెస్‌తో రజనీకాంత్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రసుతం ఆయన దర్శకుడు టీజే జ్ఞానవేల్ రాజా, లోకేశ్ కనగరాజ్‌తో సినిమాలు చేస్తున్నారు. తాజాగా రజనీకాంత్ హీరోగా మరో చిత్రం ఖాయమైంది. పలు కమర్షియల్ హిట్లు ఇచ్చిన బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాడ్ వాలా కొత్త చిత్రాన్ని నిర్మించనున్నారు. మంగళవారం ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. రజనీకాంత్‌ను కలసిన ఫొటోను షేర్ చేసి, 'లెజెండరీతో కలసి పనిచేసే అవకాశం నాకు దక్కిన గౌరవం. త్వరలోనే మా మరపురాని ప్రయాణం ప్రారంభిస్తాం' అన్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటించే అవకాశముంది.

ఆ టైమ్ వచ్చింది

తన రాజకీయ అరంగేట్రానికి ఇదే సరైన సమయం అన్నారు బాలీవుడ్ నటి కంగనా రనౌత్. ఆమె రాజకీయాల్లోకి వస్తున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో ఆమె మాట్లాడుతూ 'సినిమాల్లో ఉంటూనే రాజకీయ పార్టీలతో తలపడ్డాను. నటిగా కన్నా దేశహితం కోరుకునే జాతీయవాదిగానే నాకు గుర్తింపు ఎక్కువ. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు నాపై చాలా ప్రేమ చూపించారు. దేశం నాకు చాలా ఇచ్చింది. తిరిగి ఇవ్వడం నా బాధ్యత. ఒకవేళ నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనుకుంటే అందుకు ఇదే సరైన సమయం' అన్నారు. ఆమె త్వరలోనే బీజేపీలో చేరబోతున్నారని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమె నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో కంగనా రనౌత్ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషించారు. ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారు. అలాగే 'తను వెడ్స్ మను', 'క్వీన్ 2' చిత్రాల్లో కంగన నటిస్తున్నారు.



ప్రతి భారతీయుడూ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాడు

వరుణ్‌తేజ్ నటించిన ఎయిర్‌ఫోర్స్ యాక్షన్ మూవీ 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన విడుదల కానుంది. శక్తి ప్రతాప్‌సింగ్ హడా దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించింది. విడుదల సందర్భంగా మంగళవారం వరుణ్‌తేజ్ మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు.



- దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ 2020లో ఈ కథతో నన్ను సంప్రదించారు. కథ నాకు బాగా నచ్చింది. సోనీ పిక్చర్స్ సంస్థకే నేను ఓ సినిమా చేయాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల అది టేకాఫ్ కాలేదు. నేషనల్ అప్పీల్ ఉన్న కంటెంట్ కావడంతో ఇది వారికి కూడా నచ్చింది. చాలా గ్రాండ్ బడ్జెట్‌తో పక్కాగా ప్లాన్ చేసి సినిమా తీశారు. దర్శకుడు ఉత్తరాదివాడే అయినా తెలుగులో చేయాలనే కోరిక ఉంది. అందుకే తెలుగు, హిందీ వెర్షన్స్‌లో తీశాం. ఒక భాషలో తీసిన వెంటనే మరో భాషలో చిత్రీకరించారు.
- దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ ఈ ప్రాజెక్ట్ కోసం చాలా రీసెర్చ్ చేశారు. సినిమా అంటే అతనికి ప్యాషన్. అయినా ఏదో ఒక సినిమా చేయాలని అనుకోకుండా నా ద్వారా ఈ చిత్రకథను చెప్పాలని అనుకున్నాడు. ఇంతకుముందు అతను చేసిన షార్ట్ ఫిల్మ్ బాగా వైరల్ అయింది. ఎయిర్‌ఫోర్స్ అధికారులు కూడా అది చూసి ఆశ్చర్యపోయారు. దాన్నే సినిమా చేయాలనుకుంటే కావాల్సిన సహకారాన్ని అందిస్తామని వారు చెప్పారు. దర్శకుడికి వీఎఫ్ఎక్స్ పై మంచి పట్టు ఉండడంతో విజువల్‌గా కూడా చాలా బాగా వచ్చిందీ చిత్రం
- పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్ర దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీర మరణం పొందారు. దానికి కారణమైన ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేందుకు భారత వైమానిక దళం ఆపరేషన్ నిర్వహించింది. వాలెంటైన్ డే నాడు జరిగింది కనుక అలా టైటిల్ పెట్టాం. ప్రతి భారతీయుడు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే సినిమా ఇది.
- 'అంతరిక్షం' చిత్ర నిర్మాణ సమయంలో తొలిసారిగా విజువల్ ఎఫెక్ట్స్‌తో వర్క్ చేయడం మొదట్లో ఇబ్బందిగా అనిపించినా తర్వాత అలవాటైంది. 'ఆపరేషన్ వాలెంటైన్' షూటింగ్ కోసం ఫైటర్ జెట్ ఎలా పని చేస్తుంది, ఎంత స్పీడ్‌లో వెళుతుంది అనే వివరాలు ఓ పైలెట్ ద్వారా తెలుసుకున్నా. ఒక ఫైట్ సిమ్యులేటర్‌లో కూర్చోబెట్టి రియల్ లైఫ్ ప్రొజెక్షన్ అనుభూతి ఇచ్చేలా చేశారు. అందులో కూర్చుంటే నిజంగా ఫ్లైట్ నడిపినట్లే అనిపిస్తుంది. ఇలాంటి పాత్రలు చేయడం ఓ ఛాలెంజ్. ఇందులో నేను రుద్ర పాత్రలో కనిపిస్తాను. కొందరు రియల్ ఎయిర్ ఫైటర్స్ స్ఫూర్తితో నా పాత్రని అద్భుతంగా డిజైన్ చేశారు దర్శకుడు.
- తొలిసారిగా హిందీలో నటిస్తున్నాను కనుక హిందీ నేర్చుకోవడం కోసం రెండు నెలలు క్లాసులు తీసుకున్నాను. నా భార్య లావణ్య కూడా ఈ విషయంలో హెల్ప్ చేసింది. ఒక సీన్ మొదట హిందీలో షూట్ చేసి, తర్వాత తెలుగులో తీసేవాళ్లు. అప్పుడు మధ్య మధ్యలో హిందీ డైలాగులు కూడా వచ్చేసేవి.
- ఈ సినిమా టీజర్ రిలీజ్ అయ్యాక బాబాయ్‌ను కలిశాను. ఆయన సినిమాల గురించి పెద్దగా మాట్లాడరు. కానీ 'ఆపరేషన్ వాలెంటైన్' టీజర్‌ని ఐదారు సార్లు చూసి 'చాలా బాగుంది. ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా చక్కగా ఉన్నావు. ఈ సినిమా చూడాలని ఉంది' అని ఆయన అనడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇటువంటి సినిమాలు అంటే బాబాయ్‌కి చాలా ఇష్టం.



న్యూ ఏజ్ ఫిల్మ్ లవ్ మీ

ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన చిత్రానికి 'లవ్ మీ' అనే టైటిల్ నిర్ణయించారు. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. దిల్ రాజు ప్రొడక్షన్స్ బేనర్‌పై అరుణ్ భీమవరపు దర్శకత్వంలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. టైటిల్ ప్రకటించిన అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ ' ఇదొక న్యూ ఏజ్ ఫిల్మ్. 'ఆర్య' కథ విని ఎలా ఎగ్జయిట్ అయ్యానో ఈ చిత్ర కథ విని అదే అనుభూతి పొందాను. ఈ సినిమా ప్రారంభం కావడానికి కారణం నాగ మల్లిడి. అతను నాకు ఎప్పటి నుంచో పరిచయం. ఓ స్క్రిప్ట్ వినండి.. ఫ్రెండ్‌తో కలసి తయారు చేశానని నాగ చెబితే కథ విన్నాను. నాకు నచ్చడంతో చాలా మందికి చెప్పాను. అందరూ ఎగ్జైట్ అయ్యారు. ఇలా స్క్రిప్ట్ దశలో ఎగ్జైట్ అవడం అరుదుగా జరుగుతుంటుంది. హీరోగా ఆశిష్ కావాలని అడిగారు. అలాగే హర్షిత్, హన్షితలను ఇవ్వమని నాగ అడిగాడు. స్క్రిప్ట్ పూర్తయాక టెక్నీషియన్ల పేరు చెబితే భయం వేసింది. అయినా ఛాయాగ్రాహకుడు పీసీ శ్రీరామ్‌నీ, కీరవాణిగారిని కలసి కథ చెప్పి ఒప్పించారు. ఫిబ్రవరి 27న టైటిల్ అనౌన్స్ చేశాం. ఏప్రిల్ 27న సినిమా విడుదల చేయబోతున్నాం.' ఆర్య' విషయంలో నాకు జరిగిందే ఈ టీమ్‌కు జరగబోతోందనే వైబ్స్ వస్తున్నాయి' అన్నారు. చిత్ర కథానాయిక వైష్ణవి చైతన్య మాట్లాడుతూ 'ఈ మూవీ నాకు ప్రత్యేకం. ఇలాంటి స్టోరీ లైన్ ఎక్కడా చూడలేదు. త్వరలో టీజర్ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమా చూశాక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్‌తో ప్రేక్షకులు బయటకు వస్తారు' అని చెప్పారు.

వెన్నెల కిశోర్‌కు టైలర్ మేడ్ క్యారెక్టర్



వెన్నెల కిశోర్ హీరోగా నటించిన 'చారి 111' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. కీర్తి కుమార్ దర్శకత్వంలో అదితి సోని ఈ సినిమా నిర్మించారు. సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్. మంగళవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఒకే ఒక్క పాట ఉంది. అది రాసే బాధ్యతను నాకు అప్పగించారు. నన్ను నమ్మి దర్శక నిర్మాతలు రావడంతో పాట బాగా రావాలని మూడు నెలల సమయం తీసుకున్నా. మంచి సాహిత్యం కుదిరింది. వెన్నెల కిశోర్ ఈ సినిమాలో బాగా నవ్విస్తారు' అని చెప్పారు. 'బెంగళూరులో పదేళ్లు యాడ్ ఫీల్డ్‌లో ఉండి సినిమాల్లోకి వచ్చా. ఇంతకు ముందు 'మళ్లీ మొదలైంది' అనే సినిమా చేశా. అందులో వెన్నెల కిశోర్‌గారు కామెడీ రోల్ చేశారు. అప్పుడే ఈ చిత్ర కథ ఆయనకు చెప్పా. కిశోర్‌గారికి ఇది టైలర్ మేడ్ క్యారెక్టర్. ఇదొక స్పై యాక్షన్ కామెడీ జానర్ ఫిల్మ్. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు ఏ మాత్రం తగ్గకుండా ఉంటుంది. మొదట ఈ సినిమాను మే నెలలో విడుదల చేయాలనుకున్నాం. కానీ మంచి డేట్ దొరకడంతో మార్చి ఒకటిన విడుదల చేస్తున్నాం.' అని చెప్పారు దర్శకుడు కీర్తి కుమార్. నిర్మాత అదితి సోని మాట్లాడుతూ 'నిర్మాతగా నాకు ఇది తొలి సినిమా. కొత్తగా ట్రై చేశాం. మంచి టీమ్ దొరికింది. వెన్నెల కిశోర్‌గారికి నేను అభిమానిని. ఆయనతో సినిమా చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. తెలుగులో తనకు ఇది తొలి చిత్రమని హీరోయిన్ సంయుక్త చెప్పారు. సినిమాలో తను ఫైట్స్ కూడా చేసినట్లు ఆమె తెలిపారు.

భవానీ వార్డ్‌లో ఏం జరిగింది?



గాయత్రీ గుప్తా, గణేశ్ రెడ్డి, పూజా కేంద్రే ముఖ్య పాత్రలు పోషించిన హారర్ థ్రిల్లర్ 'భవానీ వార్డ్' ఫస్ట్ లుక్‌ను సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటయిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు జీడీ నరసింహ మాట్లాడుతూ 'నేను చెప్పిన కథ నచ్చి ఇందులో నటించడమే కాకుండా పూర్తి సహకారం అందించిన గాయత్రిగారికి ధన్యవాదాలు. నిర్మాత ప్రోత్సాహంతో, నటీనటుల సహకారంతో అందరికీ నచ్చేలా ఈ సినిమా తీశాను. భవానీ వార్డ్‌లో జరిగే సంఘటనలు ఉత్కంఠభరితంగా ఉంటాయి. హారర్ చిత్రాలను ఇష్టపడే వారికే కాకుండా అందరినీ అలరిస్తుంది' అన్నారు. చిన్న సినిమాలకు ప్రోత్సాహం అందించాలనే ఈ సినిమా తీసినట్టు నిర్మాతల్లో ఒకరైన కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. టెక్నికల్‌గా సినిమా చాలా బాగుంటుందని గాయత్రి గుప్తా చెప్పారు. హీరోగా తనకు అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు గణేశ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సినిమాలో ఒక మంచి పాత్ర చేసినందుకు ఆనందంగా ఉందని జర్నలిస్టు సాయి సతీశ్ చెప్పారు.

ఏడాదికి 5 కోట్ల

డెంగ్యూ వ్యాక్సిన్ల తయారీ



'బయోలాజికల్-ఈ'తో తకెడా భాగస్వామ్యం

హైదరాబాద్: జపాన్‌కు చెందిన బయోఫార్మాస్యూటికల్స్ కంపెనీ తకెడా డెంగ్యూ వ్యాక్సిన్ల (క్యూడెంగా) తయారీని వేగవంతం చేయడానికి హైదరాబాద్‌కు చెందిన 'బయోలాజికల్-ఈ' (బీఈ)తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. బయోఆసియా వేదికగా కుదిరిన ఈ ఒప్పందం కింద బయోలాజికల్-ఈ ఏడాదికి 5 కోట్ల డెంగ్యూ వ్యాక్సిన్ డోసేజీలు తయారుచేస్తుంది. ఒక దశాబ్ది కాలంలో ఏడాదికి 10 కోట్ల వ్యాక్సిన్ డోసేజీలు తయారుచేయాలన్న తకెడా లక్ష్యాన్ని ఈ భాగస్వామ్యం వేగవంతం చేస్తుంది. దీనివల్ల డెంగ్యూ వ్యాధి ప్రబలంగా ఉన్న దేశాలకు జాతీయ ఇమ్యునైజేషన్ కార్యక్రమం కింద క్యూడెంగా వ్యాక్సిన్లు తగినన్ని అందుబాటులోకి వస్తాయని తకెడా గ్లోబల్ వ్యాక్సిన్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ గ్యారీ డబిన్ అన్నారు. వ్యాక్సిన్ల తయారీలో బీఈకి లోతైన నైపుణ్యం ఉన్నదంటూ తమ భాగస్వామ్యం ప్రపంచం నుంచి డెంగ్యూను నిర్మూలించగలదన్న విశ్వాసం ఆయన ప్రకటించారు. క్యూడెంగా వ్యాక్సిన్ల తయారీలో తకెడాతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం గర్వంగా ఉన్నదని బీఈ మేనేజింగ్ డైరెక్టర్ మహిమ దాట్ల అన్నారు. ప్రస్తుతం క్యూడెంగా వ్యాక్సిన్లు యూరప్, ఇండోనేషియా, థాయ్‌లాండ్‌లలో పిల్లలకు, పెద్దలకు కూడా ప్రైవేటుగా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ వినియోగానికి భారత్‌లో అనుమతి లేదు.

హైదరాబాద్‌లో మిల్టెనీ బయోటెక్ సీఓఈ

జర్మనీకి చెందిన బయో మెడికల్ ఉత్పత్తులు, సేవల కంపెనీ మిల్టెనీ బయోటెక్ హైదరాబాద్‌లో తొలి కార్యాలయాన్ని, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను (సీఓఈ) ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. భారత్‌లో ఈ తరహా సీఓఈల్లో ఇదే మొదటిదని కంపెనీ తెలిపింది. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, క్లినికల్ నిపుణులు ఈ కేంద్రంలో సెల్, జీన్ థెరపీల్లో ప్రత్యక్ష శిక్షణ పొందగలుగుతారని కంపెనీ ఎండీ బోరిస్ స్టోఫెల్ బయోఆసియా సదస్సు సందర్భంగా ప్రకటించారు. దీనివల్ల ప్రీ క్లినికల్/క్లినికల్ అభివృద్ధి, వాణిజ్యపరంగా వాటిని అందుబాటులోకి తేవడంపై వారికి అవగాహన ఏర్పడుతుందన్నారు. రోగులకు ఇప్పటివరకు అందుబాటులో లేని వైద్య అవసరాలు తీర్చడానికి వీలుగా కొత్త థెరపీల అభివృద్ధిపై ప్రభుత్వ సహకారాన్ని ఆయన కోరారు.

పరిశోధనలకు నిధులే పెద్ద అవరోధం

ఔషధ అభివృద్ధి రంగంలో పరిశోధనలకు నిధులే పెద్ద అవరోధమని బయో ఆసియా సందర్భంగా "ఆర్ అండ్ డీ 2.0: ఇప్పుడు కాకపోతే ఇక ఎన్నటికీ సాధ్యం కాదు" అనే అంశంపై జరిగిన గోష్ఠిలో పాల్గొన్న వక్తలన్నారు. ఔషధ పరిశోధనలు అత్యంత ఆసక్తికరమైన, రిస్క్‌తో కూడిన విభాగమని డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ కో చైర్మన్ జీవీ ప్రసాద్ అన్నారు. 1990 దశకంలో ఆర్ అండ్ డీలోకి అడుగుపెట్టిన తాము 2010 నాటికే 15 కోట్ల డాలర్ల వరకు ఆ విభాగంపై ఖర్చు చేశామని తెలిపారు. తాము ఎన్నడూ లాభాల నుంచి ఆర్ అండ్ డీకి వనరులు ఖర్చు చేయలేదని, అనుబంధ ఆర్ అండ్ డీ విభాగం సహకార భాగస్వామ్యాల ద్వారా అందుకు నిధులు సమకూర్చుకున్నదని చెప్పారు. ఔషధ పరిశోధనల రంగంలో ప్రభుత్వ సంస్థలు కూడా బలంగా లేవంటూ నిధులు, మౌలిక వసతుల కొరత తీర్చడానికి సహకార భాగస్వామ్యాలే పెద్ద ఆలంబన అని స్పష్టం చేశారు.

భారత మార్కెట్లోకి ఫోర్డ్ రీఎంట్రీ

» ఈసారి హైబ్రిడ్, ఈవీలపై ఫోకస్

న్యూఢిల్లీ: రెండేళ్ల క్రితం భారత మార్కెట్ నుంచి వైదొలిగిన అంతర్జాతీయ వాహన దిగ్గజం ఫోర్డ్ పునఃప్రవేశ ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. అయితే, ఈసారి హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) పైనే దృష్టిసారించనున్నట్లు సమాచారం. చెన్నైలోని తన ప్లాంట్‌లో వీటిని ఉత్పత్తి చేయాలనుకుంటోంది. తాజాగా కంపెనీ అంతర్జాతీయంగా ఏ మార్కెట్లోనూ ప్రవేశపెట్టని కాంపాక్ట్ ఎస్‌యూవీ కార్ డిజైన్‌కు పేటెంట్ పొందింది. హ్యుండయ్ క్రెటాకు పోటీగా ఫోర్డ్ ఈ మోడల్‌ను దేశీ మార్కెట్లో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. చెన్నై ప్లాంట్ ఏటా 2 లక్షల వాహనాలు, 3.40 లక్షల ఇంజన్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది.

రూ.9,000 లోపే జియో 5జీ ఫోన్!

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం కంపెనీ రిలయన్స్ జియో చౌకగా 5జీ ఫోన్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. అమెరికన్ చిప్ తయారీ దిగ్గజం క్వాల్‌కామ్‌తో కలిసి అభివృద్ధి చేస్తున్న ఈ ఎంట్రీ లెవెల్ 5జీ జియో ఫోన్‌ను ఏడాది చివరినాటికి మార్కెట్లోకి విడుదల చేసే అవకాశాలున్నాయి. దీని ధర రూ.9,000 లోపే ఉండవచ్చని సమాచారం.

వొడాఫోన్ ఐడియా రూ. 45,000 కోట్ల సమీకరణ

ఈక్విటీ జారీ ద్వారా రూ.20,000 కోట్లు

» రుణ పత్రాల ద్వారా రూ.25 వేల కోట్లు

» కంపెనీపై రూ.2.1 లక్షల కోట్ల రుణ భారం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా (వి) భారీ నిధుల సమీకరణ ప్రణాళికను ప్రకటించింది. ఈక్విటీ, ఈక్విటీ అనుసంధానిత సాధనాల ద్వారా రూ.20,000 కోట్ల సమీకరణకు కంపెనీ బోర్డు మంగళవారం ఆమోదం తెలిపింది. ఈక్విటీ జారీ ప్రక్రియలో ప్రమోటర్లు సైతం పాల్గొననున్నట్లు వొడాఫోన్ ఐడియా తెలిపింది. ఈక్విటీ, డెట్ (రుణ పత్రాలు) జారీ ద్వారా మొత్తం రూ.45,000 కోట్లు సమీకరించాలనుకుంటున్నట్లు కంపెనీ ఈ సందర్భంగా వెల్లడించింది. రూ.2.1 లక్షల కోట్ల రుణ భారం, వందల కోట్ల నష్టాలతో పాటు నెలనెలా చేజారుతున్న వినియోగదారులతో ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిన కంపెనీ ప్రస్తుతం మనుగడ కోసం పోరాడుతోంది. సంస్థ పునరుద్ధరణతో పాటు రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ నుంచి పోటీ తట్టుకుని మార్కెట్లో నిలబడేందుకు వొడాఫోన్ ఐడియాకు ఈ నిధుల సమీకరణ కీలకంగా మారింది. ఇందుకోసం బ్యాంకర్లు, కౌన్సిళ్ల నియామకానికి కంపెనీ బోర్డు తాజా సమావేశంలో యాజమాన్యానికి అధికారం కల్పించింది. ఈ ప్రక్రియకు అనుమతి కోరేందుకు కంపెనీ ఏప్రిల్ 2న వాటాదారుల సమావేశం నిర్వహించనుంది. వారి ఆమోదం లభించాక వచ్చే త్రైమాసికంలో ఈక్విటీ జారీ ద్వారా నిధులను సమీకరించనుంది. ఈ సొమ్ములో మెజారిటీ భాగాన్ని 4జీ సేవల విస్తరణతో పాటు 5జీ నెట్‌వర్క్ ఏర్పాటుకు వినియోగించుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం కంపెనీ నుంచి రావాల్సిన బకాయిలను గత ఏడాదిలో ఈక్విటీ రూపంలోకి మార్చుకుంది. తద్వారా కంపెనీలో కేంద్రానికి 33.1 శాతం వాటా లభించింది. కాగా, బ్రిటిష్ టెలికాం దిగ్గజం వొడాఫోన్ పీఎల్‌సీ 32 శాతం, కుమార మంగళం బిర్లాకు చెందిన ఆదిత్య బిర్లా గ్రూప్ 18 శాతం వాటా కలిగి ఉన్నాయి.

వాటా విక్రయ యత్నాల్లో ఆహా!

హైదరాబాద్: తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహాలో వ్యూహాత్మక వాటా విక్రయించేందుకు ప్రమోటర్లు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం కేపీఎంజీ కార్పొరేట్ ఫైనాన్స్‌ను సలహాదారుగా నియమించుకున్నట్లు విశ్వసనీయ వర్గాల వ్యాఖ్యలను ఉటంకిస్తూ మనీకంట్రోల్ కథనం పేర్కొంది. మై హోమ్ గ్రూప్‌నకు చెందిన రాము రావు, తెలుగు సినీ నిర్మాత అల్లు అరవింద్ ఈ ఓటీటీకి ప్రమోటర్లుగా ఉన్నారు. సబ్‌స్క్రైబర్లను పెంచుకోవడంతో పాటు కంటెంట్‌ను మరిన్ని దక్షిణాది భాషలకు విస్తరించే వ్యూహంలో భాగంగానే ప్రస్తుత ప్రమోటర్లు మరో భాగస్వామిని చేర్చుకోవాలని భావిస్తున్నట్లు కథనం వెల్లడించింది. ఈ ప్రక్రియలో భాగంగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌కు రూ.2,000 కోట్ల స్థాయి మార్కెట్ విలువను ఆశిస్తున్నట్లు సమాచారం. జీ గ్రూప్‌తో విలీన ఒప్పందాన్ని రద్దు చేసుకున్న సోనీ గ్రూప్ ఆహాలో వాటాపై ఆసక్తిగా ఉందన్న ఊహాగానాలు వెలువడినప్పటికీ, సోనీ ఆ వార్తలను ఖండించింది. 2020లో ప్రారంభమైన ఆహా.. దక్షిణాది భాషలకు చెందిన ప్రముఖ ఓటీటీల్లో ఒకటిగా ఎదిగింది. ప్రస్తుతం ఈ ప్లాట్‌ఫామ్‌కు 70 లక్షలకు పైగా మంత్లీ యాక్టివ్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ప్రస్తుతం తెలుగు, తమిళ కంటెంట్‌ను అందిస్తున్న ఈ ఓటీటీ.. కన్నడ, మలయాళంలోకీ విస్తరించడంతోపాటు ఒక్కో వినియోగదారు నుంచి లభించే సగటు ఆదాయాన్ని సైతం పెంచుకునే ప్రయత్నాల్లో ఉంది. ఆహా ఓటీటీ యాజమాన్య సంస్థ అర్హ మీడియా అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో రూ.122.08 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది.

జీఆర్‌టీ జువెలర్స్ 'చెవి రింగుల సంబరాలు'

హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'చెవి రింగుల సంబరాలు' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. వినియోగదారులకు వినూత్నమైన షాపింగ్ అనుభూతిని కలిగించే ఉద్దేశంతో దీన్ని ప్రారంభించినట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటకల్లో కూడా ఇది అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా చేతితో రూపొందించబడిన అద్భుతమైన, ఆకర్షణీయమైన చెవి రింగుల కలెక్షన్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జీఆర్‌టీ జువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్స్ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు. క్లాసిక్ డిజైన్స్ నుంచి ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉండే విధంగా వీటిని రూపొందించినట్లు పేర్కొంది. కాగా బంగారు ఆభరణాలపై ప్రత్యేక ఆఫర్లను తీసుకువచ్చినట్లు తెలిపింది. పాత బంగారు ఆభరణాల ఎక్స్ఛేంజీపై ప్రతి గ్రాముకు అదనంగా రూ.50 అందించటంతో పాటు కొత్త బంగారు ఆభరణాల కొనుగోలుపై ప్రతి గ్రాముకు రూ.50 తగ్గింపును ఇవ్వనున్నట్లు జీఆర్‌టీ జువెలర్స్ తెలిపింది.

హిందుజాల చేతికి రిలయన్స్ క్యాపిటల్

ముంబై: రిలయన్స్ క్యాపిటల్ (ఆర్ క్యాప్) దివాలా ప్రక్రియ కొలిక్కి వస్తోంది. అనిల్ అంబానీ గ్రూప్ అడాగ్ ప్రమోట్ చేసిన ఈ కంపెనీ ఆస్తులు, వ్యాపారం కొనుగోలు కోసం హిందుజా గ్రూప్ కంపెనీ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్) గత ఏడాది జూన్‌లో సమర్పించిన రూ.9,650 కోట్ల బిడ్‌ను ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ ఆమోదించింది. కంపెనీ రుణదాతలు కూడా ఇందుకు ఆమోదం తెలిపారు. దీంతో వారికి రావలసిన రూ.38,526.42 కోట్ల బకాయిల్లో రూ.9,661 కోట్లు (37 శాతం) మాత్రమే వసూలు కానున్నాయి. డీహెచ్ఎఫ్ఎల్ తర్వాత ఎన్‌సీఎల్‌టీ దివాలా ప్రక్రియకు వచ్చిన రెండో ఎన్‌బీఎఫ్‌సీ ఆర్ క్యాప్ మాత్రమే.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,850 ▲	57,610 ▲	75,500 ▼
ముంబై	62,271 ▲	57,040 ▲	69,902 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ	
హైదరాబాద్	490
28వ తేదీ	
చిత్తూరు	553
గోదావరి	475
విజయవాడ	475
విశాఖపట్నం	500
వరంగల్	492
డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140
వరంగల్	140
కరీంనగర్	140
మహబూబ్‌నగర్	140
కర్నూలు	140
విశాఖపట్నం	127
గోదావరి	144
విజయవాడ	144
గుంటూరు	144
ఒంగోలు	144
చిత్తూరు	144

ఈ ఏడాది వేతనాల్లో 10% వృద్ధి: మెర్సర్

న్యూఢిల్లీ: ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా ఈ సంవత్సరం కూడా మన దేశంలో ఉద్యోగుల జీతాలు పెరగనున్నాయి. అన్ని రంగాల్లో ఈ పెరుగుదల సగటున 10 శాతం వరకు ఉంటుందని మెర్సర్ అనే కన్సల్టెన్సీ సంస్థ అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది అర శాతం ఎక్కువ. 'టోటల్ రెమ్యునరేషన్ సర్వే' పేరుతో మెర్సర్ సంస్థ విడుదల చేసిన ఒక నివేదిక ఈ విషయం తెలిపింది. ఆటోమొబైల్, తయారీ, ఇంజినీరింగ్, లైఫ్ సైన్సెస్ రంగాల కంపెనీల్లో పని చేసే ఉద్యోగుల జీతాల పెరుగుదల మరింత ఎక్కువగా ఉంటుందని ఆ సర్వే పేర్కొంది. 'ఇది భారత ఆర్థిక వ్యవస్థ పని తీరు, సృజనాత్మకత, నైపుణ్యాలను సూచిస్తోంది' అని సర్వే తెలిపింది.

టాటా షేర్లలో ర్యాలీ

305 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: టాటా గ్రూప్‌లోని ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు ప్రామాణిక ఈక్విటీ సూచీలను ముందుకు నడిపించాయి. అంతర్జాతీయ మార్కెట్లో సానుకూల ట్రేడింగ్ ట్రెండ్ సైతం ర్యాలీకి దోహదపడింది. మంగళవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 305.09 పాయింట్ల లాభంతో 73,095.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 76.30 పాయింట్ల వృద్ధితో 22,198.35 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడ్డాయి. టాటా మోటార్స్ 2.78 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలవగా.. టీసీఎస్ 2.56 శాతం, టాటా స్టీల్ 1.09 శాతం, టైటాన్ 0.87 శాతం వృద్ధి చెందాయి. ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.25 శాతం వరకు నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీలు ఒక శాతానికి పైగా పెరగగా.. ఐటీ, టెక్నాలజీ, క్యాపిటల్ గూడ్స్ ఇండెక్స్‌లు అర శాతానికి పైగా పెరిగాయి. ఫారెక్స్ మార్కెట్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక పైసా తగ్గి 82.89 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒక దశలో స్వల్ప పెరుగుదలతో 82.66 డాలర్ల వద్ద ట్రేడైంది.

అప్పర్ సర్క్యూట్ నుంచి స్వల్ప నష్టాల్లోకి పేటీఎం షేరు: పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు వరుసగా రెండో రోజూ అప్పర్ సర్క్యూట్‌ను తాకినప్పటికీ చివరికి స్వల్ప నష్టాల్లో ముగిసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక దశలో 4.98 శాతం వృద్ధితో రూ.449.30 వద్దకు చేరినప్పటికీ.. ట్రేడింగ్ నిలిచేసరికి 0.11 శాతం నష్టంతో రూ.427.50 వద్ద స్థిరపడింది.

ఐపీఓ అప్‌డేట్స్: మంగళవారం ప్రారంభమైన రెండు పబ్లిక్ ఇష్యూలకు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఈవీ చార్జర్ల తయారీదారు ఎక్సికామ్ టెలీ-సిస్టమ్స్ లిమిటెడ్ ఐపీఓ తొలి రోజు ముగిసేసరికి, ఇష్యూ సైజుకు 10 రెట్ల బిడ్లు దాఖలు కాగా.. స్టెబిలైజర్ల తయారీ కంపెనీ ప్లాటినమ్ ఇండస్ట్రీస్ ఐపీఓకు 8 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

1ఇంటిగ్రేటెడ్ మార్కెటింగ్ సర్వీసెస్ కంపెనీ ఆర్‌కే స్వామి లిమిటెడ్ ఐపీఓ వచ్చే నెల 4న ప్రారంభమై 6న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ.173 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన 87 లక్షల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయించనుంది.

రెండేళ్ల గరిష్ఠానికి బిట్‌కాయిన్: ప్రముఖ క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ ఒకే రోజులో 9 శాతం మేర పెరిగి 57,000 డాలర్లు దాటింది. ఈ కరెన్సీకి రెండేళ్లకు పైగా గరిష్ఠ స్థాయిది.

స్పోర్ట్స్

33 బంతుల్లోనే సెంచరీ

» నమీబియా బ్యాటర్ విధ్వంసం

» టీ20ల్లో ఇదే ఫాస్టెస్ట్



లాఫ్టీ ఈటన్

కీర్తిపూర్ (నేపాల్): నమీబియా బ్యాటర్ జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్ అంతర్జాతీయ టీ20ల్లో చరిత్ర సృష్టించాడు. కేవలం 33 బంతుల్లోనే సెంచరీ బాదేసి అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 8 సిక్సర్లున్నాయి. నేపాల్ ప్లేయర్ కుశాల్ మల్ల (34 బంతుల్లో మంగోలియాపై) పేరిట ఉన్న రికార్డును తను అధిగమించాడు. నేపాల్-నమీబియా-నెదర్లాండ్స్ దేశాల ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా మంగళవారం నమీబియా-నేపాల్ మధ్య మ్యాచ్ జరిగింది. నికోల్ మొత్తంగా 36 బంతుల్లో 101 రన్స్ చేసి ఆఖరి ఓవర్లో వెనుదిరిగాడు. అతడి దాటికి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. ఆ తర్వాత ఛేదనలో నేపాల్ 18.5 ఓవర్లలో 186 పరుగులు చేసి ఓటమి పాలైంది.



ఫైనల్ చేరేదెవరో?

» ప్రొ కబడ్డీ సెమీఫైనల్స్ నేడే

» రాత్రి 8 గం. నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ ముగింపు దశకు చేరుకొంది. బుధవారం జరిగే తొలి సెమీస్‌లో టేబుల్ టాపర్ పుణెరి పల్టన్‌తో పట్నా పైరేట్స్, రెండో సెమీస్‌లో హరియాణా స్టీలర్స్‌తో డిఫెండింగ్ చాంప్ జైపూర్ పింక్ పాంథర్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో గుజరాత్ జెయింట్స్‌పై హరియాణా, దబాంగ్ ఢిల్లీపై పట్నా గెలిచి ఫైనల్ ఫోర్‌కు అర్హత సాధించాయి. కాగా, పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిచిన పుణె, జైపూర్‌లు నేరుగా సెమీస్‌కు చేరుకొన్నాయి.

షమి కాలికి సర్జరీ

ఐపీఎల్‌కు దూరం



న్యూఢిల్లీ: టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమి కాలికి లండన్‌లోని ఓ ఆసుపత్రిలో సర్జరీ జరిగింది. కాలి మడమ కండర బంధనానికి నిర్వహించిన ఈ సర్జరీ నుంచి కోలుకోవడానికి కనీసం మూడు నెలల సమయం పట్టనుంది. దీంతో రాబోయే ఐపీఎల్‌కు అతడు పూర్తిగా దూరం కానున్నాడు. ఆ తర్వాత జూన్‌లో అమెరికాలో జరిగే టీ20 వరల్డ్‌కప్‌నకు కూడా అనుమానమే. గతేడాది వన్డే వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో ఫైనల్ తర్వాత.. గాయం కారణంగా షమి మళ్లీ బరిలోకి దిగలేదు. కాగా షమి త్వరగా కోలుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

ఆర్‌సీబీ ఆల్‌రౌండ్ షో

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ముంబై x యూపీ
రాత్రి 7.30 గం. నుంచి



స్మృతి మంధాన (27 బంతుల్లో 43)

వరుసగా రెండో విజయం
రాణించిన మంధాన, మేఘన
గుజరాత్‌తో మ్యాచ్

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జోరు చూపుతోంది. మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుని 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆర్‌సీబీకిది వరుసగా రెండో విజయం కాగా, టైటాన్స్‌కు రెండో ఓటమి. స్వల్ప ఛేదనలో కెప్టెన్ స్మృతి మంధాన (27 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 43)తో పాటు తెలుగు బ్యాటర్ సబ్బినేని మేఘన (28 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 36 నాటౌట్) ఆకట్టుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను ఆర్‌సీబీ బౌలర్లు కట్టడి చేశారు. దీంతో 20 ఓవర్లలో 7 వికెట్లకు 107 పరుగులు మాత్రమే చేసింది. మిడిలార్డర్‌లో హేమలత (31 నాటౌట్) మాత్రమే పోరాడినా ఫలితం లేకపోయింది. ఆరుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. పేసర్ రేణుకా సింగ్ (2/14) పొదుపైన బౌలింగ్‌లో టాపార్డర్ పని బట్టింది. స్పిన్నర్ మోలినెక్స్‌కు మూడు వికెట్లు దక్కాయి.

తొలి ఓవర్ నుంచే..

ఛేదన కోసం బరిలోకి దిగిన ఆర్‌సీబీ 12.3 ఓవర్లలో 2 వికెట్లకు 110 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ మంధాన తొలి ఓవర్‌లోనే మూడు ఫోర్లతో బాదుడు ఆరంభించింది. నాలుగో ఓవర్‌లో డివైన్ (6) అవుటైనా.. మేఘన జత కలవడంతో స్కోరు మరింత వేగంగా దూసుకెళ్లింది. ఇద్దరూ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఐదు, ఎనిమిదో ఓవర్లలో మేఘన రెండేసి ఫోర్లతో జోరు చూపింది. రెండో వికెట్‌కు మంధానతో కలిసి 40 పరుగులు అందించిన మేఘన, 11వ ఓవర్‌లో 6,4తో మరింత దూకుడు కనబరిచింది. అటు ఎలిస్ పెర్రీ (14 బంతుల్లో 4 ఫోర్లతో 23 నాటౌట్) తనకు సహకారం అందించడంతో మరో 45 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. మూడో వికెట్‌కు ఈ జోడీ అజేయంగా 38 రన్స్ జోడించింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 7 వికెట్లకు 107 (హేమలత 31 నాటౌట్, హర్లీన్ 22; మోలినెక్స్ 3/25, రేణుకా సింగ్ 2/14); **బెంగళూరు:** 12.3 ఓవర్లలో 2 వికెట్లకు 110 (స్మృతి మంధాన 43, మేఘన 36 నాటౌట్, పెర్రీ 23 నాటౌట్; గార్డ్‌నర్ 1/15, తనూజ 1/20).

హాకీ ఇండియా సీఈవో రాజీనామా



ఎలెనా నార్మన్

న్యూఢిల్లీ: హాకీ ఇండియాలో మరో రాజీనామా చోటు చేసుకుంది. ఈసారి ఏకంగా హెచ్ఐ సీఈవో ఎలెనా నార్మన్ తన పదవి నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించింది. ఆస్ట్రేలియాకు చెందిన ఎలెనా దాదాపు 13 ఏళ్లుగా ఈ పదవిలో కొనసాగడం గమనార్హం. హాకీ ఇండియాలో గ్రూపులు ఎక్కువయ్యాయని, అలాంటి చోట బాధ్యతలను నెరవేర్చడం అత్యంత కష్టమని నార్మన్ స్పష్టం చేసింది. ఆమె హయాంలో హాకీ ఇండియా వరుసగా రెండు పురుషుల వరల్డ్‌కప్ (2018, 2023)లకు ఆతిథ్యమిచ్చింది. మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ జన్నెక్ షాప్‌మన్ సైతం హెచ్ఐలో తగిన గౌరవం లభించదంటూ గత వారం రాజీనామా చేసింది.

టెయిలెండర్ల శతకాలు

తనుష్-తుషార్ రికార్డు 1సెమీస్‌లో ముంబై, విదర్భ

ముంబై: బరోడా-ముంబై జట్ల మధ్య జరిగిన రంజీ క్వార్టర్ ఫైనల్లో సంచలన ప్రదర్శన నమోదైంది. ముంబై జట్టు పదో బ్యాటర్ తనుష్ కోటియన్ (120 నాటౌట్), ఆఖరి బ్యాటర్ తుషార్ దేశ్‌పాండే (123) శతకాలు సాధించి రంజీల్లో చరిత్ర సృష్టించారు. ఓవరాల్‌గా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇలా ఒకే ఇన్నింగ్స్‌లో చివరి ఇద్దరు బ్యాటర్లు సెంచరీలు చేయడం రెండోసారి మాత్రమే. 1946లో భారత ఆటగాళ్లు చందూ సర్వటే-షుట్ బెనర్జీ సర్రే కౌంటీపై ఓవల్‌లో ఈ ఫీట్ సాధించారు. ఇదే జోరులో బరోడాపై ఆఖరి వికెట్‌కు 232 పరుగులు జోడించడం విశేషం. అయితే కేవలం ఒక్క పరుగు తేడాతో ఈ వికెట్‌కు అత్యధిక భాగస్వామ్య రికార్డును అందుకోలేకపోయారు. వీరి ఆటతో ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 599 పరుగులు సాధించింది. ఇక 606 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన బరోడా రెండో ఇన్నింగ్స్‌లో టీ బ్రేక్ సమయానికి 121/3 స్కోరుతో నిలువగా.. ఫలితం తేలే అవకాశం లేక ఆఖరి సెషన్‌ను రద్దు చేశారు. దీంతో మ్యాచ్ డ్రా కాగా 36 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ముంబై సెమీస్‌కు చేరింది.

కర్ణాటకకు షాక్

నాగ్‌పూర్: కర్ణాటకతో జరిగిన మరో క్వార్టర్స్‌లో విదర్భ 128 పరుగుల తేడాతో నెగ్గి సెమీస్‌కు చేరింది. 371 పరుగుల ఛేదనలో ఆఖరి రోజు మంగళవారం కర్ణాటక కుప్పకూలింది. 103/1 ఓవర్‌నైట్ స్కోరుతో పటిష్ఠంగానే కనిపించినా..హర్ష్ దూబే, ఆదిత్య నాలుగేసి వికెట్లతో వణికించగా జట్టు 243 పరుగులే చేయగలిగింది. మయాంక్ (70) టాప్ స్కోరర్. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 460, రెండో ఇన్నింగ్స్‌లో 196 రన్స్ చేయగా, కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేసింది.

ఎవరెవరితో?
విదర్భ x మధ్యప్రదేశ్
ముంబై x తమిళనాడు
సెమీస్ మార్చి 2 నుంచి..



తుషార్ (123) తనుష్ (120 నాటౌట్)

జురెల్ ఆటకు ఫిదా

● అద్భుతమైన ఆటగాడంటున్న మాజీలు

● ధోనీతో పోల్చిన గవాస్కర్



ధ్రువ్ జురెల్

న్యూఢిల్లీ: సరైన వికెట్ కీపర్-బ్యాటర్ కోసం వెతుకుతున్న భారత్‌కు తానే తగిన సమాధానమంటూ ధ్రువ్ జురెల్ తెరపైకి దూసుకొచ్చాడు. 2022లో జరిగిన యాక్సిడెంట్ కారణంగా రిషబ్ పంత్ దూరం కావడంతో.. ఆ స్థానాన్ని భర్తీ చేసే వికెట్ కీపర్ కోసం టీమిండియా ఎదురు చూస్తోంది. ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టుల్లో కేఎస్ భరత్ బ్యాటర్‌గా ఆకట్టుకోలేక పోవడంతో.. మూడో టెస్ట్‌లో జురెల్‌కు చాన్స్ దక్కింది. ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులు చేసిన ధ్రువ్.. రాంచీ టెస్ట్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 90 పరుగులతో ఆపద్బాంధవుడిగా నిలిచాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఒడిదొడుకులు ఎదురైనా.. గిల్‌తో కలసి జట్టును గెలిపించాడు. క్లిష్టపరిస్థితుల్లోనూ కంగారుపడకుండా.. స్ట్రయిక్ రొటేట్ చేసిన తీరుకు మాజీ క్రికెటర్లు ఫిదా అయ్యారు. భారత్‌కు 'రత్నం' దొరికిందని కొనియాడారు. మాజీ కెప్టెన్ గవాస్కర్ అయితే.. ధ్రువ్‌ను మహేంద్ర సింగ్ ధోనీతో పోల్చాడు. సెహ్వాగ్, లక్ష్మణ్‌తోపాటు ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు టామ్ మూడీ కూడా ఈ యువ ఆటగాడి పోరాట పటిమను ప్రశంసించాడు.

ఫోక్స్ సలాం..!: ప్రత్యర్థి ఆటగాళ్లు మెచ్చుకోవడమంటే సామాన్యం కాదు. అలాంటిది ఇంగ్లండ్ కీపర్ ఫోక్స్ కూడా ధ్రువ్ పోరాటపటిమకు అభివందనాలు తెలిపాడు. 'ఫోక్స్‌కు జురెల్‌పై అభిమానం ఏర్పడింద'ని ఇంగ్లిష్ టీమ్ కెప్టెన్ స్టోక్స్ చెప్పాడు. ఒంటరి పోరాటం చేసి 90 పరుగుల వద్ద అవుటైనప్పుడు రూట్ కూడా జురెల్‌ను అభినందించాడు.

జడేజా కంటే ముందు పంపాలి : కుక్

రెండు మ్యాచ్‌లతోనే ఆకట్టుకొన్న జురెల్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో జడేజా కంటే ముందుగా పంపాలని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ సూచించాడు. 'జురెల్ బ్యాటింగ్‌లో సమతుల్యత ఉంది. పాదాల కదలికల్లో వేగం ఉంది. మరోవైపు జడేజా రిస్క్ తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నట్టుగా ఉంది. షాట్ ఆడే విషయంలో జడేజాతో పోల్చితే ధ్రువ్ బెటర్' అని అన్నాడు.

కెరీర్‌కు వాగ్నర్ వీడ్కోలు



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ టెస్ట్ టీమ్ పేసర్ నీల్ వాగ్నర్ (37) కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో గురువారం నుంచి జరిగే రెండు టెస్టుల సిరీస్‌లోని తుది జట్టులో అతడికి చోటులేదనే విషయాన్ని మేనేజ్‌మెంట్ స్పష్టం చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నాడు. 64 టెస్టులాడిన వాగ్నర్ 260 వికెట్లు పడగొట్టాడు. కాగా రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించే సమయంలో వాగ్నర్ కన్నీటి పర్యంతమయ్యాడు.

ముంబై జట్టులో అయ్యర్

ముంబై: తమిళనాడుతో జరిగే రంజీ సెమీస్‌లో ముంబై తరఫున శ్రేయాస్ అయ్యర్ ఆడనున్నాడు. ఫామ్ లేమితోపాటు గాయంతో బాధపడుతున్న అయ్యర్‌ను ఇంగ్లండ్‌తో చివరి మూడు టెస్ట్‌ల నుంచి తప్పించారు. అయితే, సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్లు జాతీయ జట్టుకు దూరమైన పరిస్థితుల్లో ఫిట్‌గా ఉంటే తప్పనిసరిగా రంజీలు ఆడాల్సిందేనని బీసీసీఐ కార్యదర్శి జై షా అల్టిమేటం జారీ చేశాడు. వాషింగ్టన్ సుందర్ తమిళనాడు తరఫున బరిలోకి దిగనున్నాడు. ఇక మంగళవారం ప్రారంభమైన డీవై పాటిల్ టోర్నీలో ఆర్‌బీఐ తరఫున ఇషాన్ కిషన్ బరిలోకి దిగాడు.

మండనున్న ఎండలు

» మార్చి 1 నుంచి 37 డిగ్రీలకు పెరిగే చాన్స్!

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి. ఫిబ్రవరి పూర్తికాకముందే పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో భానుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. మంగళవారం 12 జిల్లాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు చేరుకున్నాయి. దీంతో ఆ జిల్లాల్లో హైదరాబాద్ వాతావరణ కేంద్రం యెల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం కూడా దాదాపు అదే పరిస్థితి ఉంటుందని వెల్లడించింది. మరో రెండు రోజుల తర్వాత రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం గరిష్ఠ 35, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 16 డిగ్రీలుగా నమోదు అవుతున్నాయి. గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత మరింత ఎక్కువ కానుంది. ఆ రోజు నుంచి పగటిపూట ఉష్ణోగ్రతలు 34 నుంచి 37 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనే 34 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని పేర్కొంది. మిగిలిన అన్ని జిల్లాలకు గురువారం యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా సూర్యాపేట, వనపర్తి, నల్గొండ, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, వికారాబాద్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్,నిజామాబాద్, ఖమ్మం, ములుగు, గద్వాలలో ఎండ తీవ్రత మరింత పెరగనున్నట్లు వెల్లడించింది. ఆ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36-37 డిగ్రీల మధ్య నమోదు అవుతాయని పేర్కొంది. భారతవాతావరణ కేంద్రం కూడా తెలంగాణలో మార్చి 1 తర్వాత ఎండల తీవ్రత పెరుగుతుందని ప్రకటించింది.

రుణమాఫీ అమలు చేస్తే రాజకీయాల నుంచి వైదొలగుతా:ఈటల

రామాయంపేట, ఫిబ్రవరి 27: కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన రైతు రుణమాఫీని అమలు చేస్తే తాను రాజకీయాల నుంచి వైదొలగుతానని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ చేపట్టిన సంకల్పయాత్ర మంగళవారం మెదక్ జిల్లా రామాయంపేట చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో నేనే నంబర్ వన్ అని చెప్పుకున్న గత ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి జరగలేదని విమర్శించారు.కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కిందని, రుణమాఫీ విషయంలో చేతులెత్తేయడం ఖాయమని ఆరోపించారు.

వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడిగా భోజనపల్లి నరసింహమూర్తి



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా భోజనపల్లి నరసింహమూర్తి నియమితులయ్యారు. అయోధ్యలో మూడు రోజులపాటు జరిగిన వీహెచ్‌పీ సమావేశాల్లో నరసింహమూర్తిని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నరసింహమూర్తి దశాబ్దంపాటు ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా పని చేశారు. వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇప్పటి వరకు కొనసాగిన నరసింహమూర్తిని అయోధ్య సమావేశంలో అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు వీహెచ్‌పీ తెలంగాణ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి:జాజుల

రవీంద్రభారతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగులకు పదోన్నతులు, రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో బీసీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ సభకు జాజుల హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలైనా కేంద్రప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ ఉద్యోగుల శాతం 16శాతమేనన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మాదిరిగా బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్‌వోసీ దాఖలుకు ఐదువారాల గడువివ్వండి

» జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ విజ్ఞప్తి

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద చట్టం-1956లోని సెక్షన్-3 ప్రకారం కృష్ణా జలాలను తెలుగు రాష్ట్రాలకు పంచడానికి వీలుగా కేంద్రం జారీ చేసిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్(టీవోఆర్)పై విచారణకు సంబంధించి స్టేట్ ఆఫ్ కేస్(ఎస్‌వోసీ) దాఖలుకు తెలంగాణ ఐదు వారాల గడువు కోరింది. ఇందుకు సంబంధించి జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్(కృష్ణా ట్రిబ్యునల్-2)కు పిటిషన్ దాఖలు చేసింది. కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి ఏ విధంగా అన్యాయం జరిగిందని వివరిస్తూ బేసిన్ పారామీటర్, బేసిన్ వెంట నివాసం ఉంటున్న జనాభా, పరీవాహక ప్రాంతం, కరువు పీడిత ప్రాంతాలను నివేదిస్తూ ఎస్‌వోసీని దాఖలు చేయనున్నారు. ఎస్‌వోసీ సమగ్రంగా దాఖలు చేయాల్సి ఉండడంతో తమకు ఐదు వారాల సమయం కావాలంటూ తెలంగాణ విజ్ఞప్తి చేసింది. అయితే, తమకు ఆరు వారాలా గడువు కావాలంటూ ఏపీ మరో పిటిషన్ వేసింది. తెలుగు రాష్ట్రాలు చేసుకున్న ఈ విజ్ఞప్తులపై ట్రిబ్యునల్ సానుకూలంగా స్పందించే అవకాశముంది.

పిఠాపురం నుంచి పవన్ పోటీ!



కాకినాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పోటీచేసే అసెంబ్లీ స్థానంపై స్పష్టత వచ్చింది. ఆయన కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో బరిలోకి దిగనున్నారు. వాస్తవానికి వచ్చే ఎన్నికల్లో ఆయన భీమవరం నుంచి పోటీ చేస్తారంటూ విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే పిఠాపురం నుంచే పోటీకి పవన్ మొగ్గుచూపినట్లు తెలిసింది. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావలసి ఉంది. పిఠాపురం నియోజకవర్గంలో కాపు సామాజికవర్గం ఓట్లు దాదాపు 91 వేలు ఉన్నాయి. ఇక్కడి నుంచి పోటీచేస్తే పవన్ భారీ విజయానికి ఢోకా ఉండదని జనసేన వర్గాల్లో బలంగా ఉంది. ఈ నేపథ్యంలోనే పిఠాపురం నుంచి పోటీకి పవన్ మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థి పంతం నానాజీని ప్రకటించారు. కాకినాడ ఎంపీ సీటు కూడా దాదాపు జనసేనకే ఖాయమైంది. పవన్ పిఠాపురం నుంచి బరిలోకి దిగితే ఆ ప్రభావంతో కాకినాడ రూరల్, ఎంపీ స్థానం కూడా సునాయాసంగా గెలవచ్చనేది జనసేన వ్యూహంగా ఉంది.

క్రీడాకారులతో వైసీపీ చెలగాటం: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'జగన్ జమానాలో ఆడుదాం ఆంధ్రా అంటే ఏమో అనుకున్నా. క్రీడాకారుల జీవితాలతో చెలగాటమాడటం అని కొత్తగా తెలిసింది. 17వ ఆటగాడిగా ఉన్న తిరుపతి వైసీపీ కార్పొరేటర్ పుత్రరత్నాన్ని పద్ధతి మార్చుకోవాలని మందలించడమే ఆంధ్రా రంజీ జట్టు కెప్టెన్ హనుమ విహారి చేసిన అపరాధం. భారత్ తరపున 16 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి, ఆంధ్రా రంజీ జట్టుకు ఏడేళ్లు కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం వైసీపీ వీధి నాయకుడి పంతం ముందు దిగదుడుపే' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విమర్శించారు. తాలిబన్లను తలదన్నే వైసీపీ విధ్వంసక పాలనలో పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోవడం చూశామని, ఇప్పుడు అంబటి రాయుడు, హనుమ విహారి వంటి క్రీడాకారులు పారిపోతున్నారన్నారు.

భారత క్రికెటర్ కంటే వైసీపీ నేతే ముఖ్యమా?: పవన్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): భారత క్రికెటర్ కంటే వైసీపీ నాయకుడే ముఖ్యమా? అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఒక వైసీపీ కార్పొరేటర్ కారణంగా కెప్టెన్సీకి విహారి రాజీనామా సమర్పించాల్సి వచ్చిందన్నారు. ఏసీఏకి భారత్ క్రికెటర్ కంటే, స్థానిక వైసీపీ రాజకీయ నాయకుడు చాలా విలువైన వ్యక్తిగా మారటం అవమానకమని పేర్కొన్నారు. , ఏసీఏ విహారి పట్ల చూపిన వివక్షకు చింతిస్తున్నామన్నారు.

అధికారుల బదిలీలపై ఈసీ స్పష్టత

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఏయే కేటగిరీ అధికారులను బదిలీ చేయాలన్న దానిపై భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) స్పష్టత ఇచ్చింది. ఇందుకుగాను ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఎన్నికల ప్రధాన అధికారులకు మంగళవారం ఈసీఐ లేఖ పంపింది. దాని ప్రకారం మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న జిల్లా ఎన్నికల అధికారులు(డీఈ), డిప్యూటీ ఈవోలు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఏడీజీ, ఐజీ, డీఐజీ, ఎస్‌ఎస్‌పీలు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డిప్యూటీ ఎస్పీలు, పోలీసు శాఖలోని సర్కిల్, తత్సమాన ర్యాంకు అధికారులను తక్షణం బదిలీ చేయాలని సూచించింది.

డాక్టర్ ఎక్కడో.. స్కానింగ్ ఇక్కడ!

రోబోతో దూరం నుంచే అల్ట్రా సౌండ్ స్కానింగ్.. ఇంట్లోనే చిన్నారులకు డయేరియా పరీక్షకు కిట్

పెద్దవయసు వారు పడిపోకుండా ఆపే హిప్ ప్రో

అంధ విద్యార్థులకు లెక్కలు నేర్పే టచింగ్ మ్యాథ్

వినూత్న ఆవిష్కరణల వేదికగా బయో ఆసియా

రాజధాని హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఆసియా సదస్సు వినూత్న ఆవిష్కరణలకు వేదికగా మారింది. ఈ సదస్సులో భాగంగా నిర్వహిస్తున్న ట్రేడ్ ఫెయిర్‌లో పాల్గొన్న పలు సంస్థలు ఆరోగ్య సంరక్షణ రంగానికి సంబంధించి కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ప్రదర్శించాయి. బయోటెక్నాలజీ తదితర రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా పేరున్న అగ్రగామి సంస్థల నుంచి.. ఔత్సాహిక స్టార్టప్స్ వరకూ పలు సంస్థలు ఈ ట్రేడ్ ఫెయిర్‌లో పాల్గొన్నాయి. వీటిలో చాలావరకూ సంస్థలకు ఉపయోగపడే (బిజినెస్ టు బిజినెస్) ఆవిష్కరణలను ప్రదర్శించగా.. కొన్ని సంస్థలు నేరుగా రోగులకు ఉపయోగపడే టెక్నాలజీలను ప్రదర్శించాయి. వాటిలో కొన్ని..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)



వృద్ధులకు పట్టునిచ్చే హిప్ ప్రో

ఒక వయసు వచ్చిన తరువాత కాళ్లలో పట్టుండదు. ఎప్పుడు తూలి పడిపోతారో తెలియదు. దీనివల్ల తుంటి ఎముక విరగడం, ఫ్రాక్చర్ల ముప్పు వారికి చాలా ఎక్కువ. ఈ సమస్యకు పరిష్కారంగా రిపల్ హెల్త్‌కేర్ సంస్థ కృత్రిమ మేధ సాయంతో పని చేసే హిప్ ప్రో అనే స్మార్ట్ వేరబుల్ డివైజ్‌ను అభివృద్ధి చేసింది. ఈ పరికరం పెద్దవయసువారు కింద పడిపోకుండా హెచ్చరిస్తుందని.. ఒకవేళ పడ్డా తుంటి గాయాలను నిరోధిస్తుందని దీని రూపకర్తలు తెలిపారు. అతి తేలికగా ఇది ఉండటం వల్ల ధరించడం కూడా సులభమేనని వారు తెలిపారు. వయసు, పరిమాణం తదితర అంశాల ఆధారంగా దీని ధర ఉంటుందట.



రిథమ్‌తో రిథమ్ తెలుస్తుంది..!

ఆస్పత్రిలో మంచంపై ఉన్నవారి హృదయ స్పందనల వేగం, రక్తపోటు, ఆక్సిజన్ స్థాయులను యంత్రాల సాయంతో నిరంతరం పర్యవేక్షించవచ్చు. కానీ.. వారు మంచం దిగి బాత్‌రూమ్‌కు వెళ్లినప్పుడు కింద పడిపోతే? అలా వెళ్లినప్పుడు రోగి ఆరోగ్య స్థితి తెలుసుకోవడం ఎలా? ఈ ప్రశ్నకు సమాధానమే 'రిథమ్'. డీప్ ఫ్యాక్స్ అనే సంస్థ దీన్ని తయారు చేసింది. ధర రూ.35 వేలు. ఈ రిథమ్ డివైజ్‌తో ఈసీజీ, రక్తపోటు, గుండె కొట్టుకునేవేగం, శరీర ఉష్ణోగ్రత సహా పలు అంశాలను తెలుసుకోవచ్చని.. ప్రో రిథమ్ సేవల కోసం తాము రోజుకు 200 రూపాయలు చార్జ్ చేస్తామని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. హాస్పిటల్స్‌కు తాము ఈ డివైజ్‌లను అందిస్తున్నామని చెప్పారు.



డాక్టర్ ఎక్కడ ఉన్నా అల్ట్రా సౌండ్ స్కానింగ్

అల్ట్రా సౌండ్ పరీక్ష అంటే పెద్ద తతంగం. మెషీన్ ఉన్నా డాక్టర్ లేకపోతే పరీక్ష చేయడం అసాధ్యం. టోరస్ (టెలీ ఆపరేటెడ్ రిమోట్ అల్ట్రా సౌండ్ సిస్టమ్) అనే రోబోతో ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చంటున్నారు నగరానికి చెందిన ప్లైటెక్ అనే స్టార్టప్ సంస్థ సహవ్యవస్థాపకుడు వివేక్. మారుమూల ప్రాంతాల్లో ఈ రోబో ఉంటే చాలు.. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి కూడా డాక్టర్లు స్కానింగ్ పూర్తి చేయవచ్చని ఆయన వివరించారు. ఈ మెషీన్‌కి సంబంధించి సర్టిఫికేషన్ ప్రక్రియ జరుగుతోందని, త్వరలోనే మార్కెట్లోకి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. దీంతో తక్కువ ఖర్చుతోనే స్కానింగ్ చేయొచ్చని వివేక్ వెల్లడించారు.

ఇంట్లోనే డయేరియా టెస్ట్ కిట్



మన దేశంలో 1990ల నాటికి ఐదేళ్లలోపు చిన్నారుల్లో ఏటా ప్రతి లక్ష మందికిగాను సగటున 126 మంది డయేరియా కారణంగా చనిపోయేవారు. అందరికీ వైద్యం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో 2019నాటికి ఆ సంఖ్య 45కు తగ్గింది. కానీ, ఇప్పటికీ అది ఒక సమస్యే. ఆ సమస్య బ్యాక్టీరియా వల్ల వచ్చిందా? లేక ఇతర కారణాల వల్ల వచ్చిందా? అనే విషయాన్ని త్వరగా గుర్తించి చికిత్స చేయిస్తే మరణాల ముప్పు ఉండదు. దాన్ని సులువుగా గుర్తించేలా 'బేబీ క్యూ' అనే సంస్థ.. మైక్రోఫ్లూయిడిక్ పేపర్ బేస్ట్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. కేవలం రూ.100తో ఇంట్లోనే చేసుకోగలిగే మలపరీక్ష ఇది. మూలం తెలిస్తే చికిత్స చేయడం వైద్యులకు చాలా సులువవుతుంది.



అంధుల కోసం.. టచింగ్ మ్యాథ్

హైదరాబాద్‌లోని బీవీఆర్ఐటీలో చదువుతున్న ఈఈఈ విద్యార్థులు పవన్ తేజ, రోహన్‌రాజ్.. కొన్నాళ్ల క్రితం ప్రత్యేక టూర్‌లో భాగంగా అంధుల పాఠశాలను సందర్శించారు. బ్రెయిలీ లిపిలో గణితం నేర్చుకునేందుకు అంధ విద్యార్థులు పడుతున్న ప్రయాసను గమనించిన వీరిద్దరూ.. వారికి ఉపకరించే పరికరం తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. తమ కళాశాలలో ఉన్న వనరులతోనే.. టచింగ్ మ్యాథ్ అనే పరికరాన్ని రూపొందించారు. ఈ పరికరంలో లెర్నింగ్, టెస్టింగ్, అర్థమాటిక్ మాడ్యూల్స్‌తోపాటు స్పీకర్‌ను కూడా అమర్చారు. ఈ పరికరం తమకు గణితంపై ఆసక్తిని పెంచిదంటూ పలువురు అంధ విద్యార్థులు సంతోషం వెలిబుచ్చారని వారు తెలిపారు.

కణాలకు ఆక్సిజన్ కొరతతో పెనుముప్పు

క్యాన్సర్ బాధితులు, కిడ్నీ, హృద్రోగుల్లో శరీరకణాలకు తగినంత ప్రాణవాయువు అందకపోవడంవల్లే చిక్కు

బయోఆసియా సదస్సులో నోబెల్ విజేత ప్రొఫెసర్ గ్రెగ్ సెమెంజా వెల్లడి



క్యాన్సర్ బాధితుల్లో, హృద్రోగాలు, కిడ్నీ, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారి శరీరాల్లో కణాలకు ఆక్సిజన్ తగినంతగా సరఫరా కాకపోవడమే వారి సమస్యలకు మూలకారణంగా గుర్తించామని 2019 వైద్య నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ గ్రెగ్ సెమెంజా వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన బయోఆసియా-2024 సదస్సులో జినోమ్ వ్యాలీ అవార్డు అందుకున్న అనంతరం ఆయన కీలక ఉపన్యాసం చేశారు. "మానవ దేహంలో 50 ట్రిలియన్లకు పైగా కణాలు ఉంటాయి. వాటి డిమాండ్‌కు అనుగుణంగా ఆక్సిజన్‌ను సరఫరా చేసే అద్భుత యంత్రాంగం దేశంలో ఉంది. ఎర్ర రక్త కణాల ద్వారా రక్తనాళాల నుంచి మన శరీరంలోని కణాలన్నింటికీ ఆక్సిజన్ సరఫరా అవుతుంది. కానీ.. హృద్రోగులు, క్యాన్సర్ పేషెంట్లు, కిడ్నీ, శ్వాసకోశ సమస్యలు ఉన్న వారి దేహంలోని కణాలకు ఆక్సిజన్ సరఫరాలో సమతౌల్యం దెబ్బతినడాన్ని గుర్తించాం" అని ఆయన వివరించారు. మూడు దశాబ్దాల తమ పరిశోధనల్లో.. తొలుత కిడ్నీ రోగుల్లో రక్తహీనతకు గల కారణాలపై దృష్టి సారించామని ఆయన గుర్తుచేసుకున్నారు. "దీర్ఘకాలంగా మూత్రపిండాల వ్యాధి బారిన పడినవారిలో ఎరిత్రోపొయిటిన్ అనే హార్మోన్ వల్ల ఎర్రరక్తకణాల ఉత్పత్తి నిలిచిపోతుంది. అలా నిలిచిపోయిన ఎర్రరక్తకణాల ఉత్పత్తిని పెంపొందించడానికి ఎరిత్రోపొయిటిన్‌ను ఇంజక్షన్ ద్వారా అందించడం మొదలైంది. మా పరిశోధన సాధించిన తొలి విజయం అది. టాబ్లెట్ల రూపంలో ఆ హార్మోన్‌ను అందించేందుకు క్లినికల్ ట్రయిల్స్ కోసం నాలుగు సంస్థలకు ఎఫ్‌డీఏ అనుమతించింది. భారతదేశానికి చెందిన ఒక ఔషధ సంస్థ కూడా క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించింది" అని డాక్టర్ సెమెంజా వివరించారు. ఇదే పద్ధతిలో క్యాన్సర్‌ను కూడా కట్టడి చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. క్యాన్సర్ ఉన్న వారిలో కణాలు వేగంగా పెరగడం వల్ల ఆక్సిజన్ సరఫరా తగ్గుతుందని.. ఫలితంగా క్యాన్సర్ కణాలు చనిపోతాయి. కానీ ఆ చనిపోయేది క్యాన్సర్ కణితికి దూరంగా ఉన్న కణాలు మాత్రమేనని, దగ్గరగా ఉన్నవి తగినంత ఆక్సిజన్ లభించడంతో యథాతథంగా ఉంటాయని వెల్లడించారు. అవి ఎలాంటి చికిత్సకూ లొంగకుండా పోతున్నాయని.. అది మరింత ప్రమాదమని ఆందోళన వెలిబుచ్చారు. వాటినీ నిర్మూలించే దిశగా పరిశోధనలు చేస్తున్నామని తెలిపారు. దీంతోపాటు.. హృద్రోగాలు, మధుమేహరోగుల కంటి సమస్యలు, శ్వాసకోశ సమస్యల పరిష్కారం దిశగా పరిశోధనలు జరుపుతున్నట్లు వెల్లడించారు. అందుకు కొంత సమయం పడుతుందని.. అయినప్పటికీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో వేగంగా ఫలితాలు సాధిస్తామనే విశ్వాసం ఉందని డాక్టర్ గ్రెగ్ సెమెంజా ఆశాభావం వ్యక్తం చేశారు.

-స్పెషల్ డెస్క్

కరోనా నియంత్రణలో.. జయహో

బ్రిస్టల్ మేయర్స్ సీఈవో బోయ్‌నర్ ప్రశంస

కరోనాను సమర్థంగా అదుపుచేయడంతో పాటు ఇతర దేశాలకు కూడా సాయపడడం శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ సాధించిన ప్రగతికి నిదర్శనమని ప్రపంచంలో అతి పెద్ద ఫార్మా కంపెనీల్లో ఒకటైన బ్రిస్టల్ మేయర్స్ సంస్థ సీఈవో బోయ్‌నర్ అన్నారు. ముంబై, బెంగళూరుల్లో తమ కేంద్రాలు ఉన్నా.. 2025 నాటికి హైదరాబాద్ కేంద్రాన్ని అమెరికా వెలుపల ఉన్నవాటిలో అతిపెద్ద కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. మెలనోమా (ఒక తరహా చర్మ క్యాన్సర్) వచ్చిన వారు ఏడాది కంటే ఎక్కువ కాలం బతకడం కష్టమని.. ఆధునిక పరిజ్ఞానంతో వారు ఎక్కువ కాలం జీవించేలా ప్రయోగాత్మక పరీక్షలు నిర్వహిస్తున్నామని బోయ్‌నర్ వెల్లడించారు.

మా కార్యకలాపాలకు హబ్‌గా హైదరాబాద్

అమెరికాలో మాకు 52 ఆస్పత్రులు ఉన్నాయి. అమెరికా నుంచి వైద్యులు లండన్‌లోని ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసే రీతిలో పరిజ్ఞానం అభివృద్ధి చెందింది. కృత్రిమ మేధ సహకారంతో వేగంగా, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. భారత్ సహకారంతో వైద్యరంగంలో ముందడుగు వేస్తాం. టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా ఉన్న హైదరాబాద్‌ను 'ప్రావిడెన్స్' సంస్థ కార్యకలాపాలకు హబ్‌గా తీర్చిదిద్దుతాం.

- డాక్టర్ రోడ్నీ హాక్‌మన్, ప్రావిడెన్స్ సీఈవో

త్వరలో జీనోమ్ వ్యాలీ-2

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో ఈ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఒక గంట ప్రయాణ దూరంలోనే అత్యంత సమీపంలో వీటిని ఏర్పాటు చేస్తున్నందున ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికీ ఇది ఎంతో సదుపాయంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ప్రపంచంలో వినియోగించే ప్రతి మూడు వ్యాక్సిన్లలో ఒకటి హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతోందని సీఎం గుర్తు చేశారు. బయోసైన్స్ రాజధానిగా హైదరాబాద్ నేడు యావత్ మానవాళికీ భరోసాగా నిలిచిందని.. వైరస్ భయాలను ధీటుగా ఎదుర్కోగలమనే నమ్మకాన్ని కలిగించిందని సగర్వంగా పేర్కొన్నారు. బయోసైన్సెస్‌లోనే కాక.. ఐటీ, రిసెర్చ్, స్టార్టప్ రంగాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను మరింత సమున్నతంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ప్రకటించారు. అంతర్జాతీయ, దేశీయ సంస్థలు ఇక్కడ ఎలాంటి ఆటంకాలూ లేకుండా కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అవసరమైన అనుకూల వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు. చిన్న స్టార్టప్‌లు, పెద్ద కార్పొరేట్ కంపెనీలకు వారధిగా నిలిచే ఎంఎస్‌ఎంఈ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.



బయో ఏషియా 2024 సమావేశంలో విదేశీ ప్రతినిధులతో సీఎం రేవంత్, మంత్రి దుద్దిళ్ల

ఏటా 5 కోట్ల డెంగీ టీకాల తయారీ..

"మీరు నింగిలోని తారల వద్దకు చేరాలని కలలు కంటే.. మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లే రాకెట్‌లా మా ప్రభుత్వం పనిచేస్తుంది" అని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. ఏటా 5 కోట్ల డోసుల డెంగీ వ్యాక్సిన్ల ఉత్పత్తే లక్ష్యంగా ప్రఖ్యాత టకేడా సంస్థ ఇక్కడి బయోలాజికల్-ఈ సంస్థతో కలిసి హైదరాబాద్‌లో తయారీ కేంద్రం నెలకొల్పేందుకు కుదిరిన ఒప్పందాన్ని రేవంత్ స్వాగతించారు. ఈ ఏడాది జీనోమ్ వ్యాలీ ఎక్సెలెన్స్ 2024 అవార్డును.. నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ గ్రెగ్ ఎల్.సెమెంజాకు ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రొఫెసర్ సెమెంజాకు అవార్డును అందించి అభినందించారు.

రైతుల అభ్యంతరాలతోనే ఫార్మాసిటీ మార్పు.. మంత్రి దుద్దిళ్ల

రైతుల ఆందోళనలు, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకునే ముచ్చెర్లలోని హైదరాబాద్ ఫార్మాసిటీని మరోచోటికి తరలిస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బయోఆసియా సదస్సులో, అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన ఏడు ఫార్మా క్లస్టర్లతోపాటు వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో ఈ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నూతన పాలసీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. భారతదేశంలో హైదరాబాద్ స్కిల్ క్యాపిటల్‌గా ఉండాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణలోని విద్యార్థులందరికీ పరిశ్రమల్లో తప్పనిసరి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లు అమలు చేయనున్నామని, దీంతో పరిశ్రమలకు మరింత నాణ్యమైన మానవ వనరులు లభిస్తాయని శ్రీధర్‌బాబు చెప్పారు.

పెట్టుబడులు పెట్టండి.. మాదీ భరోసా

సదస్సుకు వచ్చిన విదేశీ ప్రతినిధులతో సీఎం

పెట్టుబడులకు తెలంగాణ ఎంతో అనుకూలమని, హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వం అన్ని సదుపాయాలూ కల్పిస్తుందని సీఎం రేవంత్ అన్నారు. బయో ఏషియా 2024 సదస్సుకు హాజరైన పలు దేశాల ప్రతినిధులు సీఎం రేవంత్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ భౌగోళిక స్థితిగతులు, ఇతర అంశాలపై సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి పట్టణాల్లో కూడా పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా వెస్ట్రన్ ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి శాండర్సన్ మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ రంగంలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భారతదేశంలో తొలి కమర్షియల్ ఆఫీస్ హైదరాబాద్‌లోనే ప్రారంభిస్తున్నట్లు ఆమె వివరించారు. హెల్త్ కేర్, హెల్త్ టూరిజంలో పెట్టుబడులకు అవకాశాలున్నాయని.. అలాగే వ్యవసాయ రంగంలో కూడా పెట్టుబడులు పెట్టాలని సీఎం సూచించారు. ప్రధానంగా వ్యాపార పంటలపై దృష్టి సారించాలన్నారు. తెలంగాణలో 26 రకాల పంటలు పండించే భూములున్నాయని వారికి తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని బెల్జియం అంబాసిడర్ డెడిర్ వాండర్ హసక్‌కు సూచించారు. కాగా.. ప్రపంచ ఆర్థిక వేదిక ఎండీ జెర్మీ జుర్గన్స్ ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా సమావేశమై, తాము డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తున్నట్లు తెలియజేశారు. ఇక, సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి కొందరు పారిశ్రామికవేత్తలు ముందుకురాగా.. కావాల్సిన భూమితో పాటు ఇతర సదుపాయాలను కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

రాడిసన్‌లో డ్రగ్స్ కేసు..

నేడు పోలీసుల ముందుకు క్రిష్!



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ వ్యవహారంలో సినీ దర్శకుడు జాగర్లమూడి క్రిష్ బుధవారం పోలీసుల విచారణకు హాజరుకానున్నారు. ప్రధాన నిందితుడు వివేకానంద వాంగ్మూలం మేరకు.. పోలీసులు క్రిష్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు అధికారులు మంగళవారం క్రిష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విచారణకు హాజరవ్వాలని, ఈ కేసు దర్యాప్తునకు సహకరించాలని కోరారు. అయితే.. తాను బయట ఉన్నానని, బుధవారం విచారణకు వస్తానని క్రిష్ చెప్పినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ మహంతి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. "క్రిష్‌ను విచారిస్తాం. వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత.. తదుపరి చర్యలు ఉంటాయి. ఇప్పటి వరకు క్రిష్ ఈ కేసులో అనుమానితుడు మాత్రమే. నేరం చేశారా? లేదా? అనేది తేలాల్సి ఉంది" అని ఆయన వివరించారు. ఈ కేసులో ఏపీకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఒకరు ఉన్నట్లు సమాచారం. గతంలో రాడిసన్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీల్లో ఆయన పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే.. దర్యాప్తు అధికారులు ఈ విషయాన్ని ఇంకా ధ్రువీకరించలేదు. క్రిష్‌తోపాటు.. లిషి గణేశ్ పేర్లు వెలుగులోకి రావడంతో.. తాజా ఘటన మరోసారి టాలీవుడ్‌ను ఉలిక్కిపడేలా చేసింది.

పరారీలో ప్రముఖులు

ఈ కేసులో మొత్తం పది మంది ఉన్నట్లు ఎఫ్ఐఆర్ స్పష్టం చేస్తుండగా.. వివేకానంద, అతనికి డ్రగ్స్ సరఫరా చేసే అబ్బాస్, కేదార్, నిర్భయ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కేదార్, నిర్భయ్‌లకు నార్కోటిక్స్ పరీక్షలు నిర్వహించగా.. పాజిటివ్ అని తేలినట్లు మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. మిగతా ఆరుగురు పరారీలో ఉన్నారు. వీరంతా నగరంలోనే ఉన్నారా? అనేదానిపై పోలీసులు దృష్టి సారించారు. వీరిలో.. క్రిష్‌తోపాటు.. సెలబ్రిటీలు శ్వేత, నీల్, సినీనటి లిషి, సందీప్, రఘుచరణ్ ఉన్నారు. వీరిని పట్టుకునేందుకు గచ్చిబౌలి, ఎస్‌వోటీ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డీసీపీ చెప్పారు. వారు డ్రగ్స్ తీసుకున్నారా? లేదా? అనేదాన్ని బట్టి కేసు దర్యాప్తులో పురోగతి ఉంటుందని వివరించారు. అబ్బాస్ అనే డ్రగ్ పెడ్లర్ గతంలో మంజీరా గ్రూప్‌లో పనిచేశాడని, అప్పటి నుంచే వివేకానందకు అతనితో పరిచయం అని పోలీసులు తెలిపారు. వివేకానందకు అతను 10 సార్లు డ్రగ్స్‌ను సరఫరా చేశాడని వెల్లడించారు. కాగా.. తనపేరు బయటకు రావడంపై క్రిష్ స్పందించారు. తాను ఆరోజు రాడిసన్ హోటల్‌కు వెళ్లింది నిజమేనని, ఓ అరగంట ఉండి.. సాయంత్రం 6.45కు బయటకు వచ్చానని వివరించారు. ఈ క్రమంలో వివేకానందతో కాసేపు మాట్లాడానన్నారు. పోలీసుల విచారణకు హాజరవుతానని చెప్పారు.

ఆ రెండు గదుల కథేంటి?

గచ్చిబౌలిలోని రాడిసన్ యజమాని వివేకానంద ఆ హోటల్ 12వ అంతస్తులోని 1200 1204 నంబర్ ఉన్న గదులను సొంత పార్టీల కోసం కేటాయించినట్లు పోలీసులు భావిస్తున్నారు. "బయటి నుంచి చూస్తే.. ఇవి వేర్వేరు గదులు. లోపల మాత్రం రెండు గదులకు మధ్య ద్వారం ఉంటుంది" అని పోలీసులు వివరించారు. ఈ గదుల్లోనే డ్రగ్స్ పార్టీలు జరిగేవని గుర్తించామన్నారు. గతంలో ఎప్పుడెప్పుడు పార్టీలను నిర్వహించారు? ఎవరెవరు ఎంత డ్రగ్స్ తీసుకున్నారు? అనే కోణంపై మరో బృందం దృష్టి సారించింది. ఈ కోణంలో ఇప్పటికే పలు వివరాలను సేకరించిన పోలీసులు..ఆధారాలు లభిస్తే మరిన్ని ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

కేసీఆర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు షాక్

» తూప్రాన్ ఉమ్మడి మండల పాక్స్ ఛైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక

మనోహరాబాద్, ఫిబ్రవరి 27: మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. తూప్రాన్ ఉమ్మడి మండలాల పాక్స్ ఛైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, మనోహరాబాద్ మాజీ ఎంపీటీసీ ర్యాకల కృష్ణాగౌడ్, మాజీ ఉప సర్పంచులు నవీన్, శ్రీహరి గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రంగు గణేష్, రమేష్, సుధాకర్, లక్ష్మారెడ్డి, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలోని దండుపల్లి శుభం ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, నర్సారెడ్డి సమక్షంలో వీరు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం పాక్స్ ఛైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీలో కిందిస్థాయి కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు.

ఆయిల్ పామ్ ప్రాజెక్టు పురోగతి ఇలానా?

» లక్ష్యం నెరవేర్చకపోతే ఉపేక్షించబోం: మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ విస్తరణకు 14 కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని అమలుచేస్తున్న ప్రాజెక్టు పురోగతి సరిగాలేదని, కేవలం 20 శాతం కూడా లక్ష్యం నెరవేర్చకపోవటం సరైన పద్ధతికాదని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టు పురోగతి ఆశించస్థాయిలో లేకపోతే కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను పునః సమీక్షించి, కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, జాయింట్ సెక్రటరీ సత్యశారదతో సమీక్ష నిర్వహించారు. కేవలం 1,52,957 ఎకరాల్లో మాత్రమే ప్లాంటేషన్ పూర్తయ్యిందని, మిగిలిన టార్గెట్ పూర్తిచేయాలని తుమ్మల సూచించారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం గబ్బగుర్తి గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఆయిల్ పామ్ సీడ్ గార్డెన్‌కు, స్థల సేకరణ జరుగుతుందని అక్కడ సీడ్ గార్డెన్ ఏర్పాటును త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

మార్చి 1 నుంచి లాసెట్ దరఖాస్తులు

లాసెట్ దరఖాస్తులను మార్చి 1 నుంచి స్వీకరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. అలాగే రూ. 4 వేల ఆలస్య రుసుంతో మే 25 వరకు దరఖాస్తులు చేయవచ్చు. జూన్ 3న లాసెట్ పరీక్షలను నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

బీసీ కులాల తొలగింపు కేసు ఏప్రిల్ 3కి వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో.. బీసీ కులాల జాబితా నుంచి 26 కులాల తొలగింపుకు సంబంధించిన కేసును మంగళవారం సుప్రీంకోర్టు ఏప్రిల్ 3కి వాయిదా వేసింది. బీసీ కులాల జాబితా నుంచి కళింగ, గవర, తూర్పు కాపులు.. ఇలా 138 బీసీ కులాల నుంచి 26 కులాలను తొలగిస్తూ 2015లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై ఆ సంవత్సరమే కొంతమంది విద్యార్థులు, తల్లిదండ్రులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 101, 107లకు అనుగుణంగానే తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని ఈ వ్యవహారంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. దీంతో కొందరు హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. కాగా మంగళవారం సుప్రీంకోర్టులో ద్విసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. తెలంగాణలో కొత్త ప్రభుత్వం కులగణన చేపడుతుందని, కాబట్టి ఆరు నెలల సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రవణ్ కుమార్ ధర్మాసనాన్ని కోరారు. వాదనల సందర్భంగా.. బీసీ కులాల తొలగింపు చట్టబద్ధమా? కాదా? అనేది పరిశీలించాల్సి ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేసును ఏప్రిల్ 3కి వాయిదా వేసింది.





చేవెళ్లలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన జనం; అభివాదం చేస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు

మగాడివైతే ఒక్క సీటు గెలిపించుకో

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రభుత్వం మూడు నెలలు ఉండదంటే.. మరొకరు ఆరు నెలలు ఉండదంటారు. ఆ సన్నాసులకు చెప్పదలచున్నా. ఎవడైనా ఈ ప్రభుత్వం ఉండదని మాట్లాడితే మా కార్యకర్తలు పట్టుకుని చెట్టుకు కట్టేసి కొడతారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి అని చెబితే కాంగ్రెస్‌కు మూడు సీట్లు కూడా వచ్చేవి కావని ఓ సన్నాసోడు అంటున్నాడు. కేటీఆర్‌కు ఈ వేదిక మీద నుంచే సవాల్ విసురుతున్నా. ఈరోజు నేనే సీఎం, నేనే పీసీసీ అధ్యక్షుడిని. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నీకు చేతనైతే, దమ్ముంటే, నువ్వు మగాడివైతే నీ పార్టీకి ఒక్క సీటు గెలిపించి చూపించు. మేం అల్లాటప్పా గాళ్లం కాదు. అయ్యని అడ్డుపెట్టుకుని కుర్చీ తీసుకోలేదు. జెండాలు మోసి, అక్రమ కేసులు ఎదుర్కొని, చర్లపల్లి జైల్లో మగ్గినా భయపడకుండా, లొంగకుండా నిన్ను నీ అయ్యను, నీ బావను బొంద పెట్టి ఈ కుర్చీలో కూర్చున్నాం. ఈ కుర్చీ ఇనాం కింద వచ్చిందో, అయ్య పేరుతో వచ్చిందో కాదు. నలమల్ల అడవి నంచి తొక్కుకుంటూ నీలాంటి వాళ్ల నెత్తిమీద కాళ్లు పెట్టి మా కార్యకర్తలు మమ్మల్ని ఇక్కడ కూర్చోబెట్టారు. ఇది మా కార్యకర్తల త్యాగం, పోరాటాల ద్వారా వచ్చింది. వారు మమ్మల్ని భుజాల మీద మోసినంత కాలం నువ్వు, మీ అయ్య మాత్రమే కాదు.. వాళ్ల దేవుడు కూడా ఈ కుర్చీని తాకలేరు.

కృష్ణానగర్‌లో బ్రోకర్ దందా కూడా పెట్టుకో..

సోషల్ మీడియా ఉంటే మేము గెలిచే వాళ్లమని కేటీఆర్ అంటున్నాడు. ఉన్న టీవీలన్నీ మీచుట్టపోళ్లవే కదా? మాకేమైనా టీవీ ఉందా? పేపర్ ఉందా? సాయంత్రం సేద దీరడానికి జూబ్లీహిల్స్‌లో సినిమా వాళ్ల గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయా? మా కార్యకర్తలు కష్టపడి నిలబడి పోరాడితే మాకు ఈ అధికారం వచ్చింది. మీరు చేసే తప్పుడు పనులను మా కార్యకర్తలు సోషల్ మీడియాలో పెట్టారు. మాకు ఏ ట్యూబ్ అవసరం లేదు. చివరికి దివాళా తీసి యూట్యూబ్ చానల్ పెట్టుకుంటామంటున్నాడు. అలాగే కృష్ణానగర్‌లో బ్రోకర్ దందా కూడా పెట్టుకో. రెండు కలిస్తే బాగానే నడుస్తాయి. తెలంగాణను దోచుకుంటే ప్రజలు చెప్పుతో కొట్టారనే విషయం వారికి అర్థం కావడంలేదు. మీరు పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకుతింటే.. ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చారు. కేంద్రంలో బీజేపీతో బీఆర్ఎస్ కలిసే ఉంది. కానీ, ఇద్దరూ కలిసి నాటకాలాడుతున్నారు. మీ నాటకాలు తెలంగాణ ప్రజలకు అర్థం కావా? అల్లం బెల్లంలాగా అలయ్ బలయ్ చేసుకుంటున్నారు. చీకట్లో కలిసిపోతూ పగలు కొట్టుకుంటున్నట్లు నటిస్తున్నారు. వారి మధ్య చీకటి ఒప్పందం లేకుంటే కేటీఆర్‌ను సీఎంను చేస్తానని కేసీఆర్ మోదీ వద్ద ఎందుకు ప్రతిపాదన పెట్టారు? ఆయనేమైనా వీరి కుటుంబ పెద్దా? కుల పెద్దా? గుజరాత్ మోడల్ అంటే ఏంటి? పదేళ్లపాటు ప్రధానమంత్రిగా మోదీ లేరా? పేదలందరికీ ఇళ్లు ఎందుకు కట్టలేదు? గుజరాత్ మోడల్ అంటే ఊర్లోవాళ్లను తగలబెట్టడం, ప్రభుత్వాలను పడగొట్టడం, ఇతర రాష్ట్రాలకు వచ్చే కంపెనీలను గుజరాత్‌కు తరలించడం, మాట వినని వాళ్లను జైల్లో పెట్టడం, ఈడీని, ఇన్‌కమ్ ట్యాక్స్, సీబీఐను ఉసికొల్పడమేనా? రైతులకు రెట్టింపు ఆదాయం ఇస్తామని చెప్పి ఢిల్లీలో రైతులను కాల్చి చంపుతున్నారు. ఇక్కడ నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్న మనిషి మంచోడే కానీ.. ఆయన పార్టీ సక్కగ లేదు. ఆయనే చెప్పాడు ఈ పార్టీలో ఏదో ఆశించి చేరితే అలా జరగడం లేదని. అందుకే ఆయనకు ఓటు వేసి దండగే. అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్‌ను గెలిపించాలి" అని రేవంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మల్లు రవి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, టి.జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 27: పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. చేవెళ్లలో మంగళవారం 'జన జాతర' పేరుతో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభ విజయవంతమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రంగారెడ్డి జిల్లాలో మొదటిసారిగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. కాంగ్రెస్

జనజాతర సభకు భారీగా జనం

హామీలైన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాలను చేవెళ్ల బహిరంగ సభలో ప్రారంభించాల్సి ఉండగా.. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి కోడ్ అమల్లోకి రావడంతో వీటిని సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సమక్షంలో ప్రారంభించారు. అనంతరం చేవెళ్ల సభకు వచ్చారు. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి 40 నిమిషాలపాటు చేసిన ప్రసంగం పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపింది. కాగా, సీఎం రాక నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీసులు ఆంక్షలు విధించడంపై విమర్శలు వచ్చాయి. దారిపొడవునా షాపులు బంద్ చేయించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

త్వరలో మెగా డీఎస్సీ

త్వరలో మెగా డీఎస్సీ ద్వారా ఖాళీ టీచర్ పోస్టులన్నీ భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే 25 వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని అన్నారు. ఇది చూసి ఓర్వలేని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితారావు, సంతోష్‌రావు, దయాకర్ రావు కుట్ర చేసి కాంగ్రెస్ పార్టీపై శాపనార్థాలు పెడుతున్నారని మండిపడ్డారు. "పేదోళ్ల బిడ్డలకు ఉద్యోగాలు ఇస్తే మీ కడుపు మండుతుందా? అని ప్రశ్నించారు. "మీ బిడ్డను నిజామాబాద్‌లో బండకేసి కొడితే ఆర్నెల్లు తిరగక ముందే ఎమ్మెల్సీ పదవి ఇచ్చావు. మీ చుట్టం వినోద్‌రావును కరీంనగర్‌లో గోతి తీసి పాతిపెడితే ఆర్నెల్లలోనే ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌ను చేశారు. నిరుపేద బిడ్డలు పదేళ్లపాటు కష్టపడి, ఉద్యోగాలు రాక చెట్లకు ఉరేసుకుని చనిపోతే వారి గురించి ఆలోచించావా? మా ఇందిరమ్మ రాజ్యం వచ్చిన వెంటనే 25 వేల ఉద్యోగాల నియామక పత్రాలు ఇచ్చాం. మార్చి, ఏప్రిల్‌లో మరో 7వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసి పారదర్శకంగా నియామకాలు చేపడతాం" అని రేవంత్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు కచ్చితంగా గెలిచి తీరాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల తరువాత స్థానిక సంస్థలపై దృష్టిపెడతామని, పనిచేసే కార్యకర్తలను నిర్లక్ష్యం చేయబోమని తెలిపారు. సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. త్వరలో ఇందిరమ్మ కమిటీలు వేస్తామని, ప్రతి గ్రామం నుంచి ఐదుగురి పేర్లు ఇన్‌చార్జి మంత్రికి పంపాలని సూచించారు.

ఎక్కడైనా సరే.. కరెంట్ వైర్లు

పట్టుకుని చూడండి

» విద్యుత్తు ఉందో లేదో తెలుస్తుంది: డిప్యూటీ సీఎం భట్టి

» తప్పుడు కూతలు కూస్తే మట్టికొట్టుకుపోతారు: సీతక్క

» సంజయ్ ఖబడ్దార్.. : శ్రీధర్‌బాబు

» పేదలకు న్యాయం: పొంగులేటి

» జన జాతర' సభలో మంత్రుల ప్రసంగం

చేవెళ్ల/మొయినాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని చెప్పిన బీఆర్ఎస్ నేతలు ఇపుడు రాష్ట్రంలో ఏ మూలకైనా వెళ్లి తీగలు పట్టుకుని చూడాలని.. కరెంట్ ఉందో లేదో తెలుస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించిందని ఆరోపించారు. చేవెళ్ల- ప్రాణహిత అవసరం లేదని కాళేశ్వరం కట్టారని, అద్భుతాలు సృష్టించామని చెప్పారని.. ఇపుడు ఏమైందని ప్రశ్నించారు. మేడిగడ్డ నిట్టనిలువనా చీల్చిపోయిందన్నారు. ప్రగల్భాలు పలికి రూ.లక్ష కోట్లను గోదావరిలో పోశారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో మంగళవారం జరిగిన 'జన జాతర' సభలో భట్టి మాట్లాడారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా 'గ్యారెంటీలు' అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రాన్ని ఇబ్బందుల్లోకి నెట్టిందని.. మాట నిలబెట్టుకోవాలనే కృతనిశ్చయంతో సీఎం రేవంత్, మంత్రివర్గ సహచరులందరం ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఓట్ల కోసం బీజేపీ మతాలు, కులాలను రెచ్చగొట్టాలని చూస్తోందని.. అది తెలంగాణలో సాధ్యం కాదన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడవక ముందే ఇబ్బందులు పెట్టేయత్నాలు చేస్తున్నారని.. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. 80 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీలను అమలు చేస్తున్నామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. 70 లక్షల స్వయం స్వహాయక సంఘాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అపోహలు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించిందని విమర్శించారు. 17 ఎంపీ సీట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మీద సంస్కార హీనంగా మాట్లాడుతున్నారని ఇదేనా ఆ పార్టీ సంస్కృతి అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదని సంజయ్ ఖబడ్దార్ అని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు మతి కోల్పోయి దుష్ప్రచారం చేస్తున్నారని తప్పుబట్టారు. తమ ప్రభుత్వం ఏర్పడి నాలుగు రోజుల గడవకముందే ప్రతిపక్షాలు అపశకునాలు పెడుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్‌ను ముట్టుకునే ప్రయత్నం చేస్తే మసైపోతారని చెప్పాలని కార్యకర్తలను కోరారు. ప్రజా పాలనను చూసి బీఆర్ఎస్, బీజేపీ ఓర్వలేకపోతున్నాయని మంత్రి సీతక్క మండిపడ్డారు. తప్పుడు కూతలు కూసే వారు మట్టికొట్టుకుపోతారన్నారు.

అమలు చేసి తీరుతాం

ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలన్నీ అమలు: రేవంత్.. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను ప్రారంభించిన సీఎం



సచివాలయంలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా, రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నా.. ప్రజలకిచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దుబారా ఖర్చు తగ్గించుకుని.. ఆర్థిక నియంత్రణ పాటిస్తూ సంక్షేమ పథకాలకు, అభివృద్ధికి క్రమపద్ధతిలో నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాలను మంగళవారం సచివాలయంలో సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి తమ ప్రభుత్వం వందశాతం కట్టుబడి ఉందన్నారు. పథకాలు పేదలకు సులువుగా చేరేలా ఆయా శాఖల అధికారులు విధి విధానాలు రూపొందించారని చెప్పారు. పథకాల అమలు విషయంలో ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా, ఎలాంటి మాటలు మాట్లాడినా ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని స్పష్టం చేశారు. పథకాలు అమలు కాకపోతే బాగుండునన్నట్లుగా తండ్రీ, కొడుకులు, మామా-అల్లుళ్లు ప్రయత్నం చేస్తున్నారని మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావునుద్దేశించి రేవంత్ వ్యాఖ్యానించారు. కానీ, వారిని ప్రజలు విశ్వసించడంలేదన్నారు. నిజమైన లబ్ధిదారులకు పథకాలను అందించేందుకే ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా అర్హులను గుర్తించినట్లు తెలిపారు. వారికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నట్లు చెప్పారు. వాస్తవానికి ఈ పథకాలను ప్రియాంకగాంధీ చేతుల మీదుగా చేవెళ్ల సభలో ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. కానీ, సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూలు విడుదలైందని, ఆ జిల్లాలో ఉన్న కొన్ని మండలాలు ఇతర జిల్లాల్లోనూ ఉన్నాయని అన్నారు. దీంతో చేవెళ్లలో ప్రారంభించుకోవాలనుకున్న పథకాలను ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సచివాలయంలో ప్రారంభించామని తెలిపారు. అయినా.. మహిళల కళ్లలో ఆనందం చూసేందుకు బహిరంగ సభకు వెళ్లాలని నిర్ణయించామన్నారు.

సోనియా మాట ఇస్తే.. శిలాశాసనమే..


మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటుతోపాటు ఆరు గ్యారెంటీలను 2023 సెప్టెంబరు 17న తుక్కుగూడ సభలో సోనియాగాంధీ ప్రకటించారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఆమె మాట ఇచ్చారంటే అది శిలాశాసనమేనని, తమ ప్రభుత్వం ఆ మాటను అమలు చేస్తుందని చెప్పారు. వాస్తవానికి కట్టెల పొయ్యితో కష్టాలు పడుతున్న మహిళల కోసం 'దీపం' పథకాన్ని యూపీఏ ప్రభుత్వమే తీసుకొచ్చిందని రేవంత్ అన్నారు. ఆ పథకం కింద అపుడు గ్యాస్ సిలిండర్‌ను రూ.400కే కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తే.. ఆ తరువాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఆ ధరను దాదాపు రూ.1,200కు పెంచిందని విమర్శించారు. అయితే కేంద్రం సిలిండర్ ధర పెంచినా.. అప్పటి సీఎం కేసీఆర్ దానిని తగ్గించే ప్రయత్నం చేయలేదని, కేంద్రం పెంచినా కొద్దీ జీఎస్టీ ద్వారా ఆదాయం వస్తుందనే ఆలోచనలోనే ఉన్నారని తప్పుబట్టారు. గ్యాస్‌ను కూడా ఆదాయ వనరుగానే చూశారని ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు చరిత్రాత్మకమైనవని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. ఇవి దేశానికి ఒక దశ - దిశను నిర్దేశం చేస్తాయని భావిస్తున్నామన్నారు. 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లు వచ్చిన అర్హులందరికీ మార్చి నుంచి 'జీరో' బిల్లు ఇవ్వనున్నట్టు తెలిపారు.

అమల్లోకి 'గృహజ్యోతి'

200 యూనిట్ల దాకా విద్యుత్తు వాడే అర్హులకు మార్చిలో జీరో బిల్లు

» తెల్ల రేషన్ కార్డే ప్రామాణికం.. నిరంతర ప్రక్రియగా దరఖాస్తులు

» గృహేతర అవసరాలకు వినియోగిస్తే కేసులు:సర్కారు



హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రెండు డిస్కమ్‌ల పరిధిలో 'గృహజ్యోతి' కింద అర్హులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు అందించే పథకం అమల్లోకి వచ్చింది. ఈ మేరకు మంగళవారం ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ జీవో నం.7 జారీ చేశారు. పథకం మార్గదర్శకాలను కూడా విడుదల చేశారు. పథకం తక్షణమే అమల్లోకి వస్తుందని సర్కారు స్పష్టం చేసింది. దీంతో ఫిబ్రవరి నెలలో 200 యూనిట్ల దాకా వినియోగించే అర్హులైన ఇళ్ల యజమానులతో పాటు అద్దెదారులకు.. గృహలక్ష్మి కింద మార్చి తొలి వారంలో తీసే బిల్లు జీరోగా రానుంది. కాగా, నిరంతర ప్రక్రియగా గృహజ్యోతి పథకం అమలు కానుంది. తెల్ల రేషన్ కార్డు/ఆహార భద్రత కార్డులతో పాటు ఆధార్ కార్డు ఉండి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోనివారు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. దరఖాస్తును పరిశీలన/ఆమోదించే క్రమంలో వినియోగదారుడి నుంచి బిల్లును వసూలు చేయరు. ఆమోదం అనంతరం రివైజ్డ్ బిల్లును జారీ చేస్తారు. ఆహార భద్రత కార్డులకు ఆధార్ అనుసంధానమై యూనిక్ సర్వీస్ కనెక్షన్ ఉంటే ఆ వివరాలు పొందుపరిచి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రజాపాలన దరఖాస్తు పరిశీలనలో ఉన్నవారి నుంచి బిల్లు వసూలు చేయరు. దరఖాస్తుల సమర్పణ అనంతరం వినియోగదారుడు అర్హుడిగా తేలితే గృహజ్యోతి కింద సవరణ బిల్లు జారీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. గృహేతర అవసరాలకు విద్యుత్‌ను వినియోగిస్తే ఎలక్ట్రిసిటీ చట్టం-2003తో పాటు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రతి కుటుంబంలో ఒక కనెక్షన్‌కు 200 యూనిట్ల దాకా ఉచితంగా విద్యుత్తు అందనుంది. గృహజ్యోతి అమలు క్రమంలో వినియోగదారుల పేర్ల మార్పిడికి అవకాశం లేదు. ఎవరి పేరిట కనెక్షన్ ఉంటుందో ఆ పేరుపైనే బిల్లు రానుంది. కాగా, గృహలక్ష్మి కింద దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్)లో 29,91,442 మందికి ఉచిత విద్యుత్ ప్రయోజనం అందనుంది. ప్రతి నెల 20వ తేదీలోపు 200 యూనిట్ల దాకా వినియోగించేవారి లెక్కలు తీసి సబ్సిడీ ఎంత అందించాలనేది ప్రభుత్వానికి డిస్కమ్‌లు ప్రతిపాదనలు సమర్పించాలి. అనంతరం ప్రభుత్వం డిస్కమ్‌లకు సబ్సిడీ విడుదల చేయనుంది.

సిలిండర్‌కు ముందస్తు చెల్లింపులు

కొద్ది రోజులే

» ఆ తర్వాత రూ.500 చెల్లిస్తే చాలు

» 'మహాలక్ష్మి' పథకానికి మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి వంటగ్యాస్ సబ్సిడీ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ప్రిన్సిపల్ సెక్రటరీ, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ జీవో నం.2తో పాటు మంగళవారం మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 955 ఉంది. లబ్ధిదారులు ఈ ధర చెల్లించి సిలిండర్ తీసుకోవాలి. తర్వాత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ (ఓఎంసీ)ల ద్వారా సబ్సిడీ సొమ్ము (రూ.500 పోగా మిగిలినది)ను వారి ఖాతాకు బదిలీచేస్తారు. కాగా, ఇది కొద్ది రోజుల పాటే ఉంటుందని, ఆ తర్వాత ఆర్థిక, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రూ.500 ఇచ్చి సిలిండర్ తీసుకునేలా చేస్తామని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు సబ్సిడీ మొత్తాన్ని అడ్వాన్స్ రూపంలో నెలకోసారి చెల్లిస్తుందని, అవి నేరుగా లబ్ధిదారులకు నగదు బదిలీ (డీబీటీ) చేస్తాయని వివరించారు. కాగా, ఈ పథకానికి సుమారు 40 లక్షల మందిని ఎంపిక చేశారు. తెల్ల రేషన్ కార్డుతో పాటు ఆధార్ కార్డు, వంటగ్యాస్ కనెక్షన్ ఉన్నప్పటికీ.. లబ్ధిదారుల జాబితాలో చోటు దక్కకపోతే... సంబంధిత తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదు చేయాలని, గ్యాస్ కనెక్షన్ నంబరుతో పాటు రేషన్, ఆధారు కార్డు జిరాక్సు కాపీల్లు సమర్పించి లబ్ధిదారుల జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవాలి. మహాలక్ష్మి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి అమలు చేస్తామని సీఎం రేవంత్ ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో 90 లక్షల మందికి తెల్ల కార్డులకు గాను 64 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో రెగ్యులర్‌గా బుక్ చేస్తున్నవారిని, తెల్ల కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, గ్యాస్ కనెక్షన్ వివరాలన్నీ సరిగా ఉన్న 40 లక్షల మందిని మొదటి విడత లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. రెండో విడతలో మిగిలినవారిని ఎంపిక చేయనున్నారు.

జీవోలో పేర్కొన్న మరిన్ని అంశాలు..

- తెల్ల కార్డు(ఆహార భద్రత)తో పాటు గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరికి మహాలక్ష్మి పథకంలో రూ.500 లకే వంటగ్యాస్ సిలిండర్ పంపిణీ.
- ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకుని ఉండాలి. ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ వినియోగదారుల పేరిట ఉండడంతో పాటు.. రెగ్యులర్‌గా గ్యాస్ బుకింగ్ చేస్తూ, సిలిండర్ వినియోగిస్తూ ఉండాలి.
- గత మూడేళ్లలో ఆ కుటుంబం సగటు వినియోగాన్ని తీసుకొని సబ్సిడీ సిలిండర్ కోటా నిర్ణయిస్తారు. లబ్ధిదారులకు సరఫరా అందుతుందా? లేదా? అని జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు మహాలక్ష్మి పథకాన్ని పర్యవేక్షిస్తారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, అప్‌డేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటారు.
- అర్హులైన వారికి జాబితాలో చోటు దక్కకపోతే క్షేత్రస్థాయిలో సిబ్బంది జాబితాలో చేర్పించాలి.
- ప్రజాపాలన పోర్టల్ ఏర్పాటుచేస్తారు.ఎప్పటికప్పుడు వివరాలు అప్‌డేట్ చేస్తారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

» ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

» మంగళవారం ప్రజావాణికి 1869 దరఖాస్తులు

బేగంపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లోని ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం ప్రజావాణి కార్యక్రమాన్ని చిన్నారెడ్డి పర్యవేక్షించారు. ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌తో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలను తీసుకోవడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. రెవెన్యూ, పోలీసు, మునిసిపల్, పౌరసరఫరాల శాఖ, ఉపాధి, విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ, పరిశ్రమలు, అటవీ, విద్యుత్తు, నీటి పారుదల, దేవాదాయ తదితర శాఖలకు సంబంధించి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగ, ఉపాధి కల్పన తదితర సమస్యలపై మొత్తంగా 1869 దరఖాస్తులొచ్చాయి. కాగా పలు కారణాలతో ఆర్టీసీ నుంచి డిస్మిస్ అయిన ఉద్యోగుల్లో కొందరు ప్రజావాణికొచ్చి వినతిపత్రం సమర్పించారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్, సెక్యూరిటి విధులు నిర్వహించే 1300 మందిని పలు కారణాలతో గత ప్రభుత్వం డిస్మిస్ చేసిందని, తిరిగి అందరినీ ఉద్యోగాల్లో తీసుకోవాలని వారు చిన్నారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని కమర్షియల్ ట్యాక్స్‌లో హౌస్‌కీపింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్న పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ శిక్షణ కేంద్రం ఉద్యోగులు వేతనాలు పెంచాలంటూ ప్రజావాణికొచ్చారు.


మంత్రి సీతక్క కారును ఆపి వినతి పత్రం

అధికార నివాసం నుంచి మంత్రి సీతక్క కారులో బయలుదేరగా ప్రజావాణి కార్యక్రమానికొచ్చిన ఓ వ్యక్తి, ఆ వాహనాన్ని ఆపి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమెను కోరారు. ఈమేరకు ఘట్‌కేసర్ మండలం నారపల్లికి చెందిన దానయ్య.. సీతక్క కాళ్ల మీద పడ్డారు. తనకు ఇద్దరు అబ్బాయిలు, ఓ అమ్మాయి ఉందని, వారికి ఉద్యోగావకాశం కల్పించడంతో పాటు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని వేడుకున్నారు. సమస్య పరిష్కరిస్తానని సీతక్క హామీ ఇవ్వడంతో ఆమెకు దానయ్య ధన్యవాదాలు తెలిపారు.

కబ్జాకు గురైన భూమిని ఇప్పించండి

మాది సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని గొడుగుపల్లి. నాకు, నా భర్తకు కలిసి గ్రామంలో 31గుంటల భూమి ఉంది. మా భూమి పక్కవారు కబ్జా చేయడంతో నాలుగేళ్ల కింద సర్వేకు చలానా కట్టాం. మండల సర్వే, సిద్దిపేట డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే చేయించినా కబ్జా చేసినట్టు తేల్చినా కబ్జాదారులు మా భూమిలోకి మమ్మల్ని రానివ్వడం లేదు. సర్వే సమయంలోనే అధికారుల ముందే భూమిలోకి వస్తే చంపుతాం అని మారణాయుధాలతో దాడికి యత్నించారు. సర్వే అధికారులను హద్దులు కూడా పాతనివ్వలేదు. దీనిపై మేము పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాం. మా భూమి మాకు ఇప్పించాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. ఎవరూ చర్యలు తీసుకోవడం లేదు. మా భర్త హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తారు. దానిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. మా గ్రామంలో ఉన్న భూమి మాకు ఇప్పించాలని ప్రజావాణిలో సీఎంకు ఫిర్యాదు చేసేందుకు వచ్చాం.

- దొంతిరెడ్డి సుప్రజ. గొడుగుపల్లి, దౌల్తాబాద్ మండలం, సిద్దిపేట జిల్లా



హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వ పదవుల భర్తీ

- 11 మంది జీపీలు, 44 ఏజీపీల నియామకం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వ న్యాయవాదుల పదవుల భర్తీ ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం వేగవంతం చేసింది. 11 మంది గవర్నమెంట్ ప్లీడర్లు (జీపీ)లు, 44 మంది అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ల (ఏజీపీ)లను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర న్యాయశాఖ రెండు వేర్వేరు జీవోలు జారీచేసింది. జీపీలుగా నియమితులైన వారిలో మహేశ్ రాజే, గడ్డం వీరస్వామి, ఎస్ సత్యనారాయణ రావు, ఏ జగన్, కే మురళీధర్‌రెడ్డి, బీ మోహన రెడ్డి, ఎన్ శాంతి, ఎన్ఎస్ అర్జున్‌కుమార్, షాజియా పర్వీన్, భూక్య మంగీలాల్ నాయక్, ఈ రమేశ్‌చంద్ర గౌడ్ ఉన్నారు.

స్థానికేతరులు రాజీనామా చేయాలని డిమాండ్

ఇటీవల ప్రభుత్వం నియమించిన స్పెషల్ గవర్నమెంట్ ప్లీడర్ పదవుల్లో స్థానికేతరులు ఉన్నారని హైకోర్టులో వివాదం మొదలైంది. స్థానికేతరులను ఎలా నియమిస్తారని స్థానిక న్యాయవాదులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. స్థానికేతర న్యాయవాదులు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అడ్వకేట్స్ జేఏసీ పేరుతో హైకోర్టులో పోస్టర్లు వెలిశాయి.

నేడు సుప్రీంకోర్టులో కవిత కేసు విచారణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనకు నోటీసులు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన కేసుపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరగనుంది. కేసు దర్యాప్తులో భాగంగా గత ఏడాది మార్చిలో ఆమెను ఈడీ అధికారులు ఢిల్లీ కార్యాలయంలో మూడు రోజులపాటు సుదీర్ఘంగా విచారించారు. తాను గతంలో వినియోగించిన సెల్‌ఫోన్లను ఆమె ఈడీ అధికారులకు అప్పగించారు. ఆ తర్వాత గత ఏడాది సెప్టెంబరులో మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. వీటిని సవాలు చేస్తూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై ఎలాంటి చర్యలనుతీసుకోకుండా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో నవంబరు వరకు విచారణకు పిలవొద్దని సుప్రీంకోర్టు ఈడీకి సూచించింది. ఇంతలో తెలంగాణ శాసనసభ ఎన్నికలు రావడంతో విచారణ తాత్కాలికంగా నిలిచింది. తాజాగా ఈ నెల 26న విచారణకు రావాలని మళ్లీ నోటీసులు పంపింది. అయితే.. ముందుగా ఖరారయిన కార్యక్రమాలు ఉన్నందున విచారణకు హాజరుకాలేనని, కావాలంటే ఆన్‌లైన్‌లో విచారణకు అందుబాటులో ఉంటానని ఈడీకి సమాధానం ఇచ్చారు. కేసు సుప్రీంకోర్టులో ఉన్న విషయాన్ని లేఖలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం తుది విచారణ జరపనుంది.

ఈఎస్ఐసీ ఆస్పత్రిలో తొలి కిడ్నీ మార్పిడి చికిత్స

సనత్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ ఆస్పత్రిలో నిర్వహించిన మొట్టమొదటి మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైంది. జీవన్‌దాన్ సహకారంతో బ్రెయిన్‌డెడ్‌కు గురైన ఓ వ్యక్తికి చెందిన మూత్రపిండాన్ని తీసి సనత్‌నగర్ ఈఎస్ఐసీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో డయాలసిస్‌పై ఉన్న రోగికి అమర్చారు. ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు జగదీశ్వర్, పాండురంగారావు, ధనలక్ష్మిలు ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాజ్‌కుమార్ అనే వ్యక్తికి కిడ్నీలు చెడిపోవడంతో నాలుగేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కాగా, ఈనెల 21న ఉస్మానియా ఆస్పత్రిలో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తికి చెందిన కిడ్నీలు సేకరించారు. వాటిని ప్రత్యేక వాహనంలో ఈఎస్ఐసీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సను పూర్తిచేశారు. ఈఎస్ఐ ఆస్పత్రి చరిత్రలోనే ఇది మొదటి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స అని డాక్టర్ జగదీశ్వర్ తెలిపారు. రోగి క్రమంగా కోలుకుంటున్నాడని, క్రియాటిన్ కూడా అదుపులోకి వచ్చిందన్నారు. త్వరలోనే డయాలసిస్ అవసరం లేకుండా రాజ్‌కుమార్ సాధారణ జీవితం గడపవచ్చన్నారు. ఈ శస్త్రచికిత్సకు సహకరించిన వైద్యులు, జీవన్‌దాన్ ఇన్‌చార్జ్ డాక్టర్ స్వర్ణలతకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రి నిర్వహణలో దేశంలోనే రెండో స్థానం

అత్యుత్తమ సేవలు, ఆస్పత్రి నిర్వహణ తదితర అంశాలు ప్రామాణికంగా తీసుకున్న జాబితాలో సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆస్పత్రి దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని డీన్ డాక్టర్ మాధురి కాటే తెలిపారు. ఈఎస్ఐసీ 73వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేంద్రం ఎంపిక చేసిన జాబితాలో సనత్‌నగర్ ఆస్పత్రి రెండో స్థానంలో నిలిచిందన్నారు.

1న చలో మేడిగడ్డ

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలోనూ ఆయన మాట్లాడారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలందరితో కలిసి 200 మందికిపైగా బస్సుల్లో మార్చి 1న ఉదయం 8 గంటలకు మేడిగడ్డకు వెళ్తామన్నారు. కేవలం మేడిగడ్డ మాత్రమే కాకుండా కాళేశ్వరానికి సంబంధించిన అన్ని ప్రాజెక్టులను సందర్శిస్తామని పేర్కొన్నారు. తద్వారా రాష్ట్ర ప్రజలందరికీ కాళేశ్వరం ప్రాముఖ్యతను తెలియపరుస్తామన్నారు. మేడిగడ్డ సందర్శనకు ఇష్టమైతే కాంగ్రెస్ నాయకులు కూడా రావొచ్చని, ఎవరు వచ్చినా తీసుకువెళ్తామని చెప్పారు. మేడిగడ్డ సందర్శనకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రావడం లేదన్నారు. పార్టీ నేతల మేడిగడ్డ సందర్శన తర్వాత కేసీఆర్ మీడియాతో సమావేశమై అన్ని విషయాలు చెబుతారని వెల్లడించారు. మేడిగడ్డ సందర్శనకు ప్రభుత్వం అనుమతి కూడా తీసుకోవాలా? అభ్యంతరాలు ఏమైనా ఉంటే.. అవసరాన్ని బట్టి అనుమతి తీసుకుంటామని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కూల్చేందుకు రేవంత్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. రానున్న వర్షాకాలం వరదల్లో కాళేశ్వరం పరిధిలోని మూడు బ్యారేజీలు కొట్టుకుపోవాలని వారు చూస్తున్నారన్నారు. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా కొట్టుకుపోతాయని రాష్ట్ర మంత్రులే చెబుతున్నారని, దీన్నిబట్టి ప్రాజెక్టు మొత్తం కొట్టుకుపోవాలని వారి కుట్రపూరిత ఆలోచనలతో ఉన్నారన్నారు. చిన్న సమస్య ఏర్పడగా పరిష్కారం దిశగా వెళ్లకుండా కేసీఆర్‌ను, గత ప్రభుత్వాన్ని బద్నామ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే ఈనెల 10న కరీంనగర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కాగ్ రిపోర్ట్ భగవద్గీత కురాన్, బైబిల్ కాదని గతంలో కాంగ్రెస్ పాలకులే చెప్పారని గుర్తు చేశారు.

కాళేశ్వరంతోనే భూగర్భ జలాలు పెరిగాయి

దురదృష్టవశాత్తు మేడిగడ్డ బ్యారేజీలోని మూడు పిల్లర్లకు పగుళ్లు వచ్చాయని.. దాన్ని వింత సంఘటన లాగా చిత్రించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని



అంబర్‌పేట బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

కేటీఆర్ అన్నారు. 1957లో కడెం ప్రాజెక్టు కొట్టుకుపోయిందని, ప్రకాశం, దవళేశ్వరం బ్యారేజీల్లోనూ సమస్యలు వచ్చాయన్నాని పేర్కొన్నారు. 2 నెలల్లో కాఫర్ డ్యామ్ కట్టి మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయొచ్చని, ఆ తర్వాత నీళ్లు ఇచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం తక్షణం స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కాళేశ్వరం జలాలతో వాగులు, చెరువులనూ నింపామని, దీంతో భూగర్భ జలాలు పెరిగాయని చెప్పారు.

పైసా పని చేయని కిషన్‌రెడ్డి అవసరమా..?

సబ్సిడీపై రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం పచ్చి మోసమని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 96 లక్షల తెల్ల రేషన్ కార్డుదారులు.. 1.24 కోట్ల గ్యాస్ కనెక్షన్లుంటే.. 35 లక్షల మందికే రాయితీ ఇస్తామంటున్నారని, ఇదేం విధానమంటూ నిలదీశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు సరఫరాలోనూ ఆంక్షలు పెడుతున్నారని, అప్పుడు అందరికీ అన్ని అని.. ఇప్పుడు కొందరికే కొన్ని అని చెప్పడం సబబు కాదని విమర్శించారు. ఎన్నికలప్పుడే ఈ విషయాలు చెబితే ప్రజలు జాడిచ్చి తన్నేవారన్నారు. డిసెంబరు 9న చేస్తామన్న రైతు రుణమాఫీ ఇప్పటికీ జరుగలేదని, రైతుబంధు కూడా రాక అన్నదాతలు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ దొంగ హామీలు ప్రజలకు అర్థమయ్యాయని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కరోనా విపత్తు సమయంలో, వరదలు వచ్చినప్పుడు కేంద్రం నుంచి పైసా తీసుకురాలేని, అంబర్‌పేట, ఉప్పల్ ఫ్లైఓవర్ల నిర్మాణం పూర్తి చేయించలేని అసమర్థ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అవసరమా..? ప్రజలు ఆలోచించాలన్నారు. మోదీ మొఖం చూసి ఓట్లేయాలని కిషన్‌రెడ్డి అడుగుతున్నారంటే.. ఆయనను ప్రజలు ఆదరించరన్న విషయం అర్థమవుతోందన్నారు. తెలంగాణ కోసం తెగించి కొట్లాడే బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఉంటేనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని చెప్పారు. కాగా, అంబర్‌పేటలో బీఆర్ఎస్ సమావేశం ముగిసిన తర్వాత అక్కడి నుంచి వెళ్తున్న కేటీఆర్ కాన్వాయ్‌ను శివంరోడ్డులోని పాపాజీ దాబా వద్ద యూత్ కాంగ్రెస్ గ్రేటర్ అధ్యక్షుడు మోతే రోహిత్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది.

సాగునీటికి లెక్కలు వేస్తారా..?

వ్యవసాయం బాగుపడాలని చేపట్టిన భారీ సాగునీటి ప్రాజెక్టుకు రూ.వేలకోట్లు ఖర్చు అనవసరం అంటూ.. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ సన్నాయి నొక్కులు నొక్కడం తగదని కేటీఆర్ అన్నారు. సాగునీటి వసరుల కల్పనకు వెచ్చించే డబ్బుకు రాబడి లెక్కించడం ఏమిటి..? ప్రభుత్వం ఖర్చులు, లాభాల లెక్కలు వేస్తే ఆస్పత్రులు, ఐఐటీలు ఏర్పాటు చేయడం మానుకోవాల్సిందేనని వ్యాఖ్యానించారు. నీళ్లు రాకుండానే తెలంగాణ భూముల ధరలు పెరిగాయా? అని ప్రశ్నించారు. అసలు పనంతా తాము చేశామని.. మిగిలిన కొసరు పని చేయకుండా తమను బద్నాం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎంపీ టికెట్ల కోసం బీజేపీలో పోటీ

- మల్కాజిగిరిపై ఈటల, మురళీధర్ గురి
- పాలమూరు టికెట్‌పై అరుణ, జితేందర్ ఆశలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో పలు స్థానాలపై బీజేపీ నేతల మధ్య పోటీ నెలకొంది. మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్ పోటీ చేయడానికి సిద్ధంగా ఉండగా, ఆ సీటు తనకు కేటాయించాలని సీనియర్ నేత మురళీధర్ రావు రంగంలోకి దిగడంతో బీజేపీ ఢిల్లీ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. ఫిబ్రవరి 1న జరిగే పార్లమెంటరీ బోర్డులో పార్టీ అభ్యర్థుల తొలి జాబితా ఖరారు చేయాలని భావిస్తున్న తరుణంలో.. ప్రతి నియోజకవర్గానికీ ఒకరిద్దరు పోటీ పడడంతో పార్టీ పెద్దలు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం కోసం డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి పోటీ పడుతున్నారు. భువనగిరి టికెట్ కోసం బూరనర్సయ్యగౌడ్, శ్రీరాం వెదిరె పోటీపడుతున్నారు. బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, కిషన్‌రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ రాములు పేర్లు తొలి జాబితాలో ఉండే అవకాశాలున్నాయి. బీఆర్ఎస్ ఎంపీగా ఉన్న రాములు బుధవారం ఢిల్లీలో బీజేపీలో చేరనున్నారు.

ఎన్వీఎస్ఎస్‌కు దీపాదాస్ మున్షీ లీగల్ నోటీసు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ లీగల్ నోటీస్ పంపారు. కాంగ్రెస్ నేతల నుంచి తాను బెంజ్ కారును బహుమతిగా పొందినట్లు ప్రభాకర్ చేసిన ఆరోపణలకు సంబంధించి రెండు రోజులల్లో ఆధారాలు చూపించాలని నోటీస్‌లో డిమాండ్ చేశారు. ఆధారాలు చూపించని పక్షంలో రూ.10 కోట్లు పరువు నష్టం దావా వేయనున్నట్లు దీపాదాస్ హెచ్చరించారు.

అబద్ధపు ప్రచారం చేసేవారిపై లీగల్ చర్యలు: ప్రభాకర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకుంటుందని అబద్ధపు ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దీపాదాస్ మున్షీ నుంచి లీగల్ నోటీసులు తనకు అందలేదన్నారు. గతంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌లుగా పనిచేసిన వారిపై ఆ పార్టీ సభ్యులే ఆరోపణలు చేశారని.. దానిపై వారి అధిష్ఠానం ఇప్పటి వరకూ విచారణ జరపలేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు శాఖల్లో అవినీతి జరుగుతోందని ఆరోపణలు వస్తున్నా.. సీఎం రేవంత్ విచారణకు ఆదేశించట్లేదని ప్రభాకర్ విమర్శించారు.



కేటీఆర్‌ను సీఎం చేస్తామంటే.. బీఆర్ఎస్‌కు 3 సీట్లు కూడా వచ్చేవి కావు

- ఆయన ముఖ్యమంత్రి అవుతారనే బీఆర్ఎస్‌ను ఓడించారు
- రేవంత్ ఫైటర్.. 17 ఏళ్లు కష్టపడి ముఖ్యమంత్రి అయ్యారు
- రోజా ఐటమ్ రాణి.. పులుసు పాప
- కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌ను సీఎం చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించి ఉంటే బీఆర్ఎస్‌కు మూడు సీట్లు కూడా వచ్చేవి కాదని టీపీసీసీ నాయకుడు బండ్ల గణేష్ వ్యాఖ్యానించారు. తండ్రి పేరు అడ్డుపెట్టుకుని కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చారని.. కేసీఆర్ కుమారుడిగా తప్ప ఆయనకు ఎలాంటి గుర్తింపు లేదన్నారు. కేటీఆర్ చుట్టూ ఇగో (అహంకారం) వైఫైలా ఉంటుందని, ఆయన తీసేసిన తహసీల్దార్ అని, రేవంత్‌రెడ్డి సీఎం కావడాన్ని తట్టుకోలేక 200-300 యూట్యూబ్ చానెళ్లు పెట్టి రేవంత్‌ను తిట్టిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం గాంధీభవన్‌లో బండ్ల గణేష్ విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌ను సీఎం చేస్తామని చెప్పి ఉంటే కాంగ్రెస్ ఎన్నికల్లో 30 సీట్లు కూడా గెలిచేది కాదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. అసలు కేటీఆర్‌ను సీఎం చేస్తారనే బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారని అన్నారు. రేవంత్ పోరాట యోధుడని, 17 ఏళ్ల పాటు కష్టపడి, బీఆర్ఎస్ పెట్టిన చిత్రహింసలు, మానసిక క్షోభను అధిగమించి సీఎం అయ్యారని పేర్కొన్నారు. 'కేటీఆర్‌ను బీఆర్ఎస్ వాళ్లే నమ్మడం లేదు. ఇల్లు కొనుక్కోవడానికే అమెరికా వెళ్లారు. కేటీఆర్ మంత్రిగా పనిచేసిన మునిసిపల్ శాఖలోని ఐదో ర్యాంకు అధికారి రూ.వందల కోట్ల అక్రమ ఆస్తులు సంపాదించారు. ఫార్ములా రేసింగ్‌కు కేటీఆర్ చెబితేనే రూ.10 కోట్లు ఇచ్చానని ఐఏఎస్ అధికారి చెప్పారు" అని గణేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలతో పాటు స్వేచ్ఛ అనే 7వ గ్యారెంటీని కూడా ఇచ్చిందని.. బీఆర్ఎస్ హయాంలో ముఖ్యమంత్రికి ఒక ప్రతిపక్ష ఎమ్మెల్యే చెప్పు చూపిస్తే బతకనిచ్చేవారా? అని ప్రశ్నించారు. మేడిగడ్డకు వెళ్లి బీఆర్ఎస్ నాయకులు ఏం చేస్తారని నిలదీశారు. ఎలా నాశనం చేశారో చూసి వస్తారా అని ఆయన ప్రశ్నించారు.

రోజాకు టికెటే రాదు..

రేవంత్‌రెడ్డి యాక్సిడెంటల్ సీఎం అని ఏపీ మంత్రి ఆర్కే రోజా వ్యాఖ్యానించడంపై బండ్ల గణేష్ తీవ్రంగా స్పందించారు. రోజా డైమండ్ రాణి, ఐటమ్ రాణి, పులుసు పాప అని ఎద్దేవా చేశారు. నిజమైన యాక్సిడెంటల్ సీఎం జగన్ అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో రోజాకు టికెట్ కష్టమేనని జోస్యం చెప్పారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy.no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 28 ఫిబ్రవరి 2024

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)- లేటరల్ ఎంట్రీ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఎల్ఈఈఈ) 2024, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(పీజీఈఈ) 2024 నోటిఫికేషన్‌లను విడుదల చేసింది. లేటరల్ బీటెక్-ఎంఎస్; ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి వీటిని ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్స్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

హైదరాబాద్ ఐఐఐటీలో లేటరల్ ఎంట్రీ, పీజీ ఎంట్రెన్స్ టెస్ట్‌లు



లేటరల్ ఎంట్రీ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎల్ఈఈఈ)

ఈ ఎగ్జామ్ ద్వారా డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(బీటెక్-ఎంఎస్)లో లేటరల్ ఎంట్రీకి అవకాశం కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొదట బీటెక్ డిగ్రీని ఆ తరవాత రీసెర్చ్ థీసిస్ పూర్తిచేసి ఎంఎస్ డిగ్రీని పొందవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీడీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్‌డీ)

అర్హత: ఈసీడీ విభాగానికి బీఈ/బీటెక్(ఈసీఈ/ఈటీఈ/ఈఐఈ/ ఈఈఈ/ఐఓటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్); సీఎస్‌డీ విభాగానికి బీఈ/బీటెక్(సీఎస్ఈ/ఐటీ/ఏఐ అండ్ ఎంఎల్/డేటా సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్) చదువుతున్న అభ్యర్థులు అర్హులు. 2024 జూలై నాటికి నాలుగో సెమిస్టర్ పూర్తిచేసి ఉండాలి. కొవిడ్-19 వల్ల అకడమిక్ ఇయర్‌లో వచ్చిన మార్పుల కారణంగా దరఖాస్తు నాటికి మూడో సెమిస్టర్ పూర్తిచేసినవారిని అనుమతిస్తున్నారు. కనీసం 80 శాతం మార్కులు తప్పనిసరి.

ఎల్ఈఈఈ 2024 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి నిర్వహించే పరీక్షలో జనరల్ ఆప్టిట్యూడ్, మేథమెటిక్స్, డిజిటల్ లాజిక్, సర్క్యూట్ థియరీ అండ్ నెట్‌వర్క్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్ అండ్ సర్క్యూట్స్, సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి నిర్వహించే ఎగ్జామ్‌లో జనరల్ ఆప్టిట్యూడ్, మేథమెటిక్స్, డిజిటల్ లాజిక్, సీ-ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, బేసిక్ అల్గారిథమ్స్ అండ్ ప్రాబ్లం సాల్వింగ్, డిస్క్రీట్ మేథమెటిక్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం మూడు గంటలు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(పీజీఈఈ)

ఈ ఎగ్జామ్ ద్వారా ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంటెక్, ఎంఎస్ ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి అయిదేళ్లు. వీటిలో కోర్సు వర్క్ ప్రధానంగా ఉంటుంది. ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో అదనంగా రీసెర్చ్ థీసిస్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డిజైన్ అండ్ మేనేజ్‌మెంట్

ఎంఎస్(రీసెర్చ్) స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, బయోఇన్ఫర్మాటిక్స్

పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, బయోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్, స్పేషియల్ ఇన్ఫర్మాటిక్స్, కాగ్నిటివ్ సైన్స్, హ్యూమన్ సైన్సెస్

అర్హత: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌కు సివిల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ప్రొడక్ట్ డిజైన్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ/డిజైన్/సైన్స్) ఉత్తీర్ణులు లేదా మాస్టర్స్ డిగ్రీ(సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి. పీహెచ్‌డీలో కాగ్నిటివ్ సైన్స్ స్పెషలైజేషన్‌కు కాగ్నిటివ్ సైన్స్/సైకాలజీ/లింగ్విస్టిక్స్/ఫిలాసఫీ/సైన్సెస్ విభాగాల్లో డిగ్రీ/పీజీ పూర్తిచేసినవారు, ఎంబీబీఎస్/ఎండీ ఉత్తీర్ణులు అర్హులు. హ్యూమన్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు హ్యూమానిటీస్/సోషల్ సైన్సెస్ విభాగాల్లో ఎంఏ పూర్తిచేసినవారు; బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు అయిదేళ్ల అనుభవం ఉన్నవారు; ఎమ్మెస్సీ/ఎంఎస్/ఎంటెక్ ఉత్తీర్ణతతోపాటు రీసెర్చ్ థీసిస్ సబ్మిట్ చేసినవారు అర్హులు. కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్‌కు ఎమ్మెస్సీ(ఫండమెంటల్ సైన్సెస్) లేదా సీఎస్/ఐటీ/బయోటెక్నాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/బయోమెడ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్ పూర్తి చేసి ఉండాలి. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంఏ (మేథ్స్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీఈఈ 2024 వివరాలు: దీనిని కూడా సీబీటీ మోడ్‌లోనే నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటిది జనరల్ ఆప్టిట్యూడ్. ఇందులో బేసిక్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, కంప్యూటర్స్, మేథమెటిక్స్ అంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. రెండోది సబ్జెక్ట్ పేపర్. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ సబ్జెక్టులు ఉంటాయి. అభ్యర్థి డిగ్రీ స్థాయిలో చదివిన విభాగాన్ని అనుసరించి సబ్జెక్ట్ పేపర్ ఎంచుకోవాలి. రెండు పేపర్లకూ నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పేపర్‌కు గంటన్నర చొప్పున మొత్తం పరీక్ష సమయం మూడు గంటలు. ఎంటెక్‌లో ప్రవేశానికి రెండు పేపర్లూ రాయాలి. ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు సబ్జెక్ట్ పేపర్ ఉండదు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. పీహెచ్‌డీలో హ్యూమన్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు ఎగ్జామ్ రాయనవసరం లేదు. వీరు రీసెర్చ్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.2,500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **ఎల్ఈఈఈ పీజీఈఈ తేదీ:** మే 4న
- **పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్
- **ఇంటర్వ్యూలు:** లేటరల్ ఎంట్రీకి మే 25న; ఎంఎస్(రీసెర్చ్) ప్రోగ్రామ్‌నకు జూన్ 5, 6; పీహెచ్‌డీకి జూన్ 7, 8
- **వెబ్‌సైట్:** iiit.ac.in

ఐఐటీ మద్రాస్‌లో సమ్మర్ ఫెలోషిప్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ మద్రాస్)- 'సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ 2024'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. దీనిని మే 22 నుంచి జూలై 21 వరకు నిర్వహిస్తారు. విద్యార్థుల సౌలభ్యాన్ని అనుసరించి ఈ షెడ్యూల్‌ను మార్చే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగాలకు సంబంధించి సంస్థలో మినీ రీసెర్చ్ ప్రాజెక్ట్ వర్క్ చేయాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.6,000 చొప్పున గరిష్ఠంగా రెండు నెలలు స్టయిపెండ్ ఇస్తారు.

ఫెలోషిప్ విభాగాలు

ఇంజనీరింగ్: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, అప్లయిడ్ మెకానిక్స్ అండ్ బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, ఓషన్ ఇంజనీరింగ్

సైన్స్: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్

మేనేజ్‌మెంట్: హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్

అర్హత: బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ మూడో ఏడాది చదువుతున్నవారు; ఇంటిగ్రేటెడ్ ఎంఈ/ఎంటెక్ ప్రోగ్రామ్‌లకు సంబంధించి మూడు/నాలుగో ఏడాది చదువుతున్నవారు; ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/ఎంఏ/ఎంబీఏ మొదటి ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ ఎగ్జామ్స్‌లో అధిక స్కోర్ సాధించినవారికి, సెమినార్లలో పేపర్స్ ప్రజంట్ చేసినవారికి, ప్రాజెక్ట్‌లు నిర్వహించినవారికి, డిజైన్ కంటెస్ట్‌లలో పాల్గొన్నవారికి, మేథమెటిక్స్ ఒలింపియాడ్‌లో ర్యాంక్/స్కోర్ సాధించినవారికి ప్రాధాన్యం ఉంటుంది. విద్యార్థులు తమ ఇన్‌స్టిట్యూట్ నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా సబ్మిట్ చేయాలి. ఐఐటీ విద్యార్థులు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31న సాయంత్రం 5 గంటల వరకు
- **వెబ్‌సైట్:** https://sfp.iitm.ac.in

లిటిల్స్



నమ్మక ద్రోహి


ఒక అడవిలో గద్ద, కుందేలు దగ్గర దగ్గరగా ఉండేవి. కుందేలు జోలికి గద్ద పోయేది కాదు. ఒక రోజు గద్ద ఆహారం కోసం బయటకు వెళ్లింది. తిరిగి రెండు రోజులయినా రాలేదు. దీంతో కుందేలుకు ఆ చెట్టు ఎక్కాలనిపించింది. చెట్టు మీద భలే ఉందే.. అనుకుంటూ చెట్ల కొమ్మల మీద ఆడుకుంది. ఇక ఏం చేయాలో తెలీక.. గెంతులేసింది. గద్ద కట్టుకున్న గూడు మీద కూర్చుంది. గుడ్లు కింద పడి పగిలిపోయాయి. ఏమీ తెలీనట్లు వెళ్లిపోయింది కుందేలు.

రెండు రోజుల తర్వాత గద్ద వచ్చింది. తన గుడ్లు, గూడు చెదిరిపోవటంతో కోపంతో ఊగిపోయింది. ఎవరు చేశారో వాళ్ల పని పడతానని భీష్మించుకుంది. ఆ మరుసటి రోజు దినసరి పనిలా ఆహారం కోసం వెళ్లింది. వెళ్లిన కాసేపట్లో తిరిగొచ్చింది. తన కొత్త గూటిలో కుందేలు ఉంది. 'ఈ పని నీదేనా? పక్కకు వెళ్లిపో' అన్నది గద్ద. 'ఇది నా గూడు. ఎవరు ఉంటేవారిదే ఆ స్థలం' అన్నది కుందేలు. రెండు గొడవ పడ్డాయి. ఆ గొడవకు మిగతా జంతువులు గుమికూడాయి. ఎవరికీ న్యాయం చెప్పలేక అందరూ అలా కూర్చుండిపోయారు.




రెండూ కొట్లాడుతూ నది పక్కకు వెళ్లాయి. నది పక్కన చెట్టు కింద ఓ ముసలి పిల్లి ఉంది. ఆ పిల్లిని తీర్పు చెప్పమని అడిగాయి. ఆ పిల్లి పట్టించుకోలేదు. ధ్యాన ముద్రలో ఉంది. 'మీరు పెద్దవారిలా ఉన్నారు. నా ఇంటిలో ఇలా చేసింది కుందేలు' అంటూ విషయం చెప్పింది. పిల్లి స్పందించలేదు. ఆ తర్వాత వెంటనే తన గోడును కుందేలు వెళ్లబోసుకుంది. పిల్లికి ఎవరి తరఫున మాట్లాడాలో అర్థం కాలేదు. మౌనంగా కూర్చున్న పిల్లి ఇలా అంది.. 'మీ బాధ అర్థమైంది. వయోభారం వల్ల ఇలా మౌనంగా ఉన్నా. చెవులు సరిగా వినపడలేదు. దయచేసి మళ్లీ చెప్పండి' అన్నది గద్ద. వెంటనే కుందేలు, గద్ద పిల్లి దగ్గరకు పోయాయి. వెంటనే రెండింటి మెడలను ఒకేసారి పట్టుకుని గట్టిగా నొక్కేసింది. రెండూ ప్రాణాలు విడిచాయి. 'నేనే దొరికానా మీకు న్యాయం చెప్పడానికి' అంటూ పిల్లి సంబరపడిపోయింది.

8 తేడాలను గుర్తించండి



ఎన్ని పక్షులు ఉన్నాయి?





సరైన నీడ ఏది?

డైలీ సుడోకు - 241

9	3	8		2		7		
							1	
				4	6			
	7				1	9		
5		9				4		3
		2	6				7	
			4	1				
	9							
		1		8		6	2	7

సుడోకు - 240 సమాధానం

1	5	7	2	9	6	8	4	3
9	4	6	7	3	8	1	2	5
8	3	2	5	1	4	7	9	6
2	6	1	3	7	9	5	8	4
7	9	3	4	8	5	2	6	1
4	8	5	1	6	2	3	7	9
6	1	9	8	2	3	4	5	7
5	7	8	6	4	1	9	3	2
3	2	4	9	5	7	6	1	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

SCHOLARSHIP ALERT

K.C. Mahindra Scholarships for Post-Graduate Studies Abroad

Description: K.C. Mahindra Scholarships for Post-Graduate Studies Abroad 2024 is an opportunity offered by the K. C. Mahindra Education Trust, a public charitable trust, for graduate students who are willing to pursue postgraduate studies abroad in various fields.



Eligibility: Open for Indian citizens who have a first-class degree or equivalent diploma of similar standard from recognised universities. Applicants must have secured admission or have applied for admission in reputable foreign universities for courses commencing from August 2024 but not later than February 2025.

Prizes & Rewards: Interest-free loan scholarship of up to 10,00,000

Last Date to Apply: 31-03-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/KCMQ1

ICRO Amrit Internship Programme

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion.

Last Date to Apply: Round the year

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/ICRA1

India Fellow Social Leadership Program

Description: India Fellow Social Leadership Program 2024-25 is an opportunity offered by the India Fellow for graduate students and young professionals between 20 and 30 years of age. It is an 18- month leadership program designed to help participants develop their skills and make a positive impact on communities.

Eligibility: Open for Indian citizens aged between 20 to 30 years.

Applicants must be graduates in any discipline or about to complete graduation by the fellowship start date. Students must be ready for an 18-month full-time commitment to the fellowship and prepared to be placed in any part of the country and any the matic area.

Prizes & Rewards: A monthly stipend of up to 22,000 and other benefits

Last Date to Apply: 15-08-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/IFSA2


buddy4study.com

మిస్సింగ్ నంబర్ టెస్ట్

పార్ట్-2

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 63 బి) 58 సి) 73 డి) 52

సమాధానం: (సి)

వివరణ: మొదటి డయాగ్రామ్‌లో

$8 \times 4 = 32$ $6 \times 8 = 48$ $32 + 48 = 80$

రెండో డయాగ్రామ్‌లో


$7 \times 8 = 56$ $6 \times 4 = 24$ $56 + 24 = 80$

అదేవిధంగా మూడో డయాగ్రామ్‌లో

$9 \times 5 = 45$ $7 \times 4 = 28$

$45 + 28 = 73$ సమాధానం అవుతుంది.

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 45 బి) 62 సి) 56 డి) 72

సమాధానం: (ఎ)

వివరణ: ప్రతి డయాగ్రామ్‌లో కింది రెండు అంకెల లబ్ధం పైన గల సంఖ్య

$6 \times 7 = 42$ $9 \times 8 = 72$ అదేవిధంగా

$5 \times 9 = 45$ సమాధానం అవుతుంది.

3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

$^{P}32$	$^{R}17$	$^{Q}7$
$^{Q}26$	$^{P}38$	$^{R}8$
$^{R}12$	$^{Q}24$	?

ఎ) P_8 బి) P_6 సి) Q_8 డి) R_7

సమాధానం: (బి)

వివరణ: ఇచ్చిన డయాగ్రామ్‌లో ప్రతి వరుసలోను P, Q, Rలు నిలువుగా, అడ్డంగా ఏదో ఒక స్థానంలో ఉంటున్నాయి.


ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో ఉండాల్సిన అక్షరం P. ప్రతి అడ్డ వరుసలో మొదటి రెండు సంఖ్యలను కూడితే ఏర్పడే సంఖ్య, మూడో స్థానంలో గల సంఖ్యకు వర్గం.

$32 + 17 = 49$ అనేది 7^2

$26 + 38 = 64$ అనేది 8^2 అదేవిధంగా

$12 + 24 = 36$ అనేది 6^2. కాబట్టి సమాధానం P_6 అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 15 బి) 72 సి) 54 డి) 32


సమాధానం: (సి)

వివరణ: మొదటి డయాగ్రామ్‌లో $8 \times 7 = 56$.

రెండో డయాగ్రామ్‌లో $3 \times 5 = 15$

కాబట్టి మూడో డయాగ్రామ్‌లో $9 \times 6 = 54$ సమాధానం అవుతుంది.

5. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 168 బి) 182 సి) 122 డి) 146

సమాధానం: (సి)

వివరణ: త్రిభుజానికి మూడువైపుల గల సంఖ్యల వర్గాలను కూడగా త్రిభుజంలోని సంఖ్య వస్తుంది.

$6^2 + 4^2 + 5^2 = 36 + 16 + 25 = 77$

$9^2 + 1^2 + 2^2 = 86$

కాబట్టి $7^2 + 8^2 + 3^2 = 49 + 64 + 9 = 122$



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ



ఐఎంఎస్సీలో ఫ్యాకల్టీ

చెన్నైలోని ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేథమెటికల్ సైన్సెస్(ఐఎంఎస్సీ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 8

విభాగాలు: ఫెలో-ఇ, రీడర్-ఎఫ్, ప్రొఫెసర్-జి, ప్రొఫెసర్-హెచ్

అర్హత: ఫిజిక్స్, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటేషనల్ బయాలజీలో పీహెచ్‌డీ ఉత్తీర్ణత. 5 నుంచి 15 ఏళ్ల పరిశోధనానుభవం ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 29

వెబ్‌సైట్: www.imsc.res.in/